శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



2వ తేదీన తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవ కార్యక్రమాలు

03

సంపుటి 07, సంచిక: 179 | శుక్రవారం | 31-05-2024 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 8+8 | వెల రూ. 5.00

## 'నైరుతి' ఆగమనం

**కేరళను తాకిన రుతుపవనాలు**

**రెండు, మూడు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశం**



**న్యూఢిల్లీ :** దేశమంతా భానుడి భగభగలతో మండుతున్న వేళ భారత వాతావరణ శాఖ(ఐఎండి) చల్లని కబురు అందించింది. నైరుతి రుతుపవనాలు కేరళను తాకినట్లు ప్రకటించింది. ఈశాన్య రాష్ట్రాల వైపు విస్తరించినట్లు వెల్లడించింది. మూడు, నాలుగు రోజుల్లో రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించే అవకాశమున్నట్లు పేర్కొంది. అంచనా వేసిన దాని కంటే ముందుగానే నైరుతి రుతుపవనాలు ఈశాన్య రాష్ట్రాలను తాకడానికి రెమాల్ తుపాను కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. కాగా, మే 31 నాటికి కేరళను నైరుతి రుతుపవనాలు తాకుతాయని ఐఎండి అంచనా తరువాయి 2లో

## లోయలోకి యాత్రికుల బస్సు

**22 మంది దుర్మరణం: 57 మందికి గాయాలు**



**జమ్ము :** జమ్ముకశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. యాత్రికులతో వెళ్తున్న బస్సు అదుపు తప్పి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 22 మంది దుర్మరణం చెందారు. మరో 57 మందికి గాయాలైనట్లు అధికారులు చెప్పారు. ఘటన పట్ల జమ్ముకశ్మీర్ ఎల్‌జి మనోజ్ సిన్హా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గాయపడిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. రూ.50వేలు పరిహారం ప్రకటించారు. చౌకిచోర బెల్ట్‌లోని టుంగి–మోర్చా వద్ద ఈ ఘటన జరిగినట్లు అధికారులు చెప్పారు. హర్యానాలోని కురుక్షేత్ర నుంచి వస్తున్న బస్సు, కశ్మీర్ రియాసి జిలాల్లోని శివ్‌ఖోరి వైపు వెళ్తుండగా అదుపు తప్పి 150 అడుగుల లోయలో బోల్తాపడింది. దీంతో బస్సులో ఉన్న అనేక మంది మరణించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను అంకూర్ సబ్ డిస్ట్రిక్ట్ ఆసుపత్రికి తరలించారు. దాదాపు 36 మంది క్షతగాత్రులను జిఎంసి ఆసుపత్రికి తీసుకురాగా, అందులో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నారని, రోగులకు తరువాయి 2లో

# 'జయ జయహే తెలంగాణ'



## 'తెలంగాణ రాష్ట్ర గీతం'గా ప్రభుత్వం ఆమోదం

**పాటను 2.30 నిమిషాల నిడివితో ఒకటి, 13.30 నిమిషాల నిడివితో మరొకటి, రెండు వర్షన్లు**

**ప్రముఖులతో సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన**

**అధికారిక చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై తుది నిర్ణయం జరగలేదు**

**అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సిఎం స్పష్టీకరణ**

ప్రజాపక్షం/హైదరాబాద్

'జయ జయహే తెలంగాణ' గేయాన్ని ప్రభుత్వం 'తెలంగాణ రాష్ట్ర గీతం'గా ఆమోదించినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి ఈ ఏడాది జూన్ 2వ తేదీ నాటికి పదేండ్లు పూర్తవుతున్న సందర్భంగా దశాబ్ది ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదే వేడుకల సందర్భంగా 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని జాతికి అంకితం చేస్తామని చెప్పారు. ఉద్యమ కాలంలో అందరినీ ఉర్రూతలూగించి తరువాయి 2లో

**వేడుకలకు రండి**

మాజీసిఎం కెసిఆర్‌కు సిఎం రేవంత్‌రెడ్డి లేఖ 03

### చార్మినార్, కాకతీయ కళాతోరణం

## తొలగింపు మూర్ఖత్వం

**బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు**

**ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేస్తామని హెచ్చరిక**



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర అధికారిక చిహ్నంలో చార్మినార్, కాకతీయ కళాతోరణాలను తొలగించాలనుకోవడం మూర్ఖత్వమని, ఇప్పుడు వాటిని తీసివేయాల్సిన అత్యవసరం ఏమిటన్నదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ప్రశ్నించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతామన్నారు. తెలంగాణ అధికారిక చిహ్నంలో మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం భావించిన నేపథ్యంలో బిఆర్‌ఎస్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, టి.రాజయ్య, పద్మారావుగౌడ్ తదితరులతో కలిసి కెటిఆర్ గురువారం చార్మినార్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలు తరువాయి 2లో



## పత్తి రైతుల రాస్తారోకో..

**అధికారుల హామీతో ఆందోళన విరమణ**

**ఆదిలాబాద్ కలెక్టరేట్:** డిమాండ్ ఉన్న ప్రముఖ కంపెనీ పత్తి విత్తనాలను హోల్‌సేల్ వ్యాపారి మరో దుకాణానికి తరలించడం ఆదిలాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. మూడు రోజులుగా రైతులు బారులు తీరి సదరు కంపెనీ విత్తనాల కోసం ఇబ్బందులు పడుతుండగా గురువారం ఆదిలాబాద్ పట్టణం కిసాన్ చౌక్‌లోని నిఖిల్ ట్రేడర్స్ విత్తనాల దుకాణం నుంచి వాహనంలో 160 బ్యాగులను ఇచ్చోడ కేంద్రానికి తరలిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. రోజంతా లైన్లో నిల్చుంటే రెండు పత్తి విత్తన బ్యాగులు కూడా దొరకడం లేదని, ప్రైవేట్ డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు డీలర్‌ను నిలదీసిన రైతులంతా పంజాబ్ చౌరస్తా రహదారిపై బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. వెంటనే డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అక్కడికి చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. హోల్ సేల్ దుకాణం నుంచి ఇచ్చోడ రిటైల్ డీలర్‌కు వే బిల్లుతో సహా పత్తి విత్తనాల ప్యాకెట్లు పంపుతున్నట్టు డీలర్ తెలిపాడు. దీంతో ఆగ్రహించిన రైతులు దొంగ చాటుగా విత్తనాల అక్రమ వ్యాపారం తరువాయి 2లో

## బాధ్యత కలెక్టర్లదే



గురువారం నాటికి వివిధ కంపెనీల చెందిన 68,16,967 పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. మిగతా విత్తన ప్యాకెట్లు కూడా జూన్ 5వ తేదీ లోగా జిల్లాలకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలి. ఎక్కడైనా విత్తనాల కోసం రైతులు అధిక సంఖ్యలో వస్తే కౌంటర్ల సంఖ్య పెంచాలి. ప్రతిరోజు జిల్లాలవారీగా, కంపెనీల వారీగా పత్తివిత్తన ప్యాకెట్ల పంపిణీ, కొనుగోలు వివరాలు తెప్పించుకుని రోజువారీగా సమీక్షిస్తున్నాం.

**ఖరీఫ్‌లో రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలి**

**రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**నకిలీ విత్తనాలను విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు**

ప్రజాపక్షం/హైదరాబాద్

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సకాలంలో సరైన విత్తనాలు, ఎరువులను అందించాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. జిల్లాల వారీగా రైతుల అవసరాలకు తగిన ఎరువులు, విత్తనాలను అందిస్తున్నామని, కలెక్టర్లు, అధికారులు విస్తృతంగా పర్యటిస్తూ తనిఖీలు చేపట్టి అవి సక్రమంగా రైతులకు చేరేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అదేవిధంగా నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, పోలీసులకు మంత్రి అదేశాలు జారీ తరువాయి 2లో

**విత్తనాలను కృతిమ కొరత సృష్టించే వ్యాపారులపై పిడి యాక్టు : సిఎస్ శాంతి కుమారి** 03

## ప్రచారం సమాప్తం

**సార్వత్రిక సమరంలో ముగిసిన తుదిదశ ఎన్నికల ప్రచారం**

**చివరి విడతలో రేపు 57 స్థానాలకు పోలింగ్**




**వారణాసి / చండీగఢ్ :** లోక్‌సభ తుది దశ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. ఏడు రాష్ట్రాలు, చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతం కలిసి 57 స్థానాలకు జూన్ 1న జరిగే ఏడవ విడత్ పోలింగ్‌కు గురువారం సాయంత్రం ప్రచారం పరిసమాప్తమైంది. పంజాబ్‌లోని మొత్తం 13 స్థానాలు, హిమాచల్ ప్రదేశ్‌లోని నాలుగు, ఉత్తర్‌ప్రదేశ్‌లోని 13 , పశ్చిమ బెంగాల్‌లోని తొమ్మిది, బిహార్‌లోని ఎనిమిది, ఒడిషాలోని ఆరు, జార్ఖండ్‌లోని మూడు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ వరుసగా పోటీ చేస్తున్న వారణాసి నియోజకవర్గానికి కూడా శనివారమే పోలింగ్ జరగనుంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆరు దశల్లో 28 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని 486 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మొదటి దశలో 66.14, రెండ దశలో 66.71, మూడవ దశలో 65.68, నాలుగవ దశలో 69.16, ఐదవ దశలో 62.2, ఆరవ దశలో 63.36 శాతం ఓటింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరగనుంది. ప్రధాని మోదీ నేతృత్వంలో సాగిన బిజెపి ప్రచారంలో కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు అవినీతి పరులు అని, హిందూ వ్యతిరేకులు అని, లూటీలో మునిగితేలారని, బుజ్జగింపు, వారసత్వ రాజకీయాలు అవలంభించారని విమర్శించారు. ఇక ప్రతిపక్షాలు బిజెపి రైతు, యువత వ్యతిరేకి అని, మూడవసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని, రద్దు చేస్తుందని ప్రచారం చేశాయి. మోదీని విష్ణుమూర్తి పదకొండవ అవతారమని బిజెపి నేతలు చెప్పే ప్రయత్నం చేశారని, ప్రజలు దీనిని అనుమతించబోరని ఒడిషా సభలో ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే అన్నారు.

**మోదీ ప్రధాని స్థాయిని దిగజారుస్తున్నారు**

ప్రధాని మోదీ బహిరంగ సభల్లో ప్రసంగాల ద్వారా గౌరవాన్ని దిగజారుస్తున్నారని, విద్వేష ప్రసంగాల ద్వారా ప్రధాన మంత్రి కార్యాలయ తీవ్రతను తగ్గిస్తున్నారని మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ ఆరోపించారు. కాంగ్రెస్ మాత్రమే వృద్ధి ఆధారిత ప్రగతి తరువాయి 2లో

### ప్రైవేట్ బ్యాంకుల్లో

## పెరిగిన మోసాలు

**ఆర్‌బిఐ నివేదిక వెల్లడి**

**ముంబై:** దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థలో జరుగుతున్న మోసాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 36,075 మోసాలు నమోదయ్యాయి. 2021–22 ఆర్థిక సంవత్సరంలో 9,046, 2022–23 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 13,564 మోసాలతో పోలిస్తే ఈ సంఖ్య చాలా అధికం. అయితే, ఈ మోసాల్లో పోగొట్టుకున్న సొమ్ము మాత్రం గణనీయంగా తగ్గింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే క్రితం ఏడాది రూ.26,127 కోట్ల నుంచి రూ.13,930 కోట్లకు తగ్గిందని(ఆర్‌బీఐ) వెలువరించిన తన వార్షిక నివేదికలో వెల్లడించింది. గడిచిన మూడేళ్లలో ప్రైవేటు రంగ బ్యాంకుల్లో మోసాలు ఎక్కువగా నమోదవ్వగా... పోగొట్టుకున్న మొత్తం విషయంలో ప్రభుత్వరంగ బ్యాంకులు ముందువరుసలో నిలిచినట్లు ఆర్‌బీఐ తన నివేదికలో తెలిపింది. డిజిటల్ పేమెంట్స్ (కార్డు పేమెంట్స్, ఇంటర్నెట్ ) మోసాలు అధిక సంఖ్యలో నమోదు కాగా... లోన్ పోర్ట్‌ఫోలియోలో అధిక మొత్తంలో నగదు మోసగాళ్ల బారిన పడినట్లు తరువాయి 8లో

## 48 గంటల్లోనే 'ప్రధాని' ఎంపిక

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజార్టీ వస్తుందని, 48 గంటలకంటే తక్కువ సమయంలోనే ప్రధాని ఎవరనేది నిర్ణయిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. ఇండియా కూటమిలో ఎక్కువ సీట్లు గెలుచుకున్న పార్టీ ప్రధాని పదవికి సహజ హక్కుదారుగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రముఖ వార్తా సంస్థ పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో జైరాం రమేశ్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇండియా కూటమి మెజారిటీకి అవసరమైన 272 సీట్లు కంటే ఎక్కువ స్థానాలను గెలుచుకుంటుంది. కూటమికి మెజార్టీ వచ్చిన తర్వాత, కొన్ని ఎన్‌డిఎ పార్టీలు సంకీర్ణం ప్రభుత్వంలో చేరవచ్చు. ఆ పార్టీలను కూటమిలో చేర్చుకోవాలా? వద్దా? అనేది కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయిస్తుంది. ఎన్‌డిఎ, ఇండియా కూటమి పార్టీల మధ్య రెండు తేడాలు తరువాయి 8లో



**'ఇండియా' కూటమికి 272 కంటే ఎక్కువ సీట్లే వస్తాయ్**

**ప్రభుత్వ ఏర్పాటుకు కావలసిన మెజారిటీ వస్తుంది**

**ఎక్కువ సీట్లు గెలుచుకున్న పార్టీ ప్రధాని పదవికి సహజ హక్కుదారు**

**పిటిఐ ఇంటర్వ్యూలో జైరామ్ రమేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు**



### విధానాల మార్పు కోసం

## ప్రభుత్వాన్ని మార్చండి

**ఎస్‌కెఎం విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికలు ముగింపు దశకు చేరుకున్నాయి. చివరి విడతగా జూన్ 1వ తేదీన పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో విధానాల్లో మార్పు కోసం ప్రభుత్వాన్ని మార్చాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) బుధవారం ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తరువాయి 8లో

## హైతీ కొత్త ప్రధానమంత్రి గారీ కామిల్లే



**శాన్ జువోన్ :** హైతీ రిపబ్లిక్ మాజీ ప్రధాన మంత్రి గారీ కామిల్లే హైతీకి మళ్ళీ ప్రధానిగా ఎంపికయ్యారు. ట్రాన్సిషన్ కౌన్సిల్ ఆయన పేరును ఎంపిక చేసింది. దాదాపు నెలరోజులపాటు మల్లగుల్లాలు పడిన తర్వాత కామిల్లే పేరును కౌన్సిల్ ఖరారు చేసింది. 2011 అక్టోబరు నుండి 2012 మే వరకూ కామిల్లే హైతీ ప్రధానమంత్రిగా పనిచేశారు. ట్రాన్సిషనల్ కౌన్సిల్ సభ్యుడు లూయిస్ గెరాల్డ్ గిల్లెస్ బుధవారంనాడు అసోసియేటెడ్ ప్రెస్‌తో మాట్లాడుతూ, కౌన్సిల్‌లోని ఏడుగురు సభ్యులలో ఆరుగురు సభ్యులు ఏకగ్రీవంగా కామిల్లేను ప్రధానిగా ఎంపిక చేశామని చెప్పారు. లాటిన్ అమెరికా దేశాలకు, యూనిసెఫ్‌కు రీజినల్ డైరెక్టర్‌గా పనిచేసిన అనుభవంగల కామిల్లే దేశాన్ని చక్కదిద్దుతారని ఆయన అన్నారు. 2021లో ప్రధాన మంత్రి జోవ్‌నెల్ మోయిస్‌ను 28 విదేశీ హంతకముఠాల బృందం హత్య చేసినప్పటినుండీ హైతీలో తీవ్ర అస్థిరత నెలకుంది. హంతక ముఠాలు, గ్యాంగ్ వార్‌లకు హైతీదేశం నిలయంగా మారింది. దేశంలో గ్యాంగ్ వార్ హింస మితిమీరి శాంతిభద్రతల పరిస్థితులు చేజారిపోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరి నుండి తాత్కాలిక ప్రధానమంత్రిగా వ్యవహస్తున్న మైఖేల్ పాట్రిక్ బోయిస్‌వెర్ట్ తన పదవికి రాజీనామా చేసినప్పటినుండీ ట్రాన్సిషన్ కౌన్సిల్ అధికారం చెలాయిస్తోంది. ఎట్టకేలకు గారీ కామిల్లేను ప్రధాన మంత్రిగా ఎంపిక చేశారు. దేశ రాజధాని పోర్ట్ అవు ప్రిన్స్‌లో పోలీస్ స్టేషన్‌లను, జైళ్ళను కూల్చివేస్తూ గ్యాంగ్ వార్స్ హింస పెచ్చుమీరిపోవడంతో ఒక ప్రధానమంత్రిని సత్వర నియమించాల్సిన పరిస్తితి వచ్చింది.

## ఆమ్నెస్టీ బిల్లుకు స్పెయిన్ గ్రీన్ సిగ్నల్



**మాడ్రిడ్:** కటాలన్ వేర్పాటు వాదులకు క్షమాభిక్ష పెట్టేందుకు ఉద్దేశించిన 'ఆమ్నెస్టీ' బిల్లును స్పెయిన్ పార్లమెంటు ఆమోదించింది. 2017 అక్టోబర్ మాసంలో, కటాలన్ స్వతంత్ర ప్రతిపత్తి కోరుతూ కార్లెస్ పైడెమాంట్ ఆధ్వర్యంలో తిరుగుబాటు జరిగింది. అయితే, స్పెయిన్ సైన్యం ఆ ప్రయత్నాన్ని సమర్థంగా అణచివేసింది. పైడెమాంట్‌సహా ఎంతోమంది కటాలన్ నాయకులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు అరెస్టయ్యారు. కొందరు ఇప్పటికే శిక్షలు అనుభవిస్తున్నారు. మరికొందరిపై విచారణ కొనసాగుతున్నది. వీరికి క్షమాభిక్ష పెట్టాలన్న ఉద్దేశంతో, వామపక్ష భావాలున్న స్పెయిన్ సంకీర్ణ ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. దీనికి అనుకూలంగా 177 ఓట్లు రాగా, మితవాద ప్రతిపక్ష కూటమికి చెందిన 172 మంది వ్యతిరేకించారు. కటాలన్‌ను ప్రత్యేక దేశంగా ప్రకటించాలని, కనీసం స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని అప్పట్లో జరిగిన పోరాటంలో పాల్గొని, కేసులు ఎదుర్కొంటున్న వారికి క్షమాభిక్ష పెట్టాలని 2018లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన పెడ్రో సాంచెజ్ భావించారు. అప్పటి నుంచి ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతునే ఉన్నాయి. ఇన్నేళ్లకు ఆ ప్రయత్నాలు ఫలించాయి. ఆమ్నెస్టీ బిల్లు చట్టరూపం దాల్చింది.

పాలస్తీనాకు ఆమోదం..

# గాజాకు మానవతా సాయం

అరబ్ దేశాల నేతలతో ప్రారంభమైన శిఖరాగ్ర సమావేశంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పునరుద్ఘాటన



**బీజింగ్:** పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించడానికి ఆమోదం తెలపడంతోపాటు, ఇజ్రాయెల్ దాడులతో దారుణంగా నష్టపోతున్న గాజాకు మానవతా సాయం అందించాలన్న తమ నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని చైనా అధ్యక్షుడు క్సీ జిన్‌పింగ్ పునరుద్ఘాటించారు. బీజింగ్‌లో గురువారం అరబ్ దేశాల నాయకులతో శిఖరాగ్ర సమావేశాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజా పరిస్తితులపై ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది అక్టోబర్ నుంచి పాలస్తీనా, ఇజ్రాయెల్ వివాదం తీవ్రస్థాయికి చేరిందని గుర్తుచేశారు. ప్రస్తుత యుద్ధం అక్కడి ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్నదని చైనా–అరబ్ స్టేట్స్ కోఆపరేషన్ ఫోరమ్ ప్రారంభించిన అనంతరం చెప్పారు. యుద్ధం ఎక్కువ కాలం కొనసాగకూడదని ఆయన అన్నారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించుకోవడానికి చర్చలు అవసరమని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. ఈ దిశగా చైనా తన వంతు పాత్రను పోషిస్తుందని అన్నారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో సర్వస్వం కోల్పోయి, శరణార్థులుగా మారిన పాలస్తీనియన్లకు సాయం అందించే ఐక్య రాజ్య సమితి ఏజెన్సీకి మూడు మిలియన్ డాలర్ల విరాళం ఇస్తామని హామీ ఇచ్చారు. బీజింగ్‌తోపాటు అరబ్ దేశాలు కూడా పాలస్తీనియన్లకు మద్దతునిస్తున్న విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ దక్షిణ గాజా నగరమైన రఫాపై ఇటీవల జరిపిన దాడిలో కనీసం 45 మంది మృతి చెందారు. జనావాసాలపైన కూడా ఇజ్రాయెల్ దాడులు చేయడాన్ని అంతర్జాతీయ సమాజం తీవ్రంగా ఖండిస్తున్నది. గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటనను అనుసరించి, ఈ యుద్ధంలో ఇప్పటి వరకూ మరణించిన వారి సంఖ్య 36,000 దాటింది. పాలస్తీనా అంశంతోపాటు జిన్‌పింగ్ వాణిజ్యం, స్వచ్ఛమైన ఇంధనం, అంతరిక్ష అన్వేషణ, ఆరోగ్య సంరక్షణ తదితర రంగాలను కూడా జిన్‌పింగ్ ప్రస్తావించారు. ఈ రంగాల్లో పరస్పర సహకారానికి పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ), బహ్రెయిన్, ఈజిప్టు, ట్యునిషియా దేశాల అధినేతలు హాజరయ్యారు.

ప్రపంచం

# ఎప్పుడైనా సిద్ధమే..




అణ్వాయుధాల వినియోగంపై పాకిస్తాన్ మాజీ అధికారి స్పష్టీకరణ

**ఇస్లామాబాద్:** అవసరమైతే అణ్వాయుధాల వినియోగానికి ఎప్పుడైనా పాకిస్తాన్ సిద్ధంగా ఉంటుందని ఆ దేశ సైనిక మాజీ అధికారి లెఫ్టినెంట్ (రిటైర్డ్) ఖలీద్ అహమ్మద్ కిద్వాయ్ స్పష్టం చేశారు. 1998 మే 28న పాకిస్తాన్ ఆరు పర్యాయాలు అణు ప్రయోగాలను నిర్వహించింది. బలూచిస్తాన్ పర్వత ప్రాంతాల్లో ఈ ప్రయోగాలు జరిపింది. అదే నెల భారత్ నిర్వహించిన అణు పరీక్షలకు సమాధానంగా, పాకిస్తాన్ కూడా అణు శక్తిని పరీక్షించుకుంది. అయితే, అణ్వాయుధాలను 'తొలుత ప్రయోగించరాదు' (నో ఫస్ట్ యూస్/ ఎఎఫ్‌యు) అనే సూత్రాన్ని అణ్వాయుధ దేశాలు పాటిస్తున్నాయి. కానీ, పాక్ అలాంటి నిబంధనలను పెట్టుకోలేదని కిద్వాయ్ తేల్చిచెప్పారు. దేశ సార్వభౌమాధికారానికి భంగం వాటిల్లే పరిస్థితులు ఏర్పడినప్పుడు, ఎఎఫ్‌యు సూత్రంతో సంబంధం లేకుండా అణ్వస్త్రాన్ని ప్రయోగించడానికి పాక్ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. ఈ విషయంలో ఒక్క నిమిషం కూడా వేచి చూడాల్సిన పరిస్థితి దేశ ప్రభుత్వానికి లేదని వ్యాఖ్యానించారు.

ఇరాన్ అధ్యక్ష పదవికి

# మొదలైన నామినేషన్ల పర్వం



**దుబాయ్:** ఇరాన్ అధ్యక్ష పదవికి నామినేషన్ల పర్వం గురువారం ప్రారంభమైంది. ఈనెల 19న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో, మరో ఏడుగురుతో పాటు, దేశాధ్యక్షుడు ఇబ్రహీం రైసీ కూడా మృతి చెందిన విషయం తెలిసిందే. దీనితో అధ్యక్ష పదవికి ఎన్నికలు అనివార్యమయ్యాయి. జూన్ 28న జరిగే ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్లను ఐదు రోజులపాటు స్వీకరిస్తారు. అభ్యర్థుల వయసు 40 నుంచి 75 సంవత్సరాలుగా నిర్ణయించారు. అదే విధంగా మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలన్న నిబంధన ఉంచారు. ఈ అర్హతలు, పోటీ చేయాలన్న ఆసక్తి ఉన్న అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులను 12 మంది సభ్యులతో కూడిన గార్డియన్ కౌన్సిల్ పరిశీలించి, అభ్యర్థుల జాబితాను సిద్ధం చేస్తుంది. ఆ తర్వాత, దేశ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ (85) పోటీదారులను ఎంపిక చేస్తారు. గత అధ్యక్ష ఎన్నికల సమయంలో, గార్డియన్ కౌన్సిల్ ఖరారు చేసిన అభ్యర్థుల జాబితాలోని మిగతా పేర్లను ఖమేనీ తొలగించారు. రైసీ ఒక్కడి పేరును ఆయన ఆమోదించడంతో, అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ నామమాత్రంగా జరిగింది. అయితే, ఈసారి, ఇస్లామిక్ మతవాదులు, ఉదారవాదుల మధ్య పోటీ తీవ్రంగా ఉంటుందని అంటున్నారు. అదే విధంగా, మహిళలు హిజాబ్ (తలపై ఆచ్ఛాదనం) ధరించి తీరాలన్న నిబంధనను వ్యతిరేకిస్తూ, పోరాటానికి దిగిన మాసా అమీని 2022లో అరెస్టు కావడం, పోలీసుల అదుపులో ఉన్నప్పుడే అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం దేశ వ్యాప్తంగా నిరసనలకు కారణమైంది. అయితే, రైసీ ఆ ఆందోళనలను ఉక్కుపాదంతో అణచివేశారు. ఆయన మృతి తర్వాత అధ్యక్ష పదవికి ఎన్నికలు రావడంతో, పోటీలో ఎవరు మిగులుతారన్నది ఆసక్తి రేపుతున్నది. సూపర్ లీడర్ ఖమేనీ నిర్ణయాలే చట్టాలుగా మారుతాయన్నది వాస్తవమే అయినప్పటికీ, కొత్త అధ్యక్షుడి పాలనలో, ఐరోపా దేశాలతో ఇరాన్ సంబంధాలు మెరుగుపడతాయన్న ఆశ ప్రజల్లో ఉంది. అంతేగాక, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉండాలని కూడా చాలా మంది డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో జరగనున్న అధ్యక్ష ఎన్నికలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

## లాహోర్ ఒప్పంద ఉల్లంఘన నిజమే

అంగీకరించిన పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్

**ఇస్లామాబాద్:** లాహోర్ ఒప్పందాన్ని పాకిస్తాన్ ఉల్లంఘించిన మాట వాస్తవమేనని ఆ దేశ పాజీ ప్రధాని, పాకిస్తాన్ ముస్లిం లీగ్ (నవాజ్ వర్గం) అధ్యక్షుడు నవాజ్ షరీఫ్ అంగీకరించారు. 1999లో భారత్‌తో చేసుకున్న ఒప్పందాన్ని తమ దేశం ఉల్లంఘించడం వల్లే ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ షరీఫ్ చెప్పారు. భారత్, పాకిస్తాన్ మధ్య కార్గిల్ యుద్ధానికి దారి తీసిన పరిస్థితులను వివరించారు. అదే విధంగా తాను అర్ధంతరంగా పదవి నుంచి వైదొలగడానికి గల కారణాలను కూడా ఆయన ప్రస్తావించారు. పాక్‌లో, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం కంటే సైన్యమే బలమైనదని ఆయన పరోక్షంగా వ్యాఖ్యానించారు. భారత్‌తో పోటీపడుతూ పాకిస్తాన్ కూడా 1998 మే 28న ఏకంగా ఐదు అణుపరీక్షలు నిర్వహించిన విషయాన్ని షరీఫ్ ప్రస్తావించారు. 1999, ఫిబ్రవరి 21న అప్పటి భారత ప్రధాని అటల్ బిహారీ వాజపేయి పాకిస్తాన్‌లో పర్యటించినప్పుడు, ఇరు దేశాల మధ్య మైత్రీ సంబంధాలు మెరుగుపడ్డాయని, అనంతరం లాహోర్ డిక్లరేషన్‌పై తామిద్దరూ సంతకాలు చేశామని వివరించారు. రెండు దేశాల మధ్య శాంతి స్థాపనే లాహోర్ డిక్లరేషన్ లక్ష్యమని, శాంతి స్థాపనకు అది దోహదపడుతుందని ఆశించానని షరీఫ్ పేర్కొన్నారు. కానీ, పాక్ సైనిక జనరల్ పర్వేజ్ ముషారఫ్ దుస్సాహసానికి ఒడిగట్టి, అధికార పగ్గాలు చేపట్టారని, తర్వాతి కాలంలో పాక్ దళాలు కాశ్మీర్‌లవోని కార్గిల్ జిల్లాలో చొరబడినప్పుడు, భారత సైన్యం నిలువరించిందని పేర్కొన్నారు. ఈ యుద్ధంలో పాకిస్తాన్‌కు ఓటమి తప్పలేదని అంటూ, లాహోర్ ఒప్పందాన్ని ఉల్లంఘించడం పాకిస్తాన్ పొరపాటేనని వ్యాఖ్యానించారు. అణు పరీక్షలు నిలిపివేస్తే, 5 బిలియన్ డాలర్లు ఇస్తామని అమెరికా ప్రతిపాదించినప్పటికీ తాము తిరస్కరించినట్టు షరీఫ్ చెప్పారు. పాకిస్తాన్ తెహ్రీక్ ఇన్సాఫ్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వంటి వారు తన స్థానంలో ఉంటే, అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ప్రతిపాదనను సంతోషంగా అంగీకరించి ఉండేవారని ఎద్దేవా చేశారు. ఒక తప్పుడు కేసులో అప్పటి పాకిస్తాన్ చీఫ్ జస్టిస్ తనను అధికారం నుంచి తొలగించినట్టు షరీఫ్ ఆరోపించారు. 2017లో తమ ప్రభుత్వాన్ని పడగొట్టి, ఇమ్రాన్ ఖాన్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఐఎస్ఐ మాజీ చీఫ్ జనరల్ జహీరుల్ ఇస్లామ్ కూడా సహకరించారని షరీఫ్ అన్నారు. పాకిస్తాన్ అన్ని దేశాలతోనూ సత్సంబంధాలను కోరుకుంటున్నదని స్పష్టం చేశారు.

## తొలగింపు మూర్ఖత్వం

(మొదటి పేజీ తరువాయి)

తమ బతుకులను మార్చాలని అధికారాన్ని అప్పగిస్తే సిఎం రేవంత్ రెడ్డి మూర్ఖంగా వ్యవహరిస్తూ, రాక్షసానందం పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. కెసిఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలన్న మూర్ఖపు ధోరణితో వ్యవహరించడం తగదని, పదేళ్లతో జరిగిన మంచి, అభివృద్ధిని పట్టించుకోకుండా రాజకీయ దుగ్ధ, కక్షతో వ్యవహరిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ ఐకాన్‌గా చార్మినార్ ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిందని, అలాంటి చార్మినార్‌ను తొలగించడమంటే ప్రతి ఒక్కరినీ అగౌరవపరిచినట్టేనని అన్నారు. కాకతీయ కళాతోరణాన్ని నాటి ఎన్‌టిఆర్ ట్యాంక్‌బండ్‌కు ఇరు వైపులా పెట్టారని, కాంగ్రెస్ ప్రభుత్వం చార్మినార్ 400 ఏళ్ల ఉత్సవాలను కూడా నిర్వహించిందని గుర్తు చేశారు. అమరవీరుల స్థూపం, తెలంగాణ సాంస్కృతిక చిహ్నాలను చేర్చితే అభ్యంతరం లేదని, ఇప్పటికే ఉన్న వాటిని తొలగించవద్దని ఆయన కోరారు.

## ప్రచారం సమాప్తం

(మొదటి పేజీ తరువాయి)

పూర్వక భవిష్యత్తును అందిస్తుందని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందని పంజాబ్ ఓటర్‌లకు విజ్ఞప్తి చేశారు.

**కన్యాకుమారికి మోదీ:** ప్రచారం ముగిసిన అనంతరం ప్రధాని మోదీ కన్యాకుమారికి చేరుకున్నారు. అక్కడ వివేకానంద స్వామి కేంద్రం వద్ద జూన్ 1వ తేదీ వరకు ధ్యానం చేస్తారు. ఈ ఎన్నికల్లో మోదీ మొత్తం 206 చోట్ల ప్రచారంలో పాల్గొన్నారు. ఇందులో ప్రదర్శనలు, సభలు, రోడ్ షోలు ఉన్నాయి. పంజాబ్‌లో ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలైన ఆప్, కాంగ్రెస్‌లు విడివిడిగా పోటీ చేస్తున్నాయి. బహుముఖ పోటీ జరుగుతున్న ఈ రాష్ట్రంలో బిజెపి తరుపున ప్రచారంలో మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, బిజెపి అధ్యక్షులు జె.పి.నడ్డాలు పాల్గొన్నారు.కాంగ్రెస్ తరుపున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, ఆప్ తరుపున ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్‌లు ప్రచారం చేశారు. చివరి రోజున మోదీ హోషియార్‌పూర్‌లో జరిగిన ప్రచార సభలో కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. ఎమర్జెన్సీలో కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని గొంతు నులిమిందన్నారు. సిక్కుల ఊచకోతను పట్టించుకోలేదని విమర్శించారు.

## పత్తి రైతుల రాస్తారోకో..

(మొదటి పేజీ తరువాయి)

సాగిస్తున్నారని నిలదీశారు. నిఖిల్ ట్రేడర్స్ నుంచి పత్తి విత్తనాల తరలింపు వ్యవహారంపై లోతుగా విచారణ జరుపుతున్నామని, కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. నిజంగానే బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. విత్తనాల కొరత, డీలర్ల ఆగడాలపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని వ్యవసాయ అధికారి పుల్లయ్య భరోసా ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.



**రైతులపై లాఠీచార్జ్ అమానుషం: జోగురామన్న**

ఆలాబాద్ జిల్లాలో విత్తనాల కోసం వచ్చిన రైతులపై లాఠీ చార్జీ చేయడం అమానుషమని బిఆర్ఎస్ మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌ఎ అనిల్ జాదవ్, బిఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జ్ జాన్సన్ నాయక్ తో కలిసి జోగురామన్న మాట్లాడుతూ ప్రభుత్వ చేతకాని తనంతోనే రైతులకు ఇబ్బందులు పడుతున్నారని, రెండు మూడు రోజుల్లో రైతులు అడిగిన విత్తనాలు అందుబాటు లో ఉంచకపోతే ఆదిలాబాద్ వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. వ్యవసాయ మంత్రి రాష్ట్రంలో విత్తనాల కొరత లేదని అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు భరోసాను పంటలు వేసిన తర్వాత ఇస్తామని వ్యవసాయ మంత్రి చెప్పడం సిగ్గు చేటన్నారు. సిఎం, మంత్రులకు మధ్య సమన్వయం లేదని, ప్రజా సమస్యల పరిష్కారించేందుకు శ్రద్ధ లేదని ఆరోపించారు.

# దడపుట్టిస్తున్న ఎండలు



జూన్ ఒకటి నుంచి రాష్ట్రంలో వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఎండలు దడపుట్టిస్తున్నాయి. వర్షాలు ముఖం చాటేయడంతో ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. మళ్లీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ చల్లిటి కబురు చెప్పింది. రాష్ట్రంలో జూన్ ఒకటి నుంచి మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. జూన్ ఒకటిన భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. 2వ తేదీ నుంచి 3వ తేదీ వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. శుక్రవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలున్నాయన్నారు. మరో వైపు నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రుతుపవనాలు లక్షద్వీప్ ప్రాంతం మీదుగా కేరళలోకి ప్రవేశించాయన్నారు. రుతుపవనాల విస్తరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. కర్ణాటక, తమిళనాడులోని కొన్ని భాగాలు, నైరుతి, మధ్య బంగాళా ఖాతం, పశ్చిమ బెంగాల్, సిక్కింలోని పలు ప్రాంతాల్లోకి రాబోయే రెండుమూడు రోజుల్లోనే విస్తరిస్తాయన్నారు.

## యాత్రికుల బస్సు

(మొదటి పేజీ తరువాయి)

సమయానుకూలంగా చికిత్స అందిస్తున్నట్లు ఆసుపత్రి ప్రిన్స్‌పాల్ డాక్టర్ అసుతోష్ గుప్తా వెల్లడించారు. కాగా, మూలమలుపును, ఎదురుగా వేగంగా వస్తున్న కారును తప్పించే క్రమంలో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడని బాధితులు చెప్పారు. ఘటనాస్థలిని సీనియర్ ఎస్‌పి ఫైసల్ కురేషి, రవాణా కమిషనర్ సహా ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. పరిస్థితిని పర్యవేక్షించారు. అయితే బస్సులో ఎలాంటి రద్దీ లేదని అర్థమవుతుందని ఎస్ఎస్‌పి అన్నారు.

**ముర్ము, మోదీ విచారం! :** అయితే బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఎక్స్ వేదికగా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ దుర్ఘటనపై ప్రధాని మోదీ కూడా స్పందించారు. ప్రమాదంలో యాత్రికులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు.



## 'నైరుతి' ఆగమనం

(మొదటి పేజీ తరువాయి)

వేయగా ఒక రోజు ముందుగానే ప్రవేశించాయి. సాధారణంగా జూన్ 1వ తేదీన నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తాయి. ఆ తర్వాత జూన్ 5 నాటికి అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ, మిజోరం, మణిపూర్, అస్సాం రాష్ట్రాలకు చేరుకుంటాయి. అయితే, ఈసారి రుతుపవనాల ఆగమనం సమయంలోనే బంగాళాఖాతంలో రేమాల్ తుపాను ఏర్పడింది. ఇది రుతుపవనాల గమనాన్ని బలంగా లాగిందని, అందుకే నిర్ణీత సమయానికి ముందుగానే అవి ఈశాన్య రాష్ట్రాలకు చేరుకున్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. లానినా అనుకూల పరిస్థితులు, భూమధ్యరేఖ వద్ద పసిఫిక్ మహాసముద్రం చల్లబడడం ఆగస్టు–సెప్టెంబరు నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. దీని వల్ల ఈ రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షం కురుస్తుందని గత నెలలో అంచనా వేసింది. వాయువ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. 1951 నుంచి 2023 వరకు ఎల్‌నినో తర్వాత లానినా వచ్చిన సందర్భాల్లో భారత్‌లో తొమ్మిదిసార్లు మంచి వర్షాలు కురిశాయని తెలిపింది. అందుకు అనుగుణంగానే ఈ ఏడాది రుతుపవనాల కదలిక ఉందని వివరించింది.

ఇదిలా ఉండగా, మన దేశంలో 52 శాతం నికర సాగు భూమికి ఇప్పటికీ వర్షపాతమే ప్రధాన ఆధారంగా ఉంది. దేశ మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో ఈ సాగు భూమి నుంచి 40 శాతం దిగుబడి వస్తుంది. అందుకే భారత ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతుపవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇందిలా ఉండగా, భారత వాతవరణ శాఖ గణంకాల ప్రకారం కేరళలో రుతుపవనాలు ప్రవేశించే సమయం గత 150 సంవత్సరాలుగా మారుతూనే ఉంది. మొదటిసారి ముందుగా 1918లో మే 11నే ప్రవేశించాయి. అత్యంత ఆలస్యంగా 1972 జూన్ 18న ప్రవేశించాయి. ఇక గతేడాది జూన్8న, 2022లో మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్1న నైరుతి రుతుపవనాలు కేరళ తీరానికి తాకాయి.

## 'జయ జయహే తెలంగాణ'

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ఖ్యాతిని చాటిన ఈ గీతాన్ని భవిష్యత్తులో తరతరాలు పాడుకునేలా, అందరి ఆమోదంతో రాష్ట్ర గీతంగా ఆమోదించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ కవి, రచయిత అందెశ్రీ ఇరవై ఏండ్ల కిందట రాసిన ఈ గీతాన్ని యథాతథంగా అమోదించినట్లు ప్రకటించారు. ఆస్కార్ అవార్డు గ్రహీత కీరవాణి సంగీతంతో పాటు స్వరాలు కూర్చారు. సచివాలయంలో గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సి.దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ (సీతక్క), కొండా సురేఖతో పాటు మాజీ మంత్రి కె.జానారెడ్డి, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌తో పాటు కవి అందెశ్రీ, సంగీత దర్శకులు కీరవాణి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు ఎంపిలు, ఎంఎల్‌ఎలు, తెలంగాణ బిల్లును ఆమోదించినప్పుడు సభలో ఉన్న మాజీ ఎంపిలు, ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్ర గీతంతో పాటు రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకల నిర్వహణపై చర్చించారు. జయ జయహే తెలంగాణ గీతాన్ని రెండు వర్షన్‌లలో తయారు చేశారు. పాటను 2.30 నిమిషాల నిడివితో ఒక వర్షన్, 13.30 నిమిషాల నిడివితో పూర్తి వర్షన్ రూపొందించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆలపించేందుకు వీలుగా పూర్తి గేయంలో ఉన్న మూడు చరణాలతో రెండున్నర నిమిషాల నిడివితో సంక్షిప్త గేయం ఉంటుందని సిఎం ప్రకటించారు. ఈ రెండింటినీ రాష్ట్ర గీతంగానే పరిగణిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కీరవాణి సంగీత సారథ్యంలోని యువ గాయనీ గాయకుల బృందం ఆలపించిన ఈ గీతం అందరినీ ఆకట్టుకుంది. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా తమ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని, అందులో భాగంగానే రాష్ట్రానికి సంబంధించిన సంక్షిప్త రూపం 'టిఎస్'ను 'టిజి'గా మార్చినట్లు సిఎం తెలిపారు. వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లతో పాటు అన్ని ప్రభుత్వ సంస్థలు 'టిజి'గా మార్పు చేశామన్నారు. కేబినేట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకే రాష్ట్ర గీతాన్ని ఆమోదించటం జరిగిందని సిఎం తెలిపారు.

**అధికారిక చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై 500 నమూనాలు**

రాష్ట్ర ప్రభుత్వం అధికారిక చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చాలని మంత్రివర్గంలో నిర్ణయం జరిగిందని సిఎం చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కళాకారుల నుంచి దాదాపు 500 నమూనాలు తమకు అందినట్లు సిఎం చెప్పారు. ఇంకా నమూనాలన్నీ చర్చల దశలోనే ఉన్నాయని, చిహ్నానికి సంబంధించిన తుది రూపమేదీ ఇంకా ఖరారు కాలేదని చెప్పారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించి కూడా తుది నిర్ణయమేది జరగలేదని, కళాకారులు వివిధ నమూనాలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. కొత్త చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహాలకు సంబంధించి అపోహాలు, తప్పుడు ప్రచారాలకు తావు లేకుండా అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా తెలంగాణ ప్రతిష్టను ఇనుమడించే విధంగా, భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా తమ కార్యాచరణ ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## బాధ్యత కలెక్టర్లదే

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. పలు జిల్లాల్లో విత్తనాల కోసం రైతులు ఆందోళనలు చేపడుతుండడంతో తాజా పరిస్థితులపై గురువారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్రస్థాయి అధికారులతో ప్రత్తి విత్తనాల సరఫరా, లభ్యతపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా గురువారం నాటికి వివిధ కంపెనీల చెందిన 68,16,967 పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. దీంతో మిగతా విత్తన ప్యాకెట్లు కూడా జూన్ 5వ తేదీ లోగా జిల్లాలకు చేరేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఇప్పటికే అన్ని జిల్లాలలో అవసరమైన మేరకు పత్తి, జిలుగ విత్తనాలు పంపిణీ చేసినందున, జిల్లా కలెక్టర్లు అవి రైతులకు సక్రమంగా చేరేవిధంగా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా విత్తనాల కోసం రైతులు అధిక సంఖ్యలో వస్తే కౌంటర్ల సంఖ్య పెంచాలని సూచించారు. ఇకనుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులు రోజువారిగా విస్తృతంగా పర్యటిస్తూ పత్తి విత్తనాల విక్రయ కేంద్రాలతో పాటు జిలుగ, జనుము సరఫరా చేసే కేంద్రాలను పరిశీలించడం ద్వారా రైతులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు.

**విత్తన కంపెనీలతో మంత్రి సమీక్ష**

ఖరీఫ్‌లో అన్ని పంటలకు సంబంధించి విత్తనాల సమస్య రాకుండా ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా వర్షా కాలనికే ముందే కావాల్సిన విత్తనాల సేకరణలో భాగంగా గురువారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి విత్త కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. నైరుతి రతు పవనాలు మరో 5 రోజుల్లో తెలంగాణాకు తాకే అవకాశం ఉండడం, ఇప్పటికే గత 15 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన ఆకాల వర్షాలతో రైతులు దుక్కులు సిద్ధం చేసుకున్న నేపథ్యంలో విత్తన కంపెనీలు ఇచ్చిన ప్రణాళిక ప్రకారం మిగతా పత్తి విత్తన ప్యాకెట్లను కూడా జూన్ 5వ తేదీలోగా జిల్లాలకు చేరవేయాలని ఆదేశించారు. అదేవిధంగా కొన్ని జిల్లాలలో, ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో ఒక కంపెనీ ఒక రకమైన విత్తనాలనే రైతులందరూ కొరుతున్నారని, యూనివర్సిటి పరిశోధనల ప్రకారం మార్కెట్లో లభ్యమవుతున్న ప్రతి విత్తన హైబ్రిడ్‌ల దిగుబడి ఒక్కటేనని, ఈ విషయాన్ని రైతులందరికి తెలియజెప్పాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. ప్రతిరోజు జిల్లాలవారి, కంపెనీల వారీగా పత్తివిత్తన ప్యాకెట్ల పంపిణీ, కొనుగోలు వివరాలు తెప్పించుకుని రోజువారిగా సమీక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలలో పత్తి, పచ్చిరొట్ట విత్తనాలు అవసరం మేరకు ఉన్నాయని రైతులెవరూ తొందరపడకుండా వారి అవసరం మేరకు విత్తనాలను ప్రభుత్వ ఆమోదిత దుకాణాల నుండి కొనుగోలు చేయాలని, ప్రతి కొనుగోలుకు సంబంధించి బిల్లులను తీసుకుని భద్రపర్చుకోవాలని మంత్రి రైతులకు విజ్ఞప్తి చేశారు.

## ఆ సెల్‌నెంబర్లపైనే దర్యాప్తు కన్ను..!

### ఫోన్‌ట్యాపింగ్‌లో ప్రణీత్‌రావు వాడింది ఎనిమిది నెంబర్లు

### ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ కాల్ లీస్టుపై ఆరా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ ఉదంతంలో అరెస్టై జైలులో ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) డిఎస్‌పి దుగ్యాల ప్రణీత్‌రావు (40) వాటిన ఎనిమిది సెల్‌ఫోన్ నెంబర్లపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. ప్రణీత్‌రావుకు విధినిర్వహణ కోసం పోలీసు శాఖ మూడు 939292834593929218518712681357 సెల్‌నెంబర్లను అప్పగించింది. ఇవి కాకుండా అతను మరో ఐదు 89782186589492030999 994845844463037349088712597509 సెల్‌నెంబర్లను ఫోన్ ట్యాపింగ్ ఉదంతంలో ఉపయోగించాడని జూబ్లీహిల్స్ ఎసిపి పి.వెంకటగిరి దర్యాప్తులో తేలింది.ప్రణీత్‌రావు ఉపయోగించిన మొత్తం ఎనిమిది సెల్‌నెంబర్లపై మూడేళ్ల డేటాను దర్యాప్తు అధికారులు వెలికితీసినట్లు సమాచారం. ఈ నెంబర్లపై ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ కాల్స్‌పై దృష్టి సారించారు. ఈ నెంబర్లకు వచ్చిన కాల్ డేటాలో రాజకీయ ప్రముఖుల ఫోన్ నెంబర్లు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో కూడా దర్యాప్తు అధికారులు చూస్తున్నారు. ఈ నెంబర్ల ద్వారా ప్రణీత్‌రావు బిఆర్ఎస్ నేతలతో ఏమైనా మాట్లాడాడా లేదా కేవలం తాను ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక పోలీసు బృందం సభ్యులతో మాట్లాడడానికి ఉపయోగించాడ అనే విషయం తేలాల్సి ఉంది. అలాగే ఈ ఫోన్‌ట్యాపింగ్ ఆపరేషన్‌లో ఎస్ఐబి చీఫ్ ప్రభాకరరావు వాటిన సెల్‌నెంబర్లపై కూడా ఆరా తీస్తున్నారు. అయితే ప్రణీత్‌రావు ఉపయోగించిన సెల్‌నెంబర్లు అతని పేరుతో తీసుకున్నాడా లేదా బినామీ వ్యక్తుల పేర్లతో తీసుకున్నాడ అనే వివరాలను కూడా ఇప్పటికే దర్యాప్తు అధికారులు సేకరించారు.కాల్ డేటాలో ఎవరెవరి పేర్లు బయటికి వస్తాయో వేచి చూడాల్సిందే మరి. ఇందులో రాజకీయ నేతల ఫోన్‌లు కూడా ఉండవచ్చనే అనుమానాలు కలుగుతున్నాయి. అయితే వారితో ఏమని సంభాషించాడు అనే విషయంపై వారిని కూడా విచారించే అవకాశాలు ఉంటాయనే అనుమానాలు కలుగుతున్నాయి.

## అరసం ఆధ్వర్యంలో జూన్ 2న కవి సమ్మేళనం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఏర్పడి దశాబ్దమైన సందర్భంగా తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన హియాత్‌నగర్‌లోని మక్దుంభవన్‌లో కవిసమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ కవిసమ్మేళనానికి అరసం అధ్యక్షులు పల్లేరు వీరస్వామి అధ్యక్షత వహిస్తుండగా ముఖ్యఅతిధిగా తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ అధ్యక్షులు డాక్టర్ నందిని సిద్దారెడ్డి, గౌరవ అతిధులుగా ఇప్టా జాతీయ ఉపాధ్యక్షులు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి పాల్గొననున్నట్లు అరసం ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కవిసమ్మేళనంలో సుమారు 50 మంది కవులు పాల్గొంటారన్నారు. కమిసమ్మేళనాన్ని విజవంతం చేయాలని ఆయన కోరారు.

## డిఎస్‌పి శ్రీధర్‌ను అభినందించిన డిజిపి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)లో డిఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న గంగసాని శ్రీధర్‌ను ఆ శాఖ డిజిపి సివి ఆనంద్ అభినందించారు. ఈ సందర్భంగా గురువారం శ్రీధర్‌కు సివి ఆనంద్ ప్రశంసా పత్రాన్ని అందించారు. ఎసిబి శాఖలో విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకుగాను ఈ ప్రశంసాపత్రాన్ని డిఎస్‌పి శ్రీధర్ అందుకున్నారు.

## లక్ష్మీబాయి మృతికి సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ గవర్నర్, కేంద్రమంత్రి పి. శివశంకర్ సతీమణి తీవ్రం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. లక్ష్మీ బాయి మరణ వార్తను తీవ్రంగా కలిచివేసిందని, మహిళలు బయటకి రాలేని నాటి కాలంలోనే భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల పట్ల, ఆధ్యాత్మికతతో ఉన్నత భావాలతో పిహెచ్‌డి చేసి మహిళా సమాజం, భారతీయ సమాజం గర్వ పడే విధంగాడాక్టర్ లక్ష్మీ బాయి ఉన్నత విద్య అభ్యసించారని కొనియాడారు. డాక్టర్ లక్ష్మీ బాయి మరణం పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం సానుభూతి తెలియజేసిన డాక్టర్ లక్ష్మ ణ్ ఆమె ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు.

## ఉమామహేశ్వర్‌రావును రెండో రోజు విచారించిన ఎసిబి అధికారులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆధాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో అరెస్టు అయిన సిసిఎస్ ఎసిపి ఉమామహేశ్వర్‌రావును ఎసిబి అధికారులు గురువారం (రెండోరోజు) కూడా విచారించారు. వారం రోజుల క్రితం ఎసిబి అధికారులు ఉమామహేశ్వర్‌రావుకు చెందిన బంధువులు, స్నేహితులు, బినామి వ్యక్తుల ఇళ్లపై ఎపి, తెలంగాణలో 20 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సోదాల్లో సుమారు రెండు కోట్ల రూపాయల ఆస్తులు ఆదాయానికి మించి ఉన్నాయని ఎసిబి అధికారులు తేల్చారు. సోదాల సందర్భంగా లభించిన పలు ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాలు బినామి వ్యక్తులవి గుర్తించారు. వీటికి సంబంధించి మరిన్ని విషయాలు రాబట్టేందుకు ఉమామహేశ్వర్‌రావును విచారిస్తున్నారు. ఇక అరెస్టు సమయంలో అతని నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌ను ఢీ కోడ్ చేశారు. ఇందులో మరిన్ని ఆసక్తికర విషయాలు బయటపడినట్లు తెలిసింది. ఇతనికి సహకరించిన ఉన్నతాధికారులను కూడా ప్రశ్నించే అవకాశాలు ఉన్నాయి. సదరు ఉన్నతాధికారులకు కూడా ఉమామహేశ్వర్‌రావు నుంచి ఏమైనా నిధులు పోయాయ అనే విషయంపై కూడా ఎసిబి అధికారులు ఆరా తీస్తున్నారు. ఆస్తులు కూడబెట్టిన బినామి వ్యక్తులను కూడా విచారించి అవసరమైతే అరెస్టు చేసే అవకాశాలు లేకపోలేదు. సిసిఎస్‌లో ఎసిపిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఉమామహేశ్వర్‌రావు సాహితి కేసులో పెద్ద మొత్తంలో డబ్బులు దండుకున్నట్లు ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ కోణంలో కూడా ఎసిబి అధికారులు ఆరా తీస్తున్నా.

## పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల నృత్య ప్రదర్శన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో నగరంలోని పాఠశాలల విద్యార్థులు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన బృంద నృత్య పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం టిజిపిసిబి ఆడిటోరియంలో గురువారం జరిగింది. మొక్కలు నాటడం, నీటి సంరక్షణ, వాయు కాలుష్యం, ప్లాస్టిక్ కాలుష్యం, ప్రజా రవాణ, వంటి అనేక అంశాలలో భూగ్రహాన్ని రక్షించడం అంశాలపై వివిధ పాఠశాలల విద్యార్థులు నృత్య రూపకంలో ప్రదర్శించారు. శక్తివంతమైన నృత్య మాధ్యమం ద్వారా పర్యావరణ పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజానికి కావాల్సిన అవగాహన ఆవశ్యకత నొక్కి చెప్పారు. సృజనాత్మకతకు ప్రత్యేక గుర్తింపుతో బాలకళాకారులకు ధ్రువీకరణ పత్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారులు ప్రభాకర్, దేవేందర్, పిసిబి అధికారులు జె.సుమతి ఎన్వీరాన్‌మెంట్ సైంటిస్ట్ మాధురి, ఎన్వీరాన్‌మెంట్ ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై పీడి యాక్ట్

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో విత్తనాలను బ్లాక్ మార్కెట్‌లకు తరలించి, కృత్రిమ కొరతను సృష్టించే వ్యాపారులపై పిడి చట్టం కింద కేసులను నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో వానాకాలం పంటలకు విత్తనాల సరఫరా, జూన్ 2వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ ఉత్సవాల ర్పాట్లుపై గురువారం జిఎడి, వ్యవసాయ శాఖల కార్యదర్శి రఘునందన్ రావులతో కలసి సిఎస్ జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి గత సంవత్సరం కన్నా ఈ ఏడాది అధిక మొత్తంలో వివిధ రకాల పంట విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తనాల పంపిణీలో ఏలాంటి ఆందోళన చెందొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణాలో అధిక డిమాండ్ ఉన్న పత్తి, సోయా, మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాలు సరిపడా ఉన్నాయని అన్నారు. వీటితోపాటు జీలుగ విత్తనాలు కూడా కావాల్సినంతగా అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయ, రెవిన్యూ, పోలీస్ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విత్తన వ్యాపారుల గోదాములు, దుకాణాలను తనికీ చేయించాలని, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. దీనితోపాటు, గోదాములు, విత్తన విక్రయ కేంద్రాలవద్ద పర్యవేక్షణకు ఎక్కడికక్కడ ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. జూన్ నెల చివరి వరకు విత్తన విక్రయాలు కొనసాగే అవకాశం ఉన్నందున, జిల్లా కలెక్టర్లు ప్రతీ రోజూ విత్తన పంపిణీలపై సమీక్షించడంతోపాటు విధిగా ఆకస్మిక తనికీలు నిర్వహించి స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ విధానాన్ని పరిశీలించాలని అన్నారు. రైతులతో సమావేశమై, సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వారిలో విశ్వాసం కల్పించాలని సూచించారు. ఇతర రాష్ట్రాలనుండి రైతులు వచ్చి ఇక్కడి విత్తనాలు కొనుగోలు చేయకుండా నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విత్తనాల లభ్యత సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులను సిఎస్ అదేశించారు.

**జూన్ 2న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న జిల్లా కలెక్టర్లు**

తెలంగాణా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ రెండవ తేదీన, రాష్ట్ర ఉద్యమంలో అమరులైన వారికి నివాళులు అర్పించిన అనంతరం, జిల్లా కలెక్టర్లు జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తారని సిఎస్ శాంతి కుమారి తెలిపారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను, ఇతర ప్రముఖులను, జిల్లా అధికారులను ఆహ్వానించాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో పరేడ్ గ్రౌండ్స్ లో జరిగే కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమంలో అమర వీరుల కుటుంబ సభ్యులకు, ఉద్యమ కారులకు జిల్లా కలెక్టర్ల ద్వారా ఆహ్వానం పంపుతున్నట్లు తెలియజేశారు.

**ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సిఎస్ సమిక్ష**

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో అధికారులతో సమావేశమై సమీక్షించారు. జూన్ 2 వ తేదిన సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు రెండు గంటల పాటు ట్యాంక్ బండ్ వద్ద అవతరణ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసు బ్యాండ్, కార్నివాల్, జయజయహే తెలంగాణ అనే రాష్ట్ర గీతంతో కూడిన ఫ్లాగ్వాక్, రాష్ట్రంలోని సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వాన్ని తెలిపే వివిధ జానపద ,గిరిజన కళారూపాలు ప్రదర్శనలు మొదలుకుని బాణాసంచాలు కాల్చి కార్యక్రమానికి ముగింపు పలికే వరకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సందర్శకుల కోసం ఫుడ్ కోర్ట్ లు, షాపింగ్ స్టాల్స్, గేమింగ్ జోన్లు ఏర్పాటు చేసి అక్కడికి వచ్చే వారికి ఇబ్బందులు కలుగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో సజావుగా, జరిగేలా ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారిని నియమించి అధికారులు అందరు సమన్వయంతో పని చేయాలని సీఎస్ ఆదేశించారు. పార్కింగ్, బందోబస్తుకు తగిన ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. ఈ సమావేశంలో డిజిపి రవిగుప్తా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీలు దానకిషోర్, శ్రీనివాస రాజు, పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావు టిఎస్‌పిడిసిఎల్ ఎండిముషారఫ్, హెచ్ఎండిఎ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ అమ్రపాలి, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## మాజీ సిఎం కెసిఆర్‌కు సిఎం రేవంత్‌రెడ్డి ఆహ్వాన లేఖ

### స్వయంగా కెసిఆర్‌కు అందజేయాలని ప్రోటోకాల్ అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూన్ 2వ తేదీన ఉదయం 10 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల అధికారిక కార్యక్రమంలో పాల్గొనాలని మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును ఆహ్వానిస్తూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా లేఖ రాశారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు వ్యక్తిగత ఆహ్వాన లేఖ, ఆహ్వాన పత్రికను స్వయంగా కెసిఆర్‌కు అందించాలని ప్రభుత్వ ప్రోటోకాల్ సలహాదారు హర్కర వేణుగోపాల్‌కు, డైరెక్టర్ అరవిందసింగ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు అప్పగించారు. కెసిఆర్‌ను స్వయంగా కలిసి ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వాన పత్రిక అందించేందుకు కెసిఆర్ సిబ్బందితో ప్రభుత్వ ప్రోటోకాల్ అధికారులు చర్చలు జరిపారు. మాజీ సిఎం కెసిఆర్ గజ్వేల్ ఫామ్‌హౌస్‌లో ఉన్నారని అధికారులు సిఎంకు తెలిపారు. సిఎం ఆదేశాల మేరకు అక్కడకు వెళ్లి స్వయంగా ఆహ్వాన పత్రిక, లేఖను అందజేసేందుకు హర్కర వేణుగోపాల్, డైరెక్టర్ అరవింద్ సింగ్ చర్యలు తీసుకున్నారు.

## 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవ కార్యక్రమాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. జూన్ 2వ తేదీన ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఘనంగా వేడుకలకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

- ☞ జూన్ 2న ఉదయం 9.30కు గన్ పార్క్‌లో అమర వీరుల స్థూపం వద్ద ముఖ్య మంత్రి తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన వారికి నివాళులు అర్పిస్తారు.
- ☞ ఉదయం 10 గంటలకు పెరేడ్ గ్రౌండ్లో ముఖ్యమంత్రి జాతీయ పతాకావిష్కరణ చేస్తారు. పోలీసు బలగాల పేరేడ్, మార్చ్ ఫాస్ట్, వందన స్వీకార కార్యక్రమం ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం సోనియాగాంధీ ప్రసంగం, ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు.
- ☞ పోలీసు సిబ్బందికి, ఉత్తమ కాంటింజెంట్లకు అవార్డులను ప్రదానం చేస్తారు. అవార్డు స్వీకర్తలతో ఫోటో సెషన్ అనంతరం కార్యక్రమం ముగుస్తుంది.
- ☞ సాయంత్రం ట్యాంక్ బం తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ప్రారంభమవుతాయి. తెలంగాణకు సంబంధించిన హస్తకళలు, ప్రత్యేక ఉత్పత్తులు, వివిధ రకాల ఫుడ్ స్టాల్స్ ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేస్తున్నారు.
- ☞ సాయంత్రం 6.30కు ముఖ్యమంత్రి ట్యాంక్ బండ్ కు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శిస్తారు.అనంతరం తెలంగాణ కళారూపాల అద్భుత ప్రదర్శనకు అద్దం పట్టే కార్నివాల్ నిర్వహిస్తారు. దాదాపు 700 మంది కళాకారులు ఇందులో పాల్గొంటారు.
- ☞ అనంతరం ట్యాంక్ బండ్ ఏర్పాటు చేసిన వేదికపై 70 నిమిషాల పాటు వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఉంటాయి. స్టేజ్ షో అనంతరం జాతీయ జెండాలతో ట్యాంక్ బండ్‌పై ఇటు చివర నుంచి అటు చివరి వారకు భారీ ఫ్లాగ్ వాక్ నిర్వహిస్తారు. దాదాపు 5 వేల మంది ఇందులో పాల్గొంటారు.
- ☞ ఈ ఫ్లాగ్ వాక్ జరుగుతున్నంత సేపు జయ జయహే తెలంగాణ ఫుల్ వర్షన్ (13.30 నిమిషాల) గీతాన్ని విడుదల చేస్తారు. అదే వేదికపై తెలంగాణ కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణికి సన్మానం చేస్తారు.
- ☞ రాత్రి 8.50 గంటలకు పది నిమిషాల పాటు హుస్సేన్ సాగరం మీదుగా ఆకాశంలో రంగులు విరజిమ్మేలా బాణాసంచా (ఫైర్ వర్క్స్ ) కార్యక్రమంతో వేడుకలు ముగిస్తాయి.

## ఇంజనీరింగ్ కళాశాల అడ్డగోలు దందా

### కట్టడి చేయాలని ఎఐవైఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీల అడ్డగోలు దందాను కట్టడి చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిని కోరింది. ఈ మేరకు ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర హైదరాబాద్‌లోప్రొఫెసర్ లింబాద్రిని కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ ఫలితాలు వచ్చి వారం రోజులు కాకముందే 'బి' కేటగిరి సీట్లను అమ్ముకుంటున్న ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంజనీరింగ్ విద్య పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా మోసగిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌన్సిలింగ్ కంటే ముందే ఇంజనీరింగ్ కాలేజీల సీట్ల దందా జోరందుకుందని, ప్రైవేట్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీల మధ్యవర్తిత్వంతో సీట్ల రిజర్వేషన్ ప్రక్రియకు తెరలేచిందని ఆరోపించారు. వివిధ బ్రాంచ్‌ల సిఎస్సీ, ఐటి, ఈఈఈ కోర్సుల సీటుకు సగటున రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల చొప్పున అమ్ముకుంటున్నాయని ఆరోపించారు. కన్వీనర్ కోటా కటాఫ్ కంటే అధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సీట్ల టెన్షన్ పట్టుకుందని, ఇదే అంశం ఇంజనీరింగ్ కాలేజీలకు కాసులు కురిపిస్తున్నాయన్నారు. ఉన్నత విద్యామండలి ఆదేశాలను, నిబంధనలను ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయని సీటు రిజర్వేషన్ చేసుకొని మరో 20 రోజుల్లో మొదటి సంవత్సరం ఫీజు చెల్లిస్తే సీటు ఇస్తామని స్పష్టం చేస్తుండగా, ఇంకొన్ని కాలేజీలు మాత్రం మొత్తం ఒకేసారి నగదు రూపంలో చెల్లిస్తేనే సీటు, విడతలవారీగా చెల్లిస్తే ఆ డొనేషన్ పెరుగుతుందని తేల్చి చెబుతున్నారని వారు ఉన్నత విద్యా మండలి చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. కన్వీనర్ కోటా ప్రక్రియ కంటే ముందే మేనేజ్‌మెంట్ కోటా సీట్ల అమ్మకాలపై యాజమాన్యాలు దృష్టి సారించాయన్నారు. ఉన్నత విద్యామండలి ఆదేశాలను పాటించని ఇంజనీరింగ్ కళాశాలలపై క్రిమినల్ కేసులను నమోదు చేసి, వారి కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, మాజీద్, అనీల్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

### మోసపూరిత ఔషధ విక్రేతలపై

## డ్రగ్స్ కంట్రోల్ అధికారుల దాడులు







**ప్రజాపక్షం/హైదరాబాద్:** మోసపూరిత ప్రకటనలతో ఔషదాలను విక్రయిస్తున్న వారిపై డ్రగ్స్ కంట్రోల్ అధికారులు దాడులు నిర్వహించారు. వారి వద్ద నుంచి ఔషదాలను స్వాధీనం చేసుకున్నారు. సిద్ధిపేటలో ఫుడ్‌లైసెన్స్ ఆధారంగా ఫుడ్ ప్రొడక్ట్ పేరుతో ప్రజ్ఞపూర్‌లో మెట్‌నూరో ఒడి ట్యాబ్‌లెట్స్‌ను విక్రయిస్తున మెడికల్ షాపుపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ సిద్ధిపేట అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ జె.రాజు, ఇన్‌స్పెక్టర్లు ఎస్.వినయ్ సుశ్మీ ఆధ్వర్యంలోని డ్రగ్స్ బృందం దాడులు చేసింది. వారి వద్ద నుంచి ఔషదాలను స్వాధీనం చేసుకున్నారు. మధుమేహం, నరాల బలహీనత, జ్వరం, కంటిరుగ్మతలకు చెందిన గ్లూకోమాప్, అశ్వగంధరిష్ట, శ్రీతులసి, కంటి డ్రాప్ మందులను విక్రయిస్తున్న హైదరాబాద్ కాచిగూడలోని మహార్షి ఆయుర్వేద గ్లూకోమాప్, సరూర్‌నగర్‌లోని ఆశ్వగంధరిష్ట, వనస్థలిపురంలోని శ్రీతులసి డ్రాప్స్, బాలాపూర్‌లోని ఐ డ్రాప్ సంస్థలపైన డ్రగ్స్ అధికారులు దాడులు చేశారు. రంగారెడ్డి అసిస్టెంట్ డైరక్టర్ అంజూమ్ అబిదా, ఇన్‌స్పెక్టర్లు వి.రవికుమార్, జె.నాగరాజు, ఎల్.రాజు, వి.అజయ్ బృందం దాడులు చేసింది. వారి వద్ద నుంచి ఔషదాలను స్వాధీనం చేసుకున్నది.

# నకిలీకి అడ్డాలుగా నర్సరీలు

### అనుమతులు లేకుండానే నిర్వహణ

### బాధిత రైతుల్లో నర్సరీ కొనుగోలుదారులే ఎక్కువ

### చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న వ్యవసాయ అధికారులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** నకిలీ విత్తనాలు అరకట్టేందుకు ప్రభుత్వం ఒక వైపు మాత్రమే దృష్టిసారించింది. పత్తి విత్తనాలలో నకిలీలను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వాంచనీయమే కాని ఇది కేవలం పత్తి, ఇతర వాణిజ్య పంటలకు సరిపోతుంది. కాని నకిలీ విత్తనాల ద్వారా నష్టపోయే పంటలు ప్రధానంగా మిర్చి, పత్తి, వరి, అపరాలు మాత్రమే. అతిపెద్ద వాణిజ్య పంటలైన మిర్చి, పత్తిలో నకిలీలను అరికడితే రైతులను ఒక రకంగా ఆదుకున్నట్లే. మిర్చి సాగు తీరు మారింది. గతంలో మిర్చి విత్తనాలను రైతులు ఎదపెట్టేవారు. వాటిని సాలు తోటలు అనేవారు. మొలకెత్తి 30 నుంచి 40 రోజుల వయస్సు వచ్చిన తర్వాత వాటిని తిరగనాటేవారు. కాని మిర్చిలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత మొక్క తోటలు ఎక్కువగా వేస్తున్నారు. నారుపోసి 40 రోజులు దాటిన తర్వాత సాగు చేయాలనుకున్న భూముల్లో నాటుతున్నారు. దీని వల్ల పెట్టుబడి పెరిగినా దిగుబడి ఎక్కువగా ఉండడం సస్యరక్షణ చర్యలు చేపట్టడం సులువు కావడంతో ఇటీవల కాలంలో ఈ రకమైన సాగుపైనే రైతుల దృష్టిసారించారు. దాదాపు సాలు తోటలు కనుమరుగయ్యాయి. ఇదే సమయంలో మిర్చి నారు పోసి పెంచి తిరిగి తమ భూముల్లో నాటుకునే రైతుల సంఖ్య క్రమేపి తగ్గిపోయింది. రకరకాల కారణాల రీత్యా రైతులు నర్సరీలలో మిర్చి నారును కొనుగోలు చేస్తున్నారు. ఒక ఖమ్మం జిల్లాలోనే లక్ష ఎకరాల్లో మిర్చి సాగు చేస్తుండగా దీనిలో 95 శాతం మంది రైతులు నర్సరీలలోనే కొనుగోలు చేస్తున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నర్సరీల సంఖ్య గణనీయంగా పెరిగింది. కొన్ని మండలాల్లో వీటి సంఖ్య 50 వరకు ఉందంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఇప్పుడు నర్సరీ నిర్వహణ అతి పెద్ద వ్యాపారంగా మారింది. అసలు విత్తనాలను కొని సాగు చేస్తే లాభాలు తక్కువగా ఉంటున్నాయని మిర్చి విత్తనాల బ్రాండ్‌లు చెప్పి మిర్చి నారును విక్రయిస్తున్నారు. కల్తీ విత్తనాల ద్వారా పెంచిన నారు తరచూ చీడపీడలకు గురికావడం, పెరుగుదల లేకపోవడం, దిగుబడి రాకపోవడం జరుగుతుంది. ఎవరైనా రైతు ఆందోళన చేస్తే వెంటనే వీలైతే బెదిరించడం లేదంటే సెటిల్‌మెంట్ చేసుకోవడం చేస్తున్నారు. అనుమతుల విషయంలో వ్యవసాయ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం అనుమతులు తీసుకున్నా నిబంధనలు పాటించక పోవడంతో ప్రతి యేటా కోట్లాది రూపాయలు రైతులు నష్టపోతున్నారు. ఏ నర్సరీలో పెంచే మిర్చి నారుకు సంబంధించి ఎక్కడ కొనుగోలు చేశారు అనే దానిపై అధికారులు పట్టించుకోవడం లేదు. ఖచ్చితంగా నర్సరీలో పెరుగుతున్న మిర్చి నారు ఏ కంపెనీ విత్తనాలు వాడారు, ఎక్కడ కొనుగోలు చేశారు. రైతుల మాదిరి రశీదులు, లేబుల్స్ ఉన్నాయా అని వ్యవసాయ అధికారులు విచారణ చేయాల్సి ఉంది. నర్సరీల యజమానులు అధికారులను ప్రలోభపర్చడం రైతులకు శాపంగా మారింది. ఇక ఒక నర్సరీకి అనుమతి తీసుకుని రెండు మూడు చోట్ల నర్సరీలు ఏర్పాటు చేయడం కొందరు అనుమతులు లేకుండానే నర్సరీలు కొనసాగించడం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం కల్తీ విత్తనాల పై దృష్టిసారించిన విధంగానే నర్సరీలపై దృష్టి సారించాల్సి ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



## కులదురహంకార హత్యకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలి : డిహెచ్‌పిఎస్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కులదురహంకార హత్య కు పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయడంతో పాటు హనుమాన్ దీక్షలో ఉన్న దళితులను అవమానపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) డి హెచ్ పి ఎస్ రాష్ట్ర కౌనిల్స్ డిమాండ్ చేసింది. సంగారెడ్డి జిల్లా లోని కోహిర్ మండలం బడంపేట్ గ్రామంలో ఈ నెల 26న అగ్రకుల పెత్తందారుల చేతుల్లో తీవ్ర గాయలపాలై హైదరాబాద్ ఉస్మానియా లో చికత్స పొందుతూ చనిపోయిన దళితుడు బేగరి నర్సింహులు హత్యతో పాటు హనుమాన్ దీక్షలో ఉన్న మెట్టపల్లి కిషన్ తోపాటు మరో ఐదు మందిని అవమానపరిచిన ఘటనను డిహెచ్‌పిస్ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నింధితులందరిని తక్షణమే అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బేగరి నర్సింహులు ఈ నెల 1వ తేదీన వేరే గ్రామానికి చెందిన ఒక అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకోగా, ఈ నెల 18న రాత్రి సమయంలో ఊరి చివరకు తీసుకెళ్లి ఇష్టను సారంగా కొట్టడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడన్నారు. ఈ నెల 18న తన కొడుకును కొట్టారని బేగరి నర్సింహులు తండ్రి లచ్చయ్య ఫిర్యాదు చేసినప్పటికి నిందితులపై పోలీసులు ఏలాంటి చర్యలు తీసుకోక పోవటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 9మందిని వెంటనే అరెస్ట్ చేయాలనీ నర్సింహులు హత్యపై సమగ్ర విచారణ జరపాలని, మృతుని కుటుంబనికి రూ.25లక్షల ఎక్ష్సేషియా తో పాటు ఇందిరమ్మ ఇల్లు, 3ఎకరా ల భూమి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సిద్దిపేట రూరల్ మండలంలోని సీతారాం పల్లి గ్రామంలో గత బుధవారం దళిత సామాజిక వర్గానికి చెందిన కొంతమంది వ్యక్తులు హనుమాన్ మాల ధరించి గుడిలో పూజ చేసుకోవడానికి వెళ్లగా అగ్ర కులస్తులు అడ్డుకోవడమే కాకుండా వారిని కులంపేరుతో దూషించడం జరిగిందన్నారు. ఇలాంటి ఘటనలో మరోసారి జరగకుండా ప్రభుత్వం నిందితుల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని మారుపాక అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.

ప్రజాపక్షం

శుక్రవారం, మే 31

## ప్రధాని స్థాయికి తగని వ్యాఖ్యలు

ఒడిశా ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ (బిజెడి) అగ్రనేత నవీన్ పట్నాయక్ ఆరోగ్యంపై ప్రధాని నరేంద్ర మోదీ తన హోదాకు, స్థాయికి తగని వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. పట్నాయక్ ఆరోగ్యం సుమారు ఏడాది కాలంగా క్షీణిస్తూ వస్తున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందులో తప్పులేదు. అయితే, పట్నాయక్ అనారోగ్యానికి కుట్ర రంగును పులిమి, ఒడిశా రాజకీయాల్లో ముసలం సృష్టించే ప్రయత్నం చేయడం మాత్రం ఆక్షేపణీయం. సుమారు రెండున్నర దశాబ్దాలుగా ఒడిశాలో తిరుగులేని నాయకుడిగా పట్నాయక్ కొనసాగుతున్నారు. ఒడిశాలో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. బిజెడిని ఓడించడం సాధ్యం కావడం లేదు. సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి, కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలని కలలుగంటున్న బిజెపికి ఒడిశాలో పాగా అసాధ్యమని అర్థమైంది. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో బిజెడి మరోసారి గెలుస్తుందన్న అభిప్రాయం వ్యక్తం కావడంతో ప్రధాని తీవ్ర అసహనానికి గురై ఉండవచ్చు. పట్నాయక్ ఆనారోగ్యాన్ని అడ్డుపెట్టుకొని చేసిన వ్యాఖ్యలు ఆయన మానసిక పరిస్థితికి అద్దం పడుతున్నాయి. పట్నాయక్ ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణించడం వెనుక కుట్ర దాగుందని, ఒడిశాలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తే, కారణాలు తెలుసుకునేందుకు కమిటీ వేస్తామని మోదీ ప్రకటించారు. బిజెడిలో కీలక నేతగా ఎదుగుతున్న మాజీ ఐఎఎస్ వికె పాండ్యన్ పాత్ర ఉందేమోనన్న అనుమానాలు తలెత్తేలా ప్రధాని వ్యాఖ్యలు కొనసాగాయి. పట్నాయక్‌కు పర్సనల్ సెక్రెటరీగా ఉన్న పాండ్యన్‌ను దోషిగా పార్టీ నేతల ముందు నిలబెట్టడమే ప్రధాన లక్ష్యంగా తోస్తున్నది. పట్నాయక్ ప్రభుత్వాన్ని నడుపుతున్న లాబీయే ఆయన అస్వస్థతకు కారణమై ఉండవచ్చని పేర్కొంటూ, బిజెడిలో అగ్గి రాజేసే ప్రయత్నం చేశారు. ఎక్కువ సీట్లు సాధించి, అధికారంలోకి వచ్చిన పార్టీల్లో చీలికలు తెచ్చి.. ఎమ్మెల్యేల కొనుగోలు రాజకీయాలు నడిపి.. బిజెపి దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన ఘటనలు కోకొల్లలు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను పడగొట్టడంలో బిజెపిని మించిన పార్టీ లేదు. మోదీ, అమిత్ షాలకు ఎవరూ సాటిరారు. అబద్ధాలను, అర్ధ సత్యాలను ప్రచారం చేయడంలోనూ వీరు నిష్ణాతులే. పట్నాయక్ ఆరోగ్యంగా లేరేమోనన్న అనుమానాన్ని రేకెత్తించడంలో ప్రధాని సఫలమయ్యారు. తన ఆరోగ్యంపై తానే వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితిని పట్నాయక్‌కు కల్పించారు. 'నేను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాను. నెల రోజులుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాను' అని పట్నాయక్ చేసిన ప్రకటన కంటే, ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించిపోతున్నదనే వార్త విస్తృతంగా ప్రచారమైంది. ప్రజల సెంటిమెంట్‌కు 'కుట్ర' నెగడును రాజేసి, రాజకీయ మంటకోసం ప్రధాని ఎదురుచూస్తున్నారు. 'పట్నాయక్ వర్సెస్ పాండ్యన్'గా బిజెడిని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ఆ పార్టీ రెండు ముక్కలుగా చీలిపోతే, బిజెపి లాభపడుతుంది. మహారాష్ట్ర రాజకీయ ముఖచిత్రం ఒడిశాలోనూ దర్శనమిస్తుంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బలం బిజెపికి లేకపోతే, బిజెడి చీలిక వర్గాన్ని మంచి చేసుకొని, ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న ఆలోచన ప్రధాని మాటల్లో అంతర్లీనమై ఉంది. 1997 నుంచి బిజెడికి తిరుగులేని నాయకుడిగా కొనసాగుతూ, ప్రజాభిమానంతో ముఖ్యమంత్రి హోదా దక్కించుకున్న నాయకుడి ఆరోగ్యంపై వ్యాఖ్యలు చేయడం ప్రధాని హోదాకు తగని పని. ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల ఏమాత్రం గౌరవం లేని బిజెపి అధికారం కోసం అడ్డదారులు తొక్కడంలో ఆశ్చర్యం లేదు. లోక్‌సభతోపాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతున్న ఒడిశాలో బిజెడితో పొత్తుకు బిజెపి చేసిన ప్రయత్నం చివరి క్షణంలో విఫలమైంది. అందుకు పాండ్యన్ కారణమని బిజెపి భావించింది. ముఖ్యమంత్రిని అడ్డం ఎట్టుకొని, పాండ్యన్ పరిపాలన సాగిస్తూ, వారసుడిగా ఆవిర్భవిస్తున్నారన్న అనుమానంతో, ఒడిశా పాలన తమిళుల చేతిలోకి పోతుందని ఆరోపించింది. 'ఆత్మగౌరవ' ప్రచారం మొదలుపెట్టింది. ఆ ప్రచారాన్ని ఒడిశా ప్రజలు స్వీకరించలేదు. దీనితో చివరి అస్త్రంగా పట్నాయక్ ఆరోగ్యంపై 'కుట్ర'ను ప్రచారంలో పెట్టారు. ఓటర్లు బుద్ధి చెప్పకపోరు.

## వీరు.. తెలంగాణ వీరులు



వారికి సంవత్సరాల తరబడి శిక్షణ లేదు.. కవాతులు, తుపాకులు తెలియవు... కానీ, అణచివేతను ధిక్కరించిన నికార్సయిన ధైర్యం వారిది.. ఆయుధాలు చేపట్టిన నిజమైన తెగింపు కూడా వారిదే. దోపిడిని నిలదీసి, సమర శంఖం పూరించి.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చెమటతోపాటు రక్తాన్నీ చిందించారు. న్యాయం కోసం.. స్వేచ్ఛ కోసం పరితపించారు. త్యాగాలు చేశారు. భవిష్యత్ ఉద్యమాలకు పునాదులు వేశారు. తెలంగాణ అంటే చెరగని, మలగని దీప్తిగా నిరూపించారు. వారి ఆశయం అపూర్వం.. శక్తి అనంతం.. తెగువ అనిర్వచనీయం.. దార్శనికత ప్రశంసనీయం.. త్యాగం అనితర సాధ్యం. నాటి ఉద్యమ పోరాట యోధులకు నేటి యావత్ తెలంగాణ సమాజం తలవంచి విప్లవాభినందనలు తెలుపుతున్నది.

**జై తెలంగాణ.. జైజై తెలంగాణ..**



### తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ప్రజల విజయం

# దశాబ్ది ఉత్సవాలు ప్రగతికి నాందికావాలి!



చాడ వెంకటరెడ్డి
సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు
మాజీ ఎమ్మెల్యే

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి జూన్ 2వ తేదీ నాటికి దశాబ్ద కాలం పూర్తవుతుంది. రాష్ట్ర సాధన ఉద్యమంలో జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు, అనేక ప్రజా సంఘాలు ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, నిర్వహించడంతోపాటు అనేకమంది విద్యార్థులు యువకులు ప్రాణత్యాగాలు చేసిన అనంతరం 2014 జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది.

### పూర్వరంగం

1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించినా హైదరాబాద్ సంస్థానం నిజాంపరిపాలన కబంధహస్తాల్లో ఉండడం మూలంగా తెలంగాణ ప్రాంతానికి స్వాతంత్ర్యం సిద్ధించలేదు. హైదరాబాద్ సంస్థానంలో నిజాం, రజాకార్ల, దేశ్‌ముఖ్‌ల ఆగడాలను ఎదిరిస్తూ వెట్టిచాకిరి, బానిసత్వం రద్దు చేయాలని, దున్నేవానికి భూమి కావాలని కమ్యూనిస్టు పార్టీ పిలుపుమేరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 1946 నుండి 1951 వరకు ఉధృతంగా సాగింది. ఆ పోరాటంలో 4500 మంది అమరత్వం పొందారు. సాయిధ పోరాటాన్ని ఎదుర్కోలేని నిజాంసర్కార్ 1948 సెప్టెంబర్17న హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడంతో హైదరాబాద్ రాష్ట్రం (తొలి సారి తెలంగాణ రాష్ట్రం) నాడు ఏర్పడింది.

మహారాష్ట్రలో 5 జిల్లాలు, కర్ణాటకలో 3 జిల్లాలు, తెలంగాణ ప్రాంతంలో 8 జిల్లాలు కలిపి 16 జిల్లాల హైదరాబాద్ సేట్‌గా 1948 విలీనం వరకు పరిపాలనసాగింది. కొంతకాలం తర్వాత కేంద్ర ప్రభుత్వం 1953లో భాష ప్రాతిపాదికన రాష్ట్రాల విభజన కోసం రాష్ట్ర పునర్విభజన కమిషన్‌ను ఏర్పాటు చేసింది. భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరుతో తెలుగు మాట్లాడే వారందరినీ ఒకే గూటికి తీసుకురావడం కోసం 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేయబడింది. రెండు ప్రాంతాల ప్రజలు కలిసిమెలిసి ఉండాలని పెద్ద మనుషుల ఒప్పందం కూడా జరిగింది.

### ఒప్పందాల ఉల్లంఘన – తొలి దశ ఉద్యమం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం తీవ్ర నిర్లక్ష్యానికి గురవడం, పాలకులు వివక్షత పెద్దమనుషుల ఒప్పందం సరిగా అమలు నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం తెలంగాణ అభివద్ధికి ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉధృతంగా వచ్చింది. ఆ ఉద్యమంలో 369 తెలంగాణ ఉద్యమకారుల్లో కొంత నిరాశ నిస్పృహలు ఏర్పడినవి. 1980వ దశకంలో మళ్ళీ తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి అడుగులు పడ్డాయి. 1984 ప్రాంతంలో తెలంగాణ జనసభ ఏర్పాటు కాబడింది. వరంగల్, కొత్తగూడెం పట్టణాలలో తెలంగాణ జనసభ సమావేశాలు ఏర్పాటు చేసి అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీకి వినతి పత్రాలు సమర్పించారు. ఉస్మానియా ప్రొఫెసర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో సదస్సులు ఏర్పాటు చేసి సెప్టెంబర్ 17ను తెలంగాణ విముక్తి దినంగా జరపాలని తీర్మానించడం జరిగింది. ప్రొఫెసర్ జయశంకర్, ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ లాంటి వారి అధ్యయనాలు ఉద్యమానికి బాగా ఉపయోగపడ్డాయి.

1997లో జయశంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఐక్యవేదిక ఏర్పాటు కాబడింది. కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని కార్యక్రమాలు నిర్వహించేవారు.

### సాయుధ పోరాటం నుండి ప్రత్యేక తెలంగాణ వరకు..

నాడు నైజాం రాచరిక, భూస్వామ్య కబంధ హస్తాల నుండి రక్షించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నేతృత్వం వహించిన కమ్యూనిస్టు పార్టీకి తెలంగాణతో ప్రత్యేక అనుబంధం ఉంది. అనంతరం ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటు తరువాత భాషా ప్రయుక్త రాష్ట్రమైన విశాలాంధ్ర కోసం కూడా కమ్యూనిస్టు పార్టీ పోరాడి ఆంధ్రప్రదేశ్ సాకారమవడంలో కీలకపాత్ర అయితే ఒప్పందాల ఉల్లంఘన జరిగి తెలంగాణకు అన్యాయం జరుగుతున్న తీరుపై మొదట్లో ఉమ్మడి రాష్ట్రంలోనే పరిష్కారాలు వెదికింది. అందులో భాగంగా తెలంగాణ ప్రాంత అభివృద్ధి కోసం రూ.5వేల కోట్ల ప్యాకేజీ, తెలంగాణలో ప్రాజెక్టులు సత్వర నిర్మాణం, ప్రాంతీయ అభివద్ధి మండలి ఏర్పాటు, పరిశ్రమల ఏర్పాటును కోరుతూ వరంగల్ డిక్లరేషన్‌ను ప్రకటించింది. 2000 సంవత్సరం నుంచే తెలంగాణ సమాజంలో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష మొదలైంది. కవులు, రచయితలు, మేధావులలో అంతటా భావజాల ప్రచారం మొదలైంది. తెలంగాణ ప్రాంతంపై ఆనాటి పాలకుల తీరులో ఎలాంటి మార్పు లేకపోవడం మూలంగా తెలంగాణ ప్రాంతంలోని మేధావులు, అభ్యుదయవాదులు, సబ్బండ వర్గాల, సకల జనులు తెలంగాణ మలిదశ ఉద్యమానికి శ్రీకారం చుట్టడంతో ఉద్యమం ఉధృత రూపం దాల్చింది.



సకల జనుల సమ్మెలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్న దృశ్యం

ఒకవైపు వరంగల్ డిక్లరేషన్ కోసం పోరాటం చేసిన సిపిఐ, పాలకులు దానిని పెడచెవిన పెట్టడంతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి సిపిఐ జాతీయ స్థాయిలో చర్చించి తెలంగాణ రాష్ట్రమే పరిష్కారమని, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమించాలని జాతీయ మహాసభలో తీర్మానం చేసింది. రాష్ట్ర ఆవశ్యకత గురించి, తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలపై, అవమానాలపై ప్రొఫెసర్ జయశంకర్, కాళోజి, కోదండరాం, ప్రజాయుద్ధ నౌక గద్దర్, కెసిఆర్‌తో పాటు భారత కమ్యూనిస్టు పార్టీ. సిపిఐ జాతీయ, రాష్ట్ర నాయకత్వం సుస్పష్టంగా రాష్ట్ర ప్రజలకు సభలు, సమావేశాలు, సదస్సుల ద్వారా వివరించింది.

### ఉధృతంగా సాగిన మలి దశ ఉద్యమం

2001లో తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా కల్వకుంట్ల చంద్రశేఖర రావు అధ్యక్షుడిగా తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. ఒక్క బిఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర సాధన సాధ్యం కాదనే ముందు చూపుతో ప్రొఫెసర్ కోదండరాం చైర్మన్‌గా తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టి.జెఎసి) ఏర్పడింది. అందులో అనేక రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఉన్నాయి. సిపిఐ జెఎసిలో లేకపోయినప్పటికీ ప్రతి ఉద్యమంలో భాగస్వామి అయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో



ఆర్‌టిసి ఉద్యోగుల సమ్మెను అటకాయించిన పోలీసులు

తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలపై అన్ని రాజకీయ పార్టీలతో పాటు అనేక ప్రజాసంఘాల నాయకులు ఉద్యమాలు నిర్వహించడం జరిగింది. 2004–2009 మధ్య కాలంలో కేంద్రంలో యు.పి.ఎ ప్రభుత్వం అధికారంలో ఉంది. అటు కాంగ్రెస్ పార్టీ, ఇటు యు.పి.ఎ లో భాగస్వామ్యం అయిన సిపిఐ, టిఆర్ఎస్ పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి, తెలంగాణ ప్రాంతంలో జరుగుతున్న ఉద్యమాలను, విద్యార్థుల, యువకుల ఆత్మ బలిదానాలను వివరించడం జరిగింది. దీనికి తోడు తెలంగాణ ప్రాంత పార్లమెంట్ సభ్యుల ఆవేదనను అర్థం చేసుకున్న యు. పి.ఎ చైర్ పర్సన్ సోనియాగాంధీ 2009 డిసెంబర్ 9న రాష్ట్ర ఆవిర్భావాన్ని ప్రకటించడం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపిలు, ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయడంతో కాంగ్రెస్ పార్టీ ఆ ప్రకటనను పెండింగ్‌లో పెట్టింది. మలిదశ తెలంగాణ ఉద్యమం ఉధృతం కావడానికి డిసెంబర్ 9 ప్రకటన నుండి వెనక్కి పోవడమే ప్రధాన కారణం అయ్యింది. ఆ ఉద్యమం రోజు రోజుకు తీవ్ర రూపం దాల్చడం సిపిఐ, బిజెపిపార్టీలతో పాటు టిఆర్ఎస్ ఇంకా కొన్ని ప్రాంతీయ పార్టీలు తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవడంతో సానుకూలంగా వ్యవహరించిన కాంగ్రెస్ పార్టీ క్రమక్రమంగా రాష్ట్ర సాధన దిశగా యు.పి.ఏ.2 ప్రభుత్వం అడుగులు వేసింది. సోనియాగాంధీ నిర్ణయం మేరకు లోక్‌సభలో, ఇటు రాజ్యసభలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లు పెట్టినారు. బిల్లు ఆమోదం పొందే సమయంలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఎంపిలు ఆ బిల్లు ఆమోదం పొందకుండా అనేక కుట్రలు, కుతంత్రాలు చేసి, అడ్డుకున్నారు.

### స్వరాష్ట్రంలో ఏమి జరిగింది?

దేశంలో అత్యున్నత స్థానమైన పార్లమెంటులో తెలంగాణ ఎంపిలపై పెప్పర్ స్ప్రే దాడులకు పాల్పడినప్పటికీ ఆ బిల్లు ఆమోదం పొంది దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం 2014 జూన్ 2న ఆవిర్భవించింది. నీళ్ళు,నిధులు, నియామకాలు అనే ప్రధాన ఎజెండా తో ముందుకు వెళ్లిన టిఆర్ఎస్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకొని తెలంగాణ రాష్ట్ర ప్రథమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి గా కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ మొదటి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు, ఆకాంక్షలు పెట్టుకున్నారు. ఆశలు కాస్త ఆడియాశలు అయ్యాయి. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను 10 సంవత్సరాల కాలంలో 7 లక్షల కోట్ల రూపాయల అప్పుల్లోకి కెసిఆర్ ప్రభుత్వం తీసుకెళ్లింది. ఎన్నో ఏళ్లుగా రైతుల భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోబడడం లేదు. రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం సమగ్ర భూ సర్వే చేయలేదు. ధరణి పోర్టల్‌లో అనేక లొసుగులు ఉన్నాయి.

రాష్ట్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల కుటుంబాలను గుర్తించక పోవడం, గుర్తించిన కుటుంబాలను ఆదుకోకపోవడం, తెలంగాణ అమరవీరుల స్మారకస్తూపం ఆవిష్కరణ సందర్భంగా కనీసం తెలంగాణ కోసం ఉద్యమించిన గద్దర్‌ను, అమరుల కుటుంబాలను కూడా పిలువకపోవడం కెసిఆర్ ఒంటెత్తుపోకడకు నిదర్శనం. ప్రజలు 10 సంవత్సరాల నిరంకుశ పరిపాలనకు చరమగీతం పాడి ముఖ్యమంత్రి కెసిఆర్‌ను ఇంటికి సాగనంపారు. విభజన హామీలకు బిజెపి ప్రభుత్వం తూట్లు పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలను ఏ ఒక్కటి కూడా అమలు పరచలేదు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం, పదేళ్లుగా రాష్ట్రంలో పాలన చేసిన ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఆశయాలు తీర్చలేకపోయారు. ముఖ్యంగా కెసిఆర్ అహంకార పూరిత,ప్రజా వ్యతిరేక వైఖరి, కుటుంబపాలన ప్రజలందరికీ అభ్యంతరకరమైంది.

### తిరిగి తెలంగాణ ఆకాంక్షలు మొలకెత్తాయి

2010 డిసెంబర్ ఎన్నికల్లో కెసిఆర్ పట్ల వ్యతిరేకతతో ప్రజలు కాంగ్రెస్‌కు మోజారిటీ సీట్లు ఇవ్వటంతో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఉత్సాహవంతుడైన రేవంత్ రెడ్డి అన్ని వర్గాలను కలుపుకొని తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన ఆవశ్యకత ఉంది.ప్రజాపాలన కొనసాగాలంటే ముఖ్యమంత్రి, మంత్రులు నిత్యం ప్రజలను,ప్రజా సంఘాలను, ప్రతిపక్షాలను కలవాలి,వారి నుండి వచ్చే వినతులు స్వీకరించి,పరిశీలించి పరిష్కరించాలి.ప్రజాస్వామ్య పరిరక్షణకై రేవంత్ రెడ్డి ముందుండాలి. ముందుగా భూ సమస్య పరిష్కరించాలి. ధరణి సమస్యల పరిష్కారం చేయడం, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు అధ్యయనం చేయాల్సి ఉంది. చంద్రశేఖర రావు ఎక్కడ వైఫల్యం చెందాడో గమనించి రాష్ట్ర ప్రజల సంక్షేమం దిశగా ప్రజా పాలన సాగాలి. ప్రజల ఆకాంక్షల కోసం పోరాడి తెచ్చుకున్న తెలంగాణ మానవీయంగా నిలవాలి. అలాగే ప్రజాస్వామిక సామాజిక తెలంగాణ కోసం పాటుపడాలి.

# ఐరాసలో పాలస్తీనా సభ్యత్వానికి ఆటంకాలెందుకు?

సి.ఎస్.ఆర్.మూర్తి

గాజాలో ఇజ్రాయిల్ యుద్ధం అనేక నైతిక, రాజకీయ, దౌత్యపరమైన ప్రశ్నలకు దారితీసింది. ఐక్యరాజ్యసమితి (యు.ఎన్)లో సభ్యత్వం కోసం పాలస్తీనా దరఖాస్తు పునరుద్ధరణపై ఒక దౌత్యపరమైం పరిణామవ చాలా ఎక్కువ ఆసక్తికరమైన అంశంగా అందరిదృష్టినీ ఆకర్షించింది. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా స్తంభించిపోయిన ఈ సమస్యపై సంప్రదింపుల ద్వారా ఒక పరిష్కారం జరిగిన తర్వాతే సభ్యత్వం వస్తుందంటూ ప్రధానంగా అమెరికా చేస్తున్న భౌగోళిక రాజకీయ మదింపుల కారణంగానే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యు.ఎన్.ఎస్.సి)లో ఈ విషయం కదలకుండా ఆగిపోయింది. ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం పొందడంకోసం పాలస్తినా ప్రయత్నాలు చేయడం ఇది మొదటిసారి కాదు. 2011లో కూడా, సభ్యత్వంకోసం పాలస్తినా చేసిన విజ్ఞప్తిని భద్రతా మండలిలో అమెరికా తన వీటో అధికారం ద్వారా వ్యతిరేకించింది. ఇక అప్పటినుండీ పాలస్తినా కేవలం సభ్యదేశంగా కాకుండా ఒక పరిశీలక ప్రతిపత్తితో మాత్రమే ఐక్యరాజ్యసమితిలో కొనసాగుతున్నది. శాశ్వతసభ్యదేశ హోదాలో ఉన్న అమెరికా వీటో అధికారం ద్వారా వ్యతిరేకించడంవల్ల ఈ ఏడాది ఏప్రిల్ నెల సమావేశంలో పాలస్తినా చేసిన విజ్ఞప్తిని అంగీకరించడంలో భద్రతామండలి విఫలమైంది. దాంతో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ (యు.ఎన్.జి.ఎ) పాలస్తినా సభ్యత్వ దరఖాస్తుకు మద్దతుగా మాట్లాడుతూ తన ప్రయత్నాలను ఉధృతం చేసింది. ఐక్యరాజ్యసమితిలో పాలస్తినాకు పూర్తిస్థాయీ సభ్యత్వం ఇవ్వడానికి అర్హత ఉందని ఉద్ఘాటిస్తూ మే 10వ తేదీన జనరల్ అసెంబ్లీ ఇంతకుముందుకంటే బ్రహ్మాండమైన ప్రయత్నంతో ఒక తీర్మానం తీసుకువచ్చింది. పాలస్తినాకు మేలు చేసేవిధంగా ఆ దరఖాస్తును సానుకూల దృక్పథంతో పరిశీలించాలని భద్రతా మండలికి విజ్ఞప్తి చేసింది.

### నిబంధనలు, రాజకీయాలు

సభ్యత్వం కోరే దేశాలు ఐక్యరాజ్యసమితి దృష్టిలో శాంతి కాముక దేశాలుగా ఉండాల్సిన అవసరం ఉంది. ఐక్యరాజ్యసమితి తీర్పును సమ్మతించేవిధంగా ఉండాలి. ఐక్యరాజ్యసమితి హక్కుల పత్రంలో ఉన్న అన్ని బాధ్యతలకు తలవంచి వాటిని అమలుచేసేవిధంగా ఉండాలి. ఐతే సభ్యత్వంపొందడానికి నిర్దేశించిన కార్యవిధానపద్ధతులకు ఎవరికివారు ఇష్టానుసారంగా, స్వేచ్ఛగా భాష్యం చెప్పుకుంటే ఐక్యరాజ్యసమితిలో ప్రవేశానికి అంతిమ నిర్ణయం తిరుగులేనిదిగానూ, సంక్లిష్టంగానూ మారిపోతుంది. ఈ ప్రవేశాలను ఐదు శాశ్వత సభ్యదేశాలు (పి–5) భద్రతామండలిలో ఏ సమయంలోనైనా తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా శాసిస్తాయి. అలాంటి పరిస్థితుల్లో శాశ్వతసభ్యదేశాలైన పి–5లో ఏ ఒక్కదేశం వ్యతిరేకతతో పనిలేకుండా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ప్రవేశ సభ్యత్వ దరఖాస్తులను సమ్మతించడానికి ముందస్తు సిఫార్సు అవసరం అవుతుంది. మరోమాటలో చెప్పాలంటే, శాశ్వత సభ్యదేశాలలో ఏదో ఒక దేశం తన వీటో అధికారం ద్వారా ఇలాంటి దరఖాస్తులను వ్యతిరేకిస్తే భద్రతామండలి ఆ సిఫార్సును తిరస్కరిస్తుంది. కాబట్టి అలాంటి పరిస్థితుల్లో మూడింట రెండువంతుల మెజారిటీతో గనుక నిర్ణయం తీసుకుని ఆమోదం తెలియజేయనప్పుడు మాత్రమే ఆ విధమైన వీటో అధికారం జనరల్ అసెంబ్లీకి వర్తిస్తుంది.

ప్రపంచం రెండుగా విడిపోయి ప్రచ్ఛన్నయుద్ధ రాజకీయాలు కొనసాగిన గత సంవత్సరాలలో భద్రతామండలిలో అసంఖ్యాకంగా వచ్చిన ఐక్యరాజ్యసమితి సభ్యత్వ ప్రవేశ దరఖాస్తులు ఏ నిర్ణయం లేకుండా స్తంభించిపోయాయి. ఆ సమయంలో జనరల్ అసెంబి ప్రపంచ న్యాయస్థానాన్ని అభిప్రాయం చెప్పమని కోరింది. "భద్రతామండలి అవసరం లేకుండానే జనరల్ అసెంబ్లీ పలుదేశాలకు ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం ఇచ్చే అధికారం ఉందా?" అని ప్రపంచ న్యాయస్థానాన్ని ప్రశ్నించినప్పుడు, జనరల్ అసెంబ్లీ తన అధికారాలు ఉపయోగించడానికి ముందుగా భద్రతామండలి సిఫార్సు కావాలని 1948లో ప్రపంచ న్యాయస్థానం రూలింగ్ ఇచ్చింది. అటు పిమ్మట భద్రతామండలిలో అప్పటివరకూ ఉన్న ప్రతిష్టంభన తొలగిపోయింది. అప్పటి వరకూ అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తులకు ఉన్న ఆటంకాలన్నీ తొలగిపోయాయి. ఆ తర్వాతి దశాబ్దాలలో ఐక్యరాజ్యసమితిలో సభ్యదేశాల సంఖ్య పెరిగింది. అప్పటివరకూ 51 దేశాలు మాత్రమే ఐక్యరాజ్యసమితిలో సభ్యులుగా ఉండగా, ఈనాడు ఈ సభ్యదేశాల సంఖ్య 193 కు చేరుకుంది. వలస పాలకుల నుండి, ఆక్రమణల నుండి స్వాతంత్ర్యం పొంది స్వతంత్ర రాజ్యాలుగా అవతరించటానికి గుర్తింపుగా ఐక్యరాజ్యసమితి సభ్యత్వం పరిగణించబడిందనవచ్చు. పాలస్తినా విషయంలో మంగోలియా దేశాన్ని ఒక ఉదాహరణగా పాలస్తినాతో సరిపోల్చి చూడవచ్చు. భద్రతామండలిలో మంగోలియా సభ్యత్వ దరఖాస్తు కదలకుండా అపరిష్కృతంగా ఉండిపోయినప్పుడు ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ జోక్యం చేసుకుని పాలస్తినా తరహాలో చేసినవిధంగానే తీర్మానం ప్రతిపాదించింది. భద్రతామండలి మంగోలియాకు అనుకూలంగా సిఫార్సు చేయడాన్ని అన్నివిధాలుగా యోగ్యమైనదని జనరల్ అసెంబ్లీ సలహా ఇచ్చింది. దాంతో ఇక అంతిమంగా 1961లో మంగోలియా దేశానికి ఐక్యరాజ్యసమితి సభ్యత్వం వచ్చింది.

### భారతదేశ వైఖరి

పాలస్తినాకు ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం ఇచ్చేందుకు వీలుగా 2024లోనే జనరల్ అసెంబ్లీలో 142 సభ్యదేశాలతో భారతదేశం కూడా తన గళం కలిపి తీర్మానానికి అనుగుణంగా ఏకాభిప్రాయం వ్యక్తం చేసింది. పాలస్తినాకు గనుక ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం ఇస్తే ఆ ప్రతిపత్తివల్ల రెండు దేశాల (ఇజ్రాయిల్–పాలస్తినా) మధ్య అంతులేకుండా సుదీర్ఘంగా కొనసాగుతున్న వివాదానికి శాంతియుత పరిష్కారం లభించి ఇరుగు పొరుగు సహజీవనానికి దోహదం చేస్తుందని భారత్ అభిప్రాయం వ్యక్తం చేసింది. జవహర్‌లాల్ నెహ్రూనాటి కాలంలో అనుసరించిన విధానానికి అనుగుణంగానే ఈనాడూ భారతదేశం తన అభిప్రాయం వ్యక్తం చేయడం ప్రముఖంగా చెప్పాల్సిన విషయం. ఐక్యరాజ్యసమితి సభ్యత్వం పొందడానికి దరఖాస్తులు పెట్టుకోవడానికి వివక్ష లేకుండా అందరికీ తలుపులు తెరచే ఉంటాయన్నది భారత్ వైఖరి. వాస్తవం చెప్పాలంటే అసలు ఏనాడూ ఇప్పటివరకూ ఐక్యరాజ్యసమితిలో భారతదేశం ఏ దేశం ప్రవేశ అర్హత దరఖాస్తును వ్యతిరేకించలేదు. 1947లో పాకిస్థాన్ ఐక్యరాజ్యసమితిలో ప్రవేశానికి దరఖాస్తు పెట్టుకున్నప్పుడు కూడా భారత్ వ్యతిరేకించలేదు. చివరకు పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాతో మన దేశానికి వేల కిలోమీటర్ల పొడవునా సరిహద్దు ఆక్రమణ వివాదాలు ఉన్నప్పటికీ కూడా1971లో చైనా ప్రాతినిధ్య ప్రవేశాన్ని కూడా భారత్ వ్యతిరేకించలేదు. అదేసమయంలో అమెరికాగానీ, ఈనాడు అంతర్థానమైన యు.ఎస్.ఎస్.ఆర్ గాని, లేదా రష్యన్ ఫెడరేషన్‌గానీ చాలా దేశాలు ఐక్యరాజ్యసమితి సభ్యత్వం పొందకుండా అడ్డంపడ్డాయి. చైనాకు కూడా ఈ విషయంలో మినహాయింపు లేదు. కానీ1971లో భద్రతామండలిలో చైనాదేశం సభ్యత్వం పొందిన తర్వాత ఆనాడు కొత్తగా ఆవిర్భవించిన బంగ్లాదేశ్ ప్రవేశ సభ్యత్వ దరఖాస్తును మాత్రం చైనా తీవ్రంగా వ్యతిరేకించింది.

### ముందుకు పురోగమించే మార్గం ఏమిటి?

ఐక్యరాజ్యసమితి భద్రతామండలినీ, అమెరికా, చైనా,రష్యాలను కాదని పాలస్తినా పూర్తిస్థాయీ సభ్యత్వం పొందడం సాధ్యం కాదన్నది చాలా స్పష్టమైన విషయం. ఎందుకంటే ఈ విధమైన సంప్రదాయం ఆ తర్వాత తైవాన్, కొసావో దేశాల సభ్యత్వం విషయంలో కూడా ఇదేవిధంగా భద్రతామండలిని కాదని మరోదారిలో చేర్చుకునే సమస్య తలెత్తుతుందనే భయాలు ఆ దేశాలకు ఉండనే ఉంటాయి. గాజా, రఫాపై దాడుల విషయంలో ఇజ్రాయిల్ తన సలహాలను బేఖాతరు చేస్తోందనీ, అంతర్జాతీయంగా తమకు సమస్యలు ఎదురవుతున్నాయనీ కినుక వహించి ఆ దేశాన్ని నిరుత్సాహపరిచే ఉద్దేశంతో అమెరికా గనుక మరోసారి వ్యతిరేకత, నిరసన పేరుతో వీటో అధికారం ఉపయోగించకుండా లేదా వోటింగ్‌కు దూరంగా ఉన్నాగానీ పాలస్తినాకు ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం పొందడానికి జనరల్ అసెంబ్లీ ఆమోదం ద్వారా మార్గం సుగమం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ అలా జరిగితే ఇజ్రాయిల్ దేశం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తుంది. బహుశా ఐక్యరాజ్యసమితి నుండి వైదొలగవచ్చును కూడా. అలా కాకుండా భద్రతామండలిలో పాలస్తినా ప్రవేశ సభ్యత్వ దరఖాస్తు విషయంపై ప్రతిష్టంభన అదేవిధంగా కొనసాగినట్లయితే, జనరల్ అసెంబ్లీ తన చర్చలు, సంప్రదింపుల నుండి ఇజ్రాయిల్‌ను దూరంగా పెట్టాలన్నవిషయాన్ని కూడా పరిశీలించే అవకాశాలు ఉంటాయి. ఆ విధమైన సాహసోపేతమైన వ్యూహాత్మక చర్య మాత్రం భద్రతామండలి సిఫార్సు లేకుండా ఆచరణలో అమలు చేసే సంప్రదాయం అసాధ్యం. ఒకనాడు జాతి వివక్షను అనుభవించిన సమయంలో దక్షిణాఫ్రికాదేశంగానీ, అత్యంత క్రూరమైన జాతుల ఘర్షణలో ఉన్నప్పటి యుగొస్లావియాలోని సెర్బ్ రిపబ్లిక్‌గానీ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో భాగం పంచుకోకుండా నిషేధించబడినాయి.ఈ విధమైన సైద్ధాంతిక ప్రత్యామ్నాయాలను అలావుంచితే, పాలస్తనాకు సెప్టెంబర్ నుంచి ఐరాస్‌లో భాగస్వామ్య హక్కులు లభిస్తాయి. అయితే జనరల్ అసెంబ్లీలో ఓటుచేసే అధికారం, ఇతర ప్రధాన ఐరాస సంస్థల్లోకి ఎన్నికయ్యే అవకాశం ఉండదు. ఆ బలం ఈ దశలో హక్కుకాజాలదు.

(హిందూ సౌజన్యంతో)

## ప్రభుత్వ బడులకు పూర్వ వైభవం?

తెలంగాణ రాష్ట్రంలో ఆదర్శ అమ్మ పాఠశాలల పేరిట 2024–25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడులలో మౌలిక సదుపాయాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్లు కేటాయించడం అభినందించదగిన విషయం. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో దశాబ్దాలుగా పెయింట్స్ లేక పోవడం, గోడలు పర్రెలు పర్రెలుగా ఊడిపోవడం, ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలిపోతాయో తెలియని భయాందోళన పరిస్థితులున్నాయి. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో టాయిలెట్లు, మౌలిక సదుపాయాల కల్పనకు అడ్వాన్స్‌గా రూ.125 కోట్లు విడుదల చేసింది. ప్రభుత్వ, పంచాయతీ రాజ్, పాఠశాలలలో సరైన సదుపాయాలు లేకపోవడంతో పేద, బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ విద్యార్థులను వేలకు వేలు లక్షలకు లక్షలు ఫీజుల రూపంలో చెల్లించి ప్రయివేటు పాఠశాలలకు పంపేవారు. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, సాంఘిక శాస్త్రం చిత్ర పటాలు, గ్లోబులు, ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేయడం వల్ల అనేక మంది విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలను వదిలి ప్రభుత్వ, రాజ్ పాఠశాలల్లో చేరుటకు మక్కువ చూపుతున్నారు. 2024–25 విద్యా సంవత్సరం జూన్ 12 వ తేదీ ప్రారంభించనున్న దృష్ట్యా బడులు ప్రారంభం అయ్యేలోగా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పనులను వేగవంతం చేసింది. పంచాయతీ రాజ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాలు, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఎలక్ట్రీషియన్, కూలిన గోడల పునః నిర్మాణం, కూలడానికి సిద్ధంగా ఉన్న పాఠశాలల ప్రహారీ గోడల నిర్మాణం,పెయింటింగ్ ఇతర మౌలిక సదుపాయాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వం ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలలలో మౌలిక సదుపాయాల కల్పనకు, ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించి నిర్లక్ష్యం, నిర్లిప్తత వలన ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల విద్యార్థులను రెసిడెన్షియల్ పాఠశాలలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ అంటూ ప్రారంభించి చేర్పించడం వలన ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు లేకపోవడం వలన విద్యా వ్యవస్థ కుంటునడిపోయింది. బడులు ప్రారంభించే లోగా ఉపాధ్యాయుల పదోన్నతులు బదిలీలు చేయాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణలో పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తర్వాత పరిపాలనపై దృష్టి కేంద్రీకరిస్తానని చెప్పడం విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తానని అనడంతో ఉపాధ్యాయులు ఎంతో సంతోషిస్తున్నారు. గతంలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల హైకోర్టు స్టే ఇవ్వడం వలన ఆగి పోయింది. కేసు పూర్వాపరాలు పరిశీలించి వాద వివాదాల తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేసుకోవడం లో ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వానికి సూచనలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు బడులు ప్రారంభం అయ్యేలోగా పూర్తి చేయాలని తెలంగాణరాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్,
9290826988

## రైలు కింద పడి ఇద్దరు మృతి



**ప్రజాపక్షం / మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో గురువారం ఓ మహిళ, ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మిర్యాలగూడ రైల్వే స్టేషన్ పరిధిలోని మిర్యాలగూడ, కుక్కడం మధ్యలో ఉన్న ఐలాపురం గ్రామ సమీప రైల్వే ట్రాక్‌పై వివాహిత, యువకుడు కలిసి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని దుర్గానగర్‌కు చెందిన ఆర్.ధనలక్ష్మి (22), జి.దుర్గాప్రసాద్(19)లు గురువారం ఉదయం గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. అయితే ధనలక్ష్మి, దుర్గాప్రసాద్‌లు గత కొన్ని రోజులుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. సంబంధం వల్ల భార్యభర్తల మధ్య తరుచు గొడవలు జరుగుతున్నాయి. దీంతో గత మూడు రోజుల క్రితం భర్తను వదిలి తన పుట్టిల్లు వెంకటాద్రిపాలెంకు వెళ్లింది. బుధవారం ఇద్దరు కలిసి ఊరి నుంచి వెళ్లిపోయి గురువారం ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. వివాహిత మహిళ ధనలక్ష్మి కనపడడం లేదని భర్త రవికాంత్ మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు చేసిన మరుసటి రోజే భార్య ఆత్మహత్య చేసుకోవడంతో బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతిచెందడంతో ఆయా కుటుంబసభ్యులతో ఆసుపత్రిలో రోదనలు మిన్నంటాయి. మృతురాలికి భార్గవ్ (4), భవాని(3) పిల్లలు ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి: ఎడిఎ శ్రీలక్ష్మి




**ప్రజాపక్షం / కొండమల్లేపల్లి:** ప్రభుత్వ గుర్తింపు పొందిన నాణ్యమైన విత్తనాలనే రైతులకు విక్రయించాలని దేవరకొండ ఏడిఏ ఆర్. శ్రీలక్ష్మి గురువారం మండల పరిధిలోని కొల్ముంతల్‌పహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు వేదికలో కొండమల్లేపల్లి, పిఏపల్లి మండలాల విత్తన విక్రయ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు విత్తనాలను విక్రయించినప్పుడు ఆధార్ కార్డు ద్వారా విక్రయించాలని అన్నారు. విత్తనాలు రైతులకు అమ్మినప్పుడు తప్పనిసరిగా రషీదు ఇవ్వడంతో పాటు ఆ రషీదులో విత్తనాల కంపెనీ పేరు, ఎంఆర్‌పి రేటును రాయాలన్నారు. ఎంఆర్‌పి కంటే ఎక్కువ రేటుకు విత్తనాలను అమ్మకూడదని డీలర్లకు సూచించారు. అన్ని గ్రామాలలో రైతులకు విత్తనాల కొనుగోలు ఇతర అంశాలపై త్వరలో అవగాహన కల్పిస్తామని అన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సరిపడే విధంగా స్టాక్ చేసుకోవాలని విత్తన డీలర్లకు సూచించారు. నకిలీ విత్తనాలు ఎవరైన అమ్మినట్లయితే రైతులు, పౌరులు ఎవరైన వ్యవసాయ అధికారులకు సమాచారం ఇచ్చినట్లయితే పోలీసుల సహకారంతో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ అవగాహన సమావేశంలో కొండమల్లేపల్లి, పిఏపల్లి మండల వ్యవసాయ అధికారులు ఎస్. వెంకన్న, ఆర్. పాండు, ఏఈవో సర్దార్, విత్తన డీలర్లు ఆకు వెంకటేశ్వర్లు, వీరగంధం ఆంజనేయులు, నీల విజయ్‌కుమార్, విఠల్, అంజిరెడ్డి, కండె పరమేష్, తేరటిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బ తీసే కుట్రలో కాంగ్రెస్ : ఉప్ప కృష్ణ



**ప్రజాపక్షం / చౌటుప్పల్ :** తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బ తీసే కుట్ర భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాజ చిహ్నాన్ని మార్పు చేస్తున్నారని బిఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ఉప్పు కృష్ణ ఆరోపించారు. చౌటుప్పల్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర చిహ్నం మార్చలనే పనికిరాని ఆలోచన అన్నారు. తొలిదశ పోరాటం నుండి మలిదశ పోరాటం వరకు జరిగిన పోరాటంలో పాత్ర లేని రేవంత్ రెడ్డి తెలంగాణ లోగోను ఆంధ్ర నాయకులు సలహాతోనే మార్చడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఉద్యమ కాలంలో వేలాది మంది ఉసురు పోసుకున్న కాంగ్రెస్ రాష్ట్రంలోకి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పాలన కోనసాగిస్తుందని తెలిపారు. అధికారంలోకి రావాడానికి ఇచ్చిన హామిలను అమలు చేయకుండా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాలతో ఆటలాడుకోవడం సిగ్గు చేటని అన్నారు. పదేళ్ళ నుండి ఉన్న రాష్ట్ర లోగోలో ఉన్న తప్పేంటో ప్రజలకు వివరించాలని అన్నారు. లోగోను ఆనాటి ప్రభుత్వం ఉద్యమకారులతో, ప్రజల ఆక్షాంక్షలకు అనుగుణంగా, తెలంగాణ సంస్కృతి ప్రతిబించేలా రూపొందించడం జరిగిందని చెప్పారు. అందులో ఏమైనా మార్పులు చేయాలనుకుంటే ఉద్యమకారులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి తప్ప ఇష్టరాజ్యంగా మార్పులు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు. తెలంగాణ అస్థిత్వాన్ని, సంస్కృతిని దెబ్బతీసేలా వ్యవహరిస్తే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేయాలి : కలెక్టర్



**ప్రజాపక్షం / గద్వాల :** రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ విత్తన ఉత్పత్తి దారులకు ఆదేశించారు. గురువారం ఆయన ఐడిఓసి కాన్ఫరెన్స్ హాలులో విత్తన ఉత్పత్తి దారులతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మేలు జరిగేలా మంచి విత్తనాలు ఉత్పత్తి చేసి మంచి రకం విత్తనాలు అందించాలని అన్నారు.జిల్లాలో పంటలకు వాతావరణం అనుకూలంగా ఉన్నందునా రైతులకు అవగాహణ కల్పించి నాసిరకం విత్తనాలు ఇవ్వకుండ మంచి విత్తనాలు అందించాలని అన్నారు. ఎస్ ఓ పి ఉల్లంగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.రైతులు నష్టపోకుండా జిల్లా యంత్రాంగం కంపెనీలకు పూర్తి సహకారం అందించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సంచాలకులు వెంకటలక్ష్మి విత్తన ఉత్పత్తిదారులు తదితరులు పాల్గొన్నారు. జూన్ 2 న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిడారంబరంగా నిర్వహించాలని కలెక్టర్ బి.ఎం.సంతోష్ అన్నారు. ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లు వివిధ శాఖల జిల్లా అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిడారంబరంగా నిర్వహించాలి అందులో ప్రజా ప్రతినిధుల ప్రసంగాలు లేకుండా చూడాలన్నారు. జిల్లాలోని అన్నీ కార్యాలయాల్లో 8.30కి పతాక ఆవిష్కరణ నిర్వహించుకోవాలి జిల్లా అధికారులు 9.30 కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

# విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా

### రవాణాపై మైనింగ్ అధికారుల దాడులు ! 11 ట్రాక్టర్లు పట్టివేత అనుమతులు లేకున్నా అడ్డగోలుగా రవాణా..



**ప్రజాపక్షం / హాలియా:** బహిరంగంగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నా పట్టించుకోవలసిన అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తుండడంతో ఇసుకాసురులకు కాసుల పంట పండింది. నెల రోజులుగా ఆన్లైన్ ఇసుక రవాణాను మైనింగ్ అధికారులు రద్దు చేసినప్పటికీ అక్రమ ఇసుక రవాణా మాత్రం ఎక్కడా ఆగట్లేదు. ఈ అక్రమ ఇసుక రవాణాలో అధికారులు, కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు కలిసి ఈ అక్రమ తతంగాన్ని విచ్చలవిడిగా కొనసాగిస్తూ సామాన్యులకు ఇసుక అందని ద్రాక్షగానే మారేలా చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు ఆన్లైన్ విధానాన్ని తీసుకువచ్చారు. దీంతో ఒక వినియోగదారుడు తనకు ఎన్ని ట్రిప్పులు ఇసుక కావాలన్నా ఆన్లైన్లో అప్లై చేసి బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధానంలో అక్రమ ఇసుక తరలింపుకు కొంత అడ్డుకట్ట పడిందనే చెప్పాలి. గత ప్రభుత్వంలో కొందరు పోలీసు అధికారులు, రెవిన్యూ అధికారులు అధికార పార్టీ నాయకుల మాట కాదనలేక అక్రమ ఇసుక తరలింపును ఆపలేకపోయారు. మరి విచిత్రం ఏంటంటే ఇసుక వ్యాపారాన్ని నమ్ముకున్న కొందరు మాఫియాగా ఏర్పడి అప్పటి ప్రభుత్వానికి అండగా ఉంటూ అక్రమ ఇసుకను నిరాటంకంగా నడిపించారు. ఎన్నికలయ్యా క ప్రభుత్వ మారాక కూడా ఈ మాఫియా వీరులు పా ర్టీ కండువాలు మార్చి తమ వ్యాపారాన్ని యధావిధిగా కొనసాగిస్తున్నారనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అయితే గత నెల రోజుల నుంచి ఆన్లైన్ ఇసుక బుకింగ్ మైనింగ్ అధికారులు నిలిపివేశారు. అయినప్పటికీ అక్రమ ఇసుక వ్యాపారం చేస్తున్న వారు ఇవేవీ పట్టించుకోకుండా రోజంతా ఈ అక్రమ ఇసుక రవాణా చేస్తున్నప్పటికీ అధికారులు మిన్నకుండి పోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక నడుపుతున్న తీరును కొందరు యువకులు జిల్లా మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై స్పం దించిన మైనింగ్ అధికారులు బు ధవారం సాయంత్రం అనుముల మండలంలోని ఇసుక రీచులలో అక్రమంగా ఇసుక నడుపుతున్న వాహనాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 11 ట్రాక్టర్లను సీజ్ చేసి హాలియా పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ దాడులు జిల్లా మైనింగ్ ఏడి జాకబ్ ఆధ్వర్యంలో నిర్వహించడం గమనార్హం. ఇదే విషయమై జిల్లా మైనింగ్ ఏడి జాకబ్ ను వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ ఇసుక ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని గత నెల రోజుల క్రితమే నిలుపు చేసినట్లు చెప్పారు. అయినప్పటికీ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న ఫిర్యాదులు రావడంతో బుధవారం సాయంత్రం ఇసుక రీచులలో ఇసుక తరలిస్తున్న 11 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు చెప్పారు. ఒక్కొక్క ట్రాక్టర్ కు రూ.25 వేలు డిపాజిట్ చేసిన తర్వాతనే ట్రాక్టర్లను విడుదల చేస్తామని చెప్పారు. ఇకపై అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాక్టర్ల ను పూర్తిగా సీజ్ చేసి మరింత జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

## విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

### జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు



**ప్రజాపక్షం / సూర్యాపేట:** నకిలీ విత్తనాలు అమ్మిన, విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం సూర్యాపేట పట్టణంలోని సూర్య ఆగ్రో ట్రేడర్స్, రాఘవేంద్ర ఆగ్రో ట్రేడర్స్ లను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డు, విత్తనాల నిల్వను పరిశీలించి డీలర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు సరిపోయే విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని, విత్తనాలు విక్రయించేటప్పుడు రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలన్నారు. విత్తనాల అమ్మకాలకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా వ్రాయాలని, రోజువారి రైతులకు విక్రయించే వివరాలు ప్రత్యేక రిజిస్టర్లు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని వ్యవసాయ అధికారులతో, సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులతో విత్తనాల సరఫరాపై సమీక్షించారు.జిల్లా వ్యాప్తంగా మండలాలలో 23 క్రమశిక్షణ బృందాలతో పాటు మూడు టాస్క్‌ఫోర్స్ టీములను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ టీములో ఆర్డిఓ, డిఎస్పి, అగ్రికల్చరల్ అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారులు ఉంటారని పేర్కొన్నారు. జిల్లా, మండలాలలో మొత్తం 26 టీములు నిరంతరం పర్యవేక్షిస్తారని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ టాస్క్ ఫోర్స్ టీంను మండల ప్రత్యేక అధికారి ఆధీనంలో పని చేస్తాయన్నారు. మండల క్రమశిక్ష ణ బృందంలో మండల వ్యవసాయ అధికారి, ఎస్ఐ, తాహసీల్దార్ సభ్యులుగా ఉంటారని చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వివిధ విత్తన దుకాణాల్లో విత్తనాలు సరఫరా అయ్యే వివిధ మార్గాలపై ప్రత్యేక నిఘా ఉంచి కల్తీ విత్తనాలు సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి జి శ్రీధర్ రెడ్డి, ఎస్ఐ లోకేష్, సహాయ వ్యవసాయ సంచాలకులు రాజగోపాల్, మండల వ్యవసాయ అధికారి దినకర్, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సిహెచ్ ప్రియాంక




**ప్రజాపక్షం / సూర్యాపేట కలెక్టరేట్:** తాగునీటి సరఫరకు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సిహెచ్ ప్రియాంక అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో మిషన్ భగీరథ అధికారులు, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కోదాడ పట్టణానికి అమృత్ 2ఓ పథకంలో భాగంగా గతంలో 25.8 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. భవిష్యత్ తరాలకు త్రాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రణాళిక సిద్ధం చేయాలని, పనులు జరిగేటప్పుడు ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులు త్రాగునీటి సరఫరా కోరకు పట్టణ ప్రాంతంలో సరఫరా ఆగుటకు పబ్లిక్ హెల్త్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంగా పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వివి అప్పారావు, కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి, మిషన్ భగీరథ ఎస్సీ వెంకటేశ్వర్లు, డి శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ అధికారి వెంకటేశ్వర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆసుపత్రి కార్మికులకు పెండింగ్ వేతనాలు అందించాలి

### ఎఐటియుసి డివిజన్ కార్యదర్శి ఎండి.సయ్యద్



**ప్రజాపక్షం / మిర్యాలగూడ:** పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, సెక్యూరిటి గార్డ్స్, పేషెంట్‌కేర్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి డివిజన్ కార్యదర్శి ఎండి.సయ్యద్ అన్నారు. గురువారం ఆయన కార్మికులతో కలిసి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు అందించి మాట్లాడారు. జీఓ నెం.60 ప్రకారం కనీస వేతనాలు అందించాల్సి ఉన్నప్పటికీ ఇవ్వకపోగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను కూడా అందించడం లేదన్నారు. దీంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ వేతనాలను విడుదల చేసి జీవో నెం.60 ప్రకారం నెలకు రూ.15094 వేతనంతోపాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటి సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.24వేలు చెల్లించాలని, పండుగ, జాతీయ, ఆర్థిక సెలవులు అమలు చేయాలని, పది సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మికులందరికి భీమా కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ క్లియరెన్స్ చూపించాలని కోరారు. లేనియెడల సమ్మెకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు సైదులు, అంజిబాబు, కొండల్, హుద్దూస్, నాగరాజు, శ్యామల, శాంతమ్మ, పర్వీన్, కళమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## స్లాట్ బుక్ అయినా రిజిస్ట్రేషన్ చేయట్లే

### తహసీల్దార్‌పై రైతుల ఆగ్రహం



**ప్రజాపక్షం/అనంతగిరి:** పంట పొలాలపై స్లాట్ బుక్ అయిన కూడా రిజిస్ట్రేషన్ చేయుట కొరకు మూడు రోజుల నుండి ఐదు రోజుల వరకు తిప్పించుకుంటున్న మండల తహసీల్దార్‌పై శాంతినగర్ గ్రామానికి చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంట పొలాలపై స్లాట్‌బుక్ అయినప్పటికి దానికి సంబంధించిన ఆధారాలు ఉండాలని తహసీల్దార్ పేద రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ కొరకు తీసుకవెళ్తున్న స్లాట్ ఫైల్స్‌ను విసిరివేయడం దాని వెనుకాల అంతర్యయం తెలుసుకోగా డబ్బులు అడుగుతున్నారనే విషయం అర్థమైందని తెలిపాడు. పేద రైతులం ఒక పూట తిండికే లేని వాళ్లం అలాంటిది వేలల్లో డబ్బులు ఇవ్వాలంటే కష్టమని తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు గత మూడు రోజుల నుండి ఐదు రోజులు తిప్పించుకుని చివరకు అన్ని జిరాక్స్‌లు ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తానని తహసీల్దార్ అంటున్నారని రైతులు ఆర్డీవోను సంప్రదించారు. ఆర్డీవో తహసీల్దార్‌కు ఫోన్ చేయగా బాధిత రైతుకు ఫోన్ ఇవ్వండి అని ఆర్డీవోకు చెప్పగా బాధిత రైతులకు తహసీల్దార్ ఆర్డీవోకు కాదు కలెక్టర్, సిఎం కాడికి వెళ్లిన పనిజరగదు అంటూ రైతులతో దురుసుగా మాట్లాడారని ఆర్డీవోకు విన్నవించుకున్నారు. రైతులు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగినంతరం రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని రైతులు తెలిపారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల విద్యావ్యాపారాన్ని అరికట్టాలి

### ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు



**ప్రజాపక్షం/జమ్మికుంట:** తెలంగానలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్య వ్యాపారం చేస్తూ ఫీజుల పేరుతో లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారని, సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీ అరికట్టే విధంగా చర్యలు తీసుకుని ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, ఎన్నికల హామీలో విధ్యార్థులకు ఇచ్చిన హామీలను విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు అన్నారు. జమ్మికుంట పట్టణ కేంద్రంలో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థలను ఆయా మండలాల విద్యా శాఖ అధికారులు తనికీలు చేసి ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పర్మిషన్ లేకుండా నడుస్తున్న ప్రైవేట్ కార్పోరేట్ విద్యాసంస్థలను గుర్తించి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీ అరికట్టే విధంగా ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజుల దోపిడీని అరికట్టాలని, నిబంధనలు పాటించని విద్యాసంస్థలను సీజ్ చేయాలని, లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారుల కార్యాలయాలు ముట్టడిస్తామని లద్దునూరి విష్ణు డిమాండ్ చేశారు.

# అధర్మ వైద్యం

## చదివింది పది.. సేవలు బారెడు

### తెలంగాణ వైద్య మండలి సభ్యుల ఆకస్మిక తనిఖీలో బయటపడ్డ శంకర్ దాదా ఎంబిబిఎస్ భాగోతం





**ప్రజాపక్షం / సూర్యాపేట ప్రతినిధి:** అతడిని చూడగానే పేరుకు తగ్గట్లు ధర్మాత్ముడిగా కనిపిస్తాడు. చదివింది మాత్రం పదవ తరగతే.. అయినా ఆయనగారు చేసే సేవలు మాత్రం ఎంబిబిఎస్, ఎండి స్థాయిలో ఉంటాయి. గత 30 సంవత్సరాలుగా అమాయక ప్రజలను తన మాయమాటలతో నమ్మిస్తూ వైద్య సేవలు చేస్తూ కోట్లకు పడగెత్తాడు. నిత్యం రద్దీగా ఉండే సూర్యాపేట జిల్లా కేంద్రం నడిబొడ్డున కొత్తబస్టాండ్ సమీపంలో ఇతగాడు వాసవ్య వైద్యశాల పేరుతో వైద్యం చేస్తున్నాడు. ఇదంతా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు తెలిసినా అటువైపు ఏ నాడు కన్నెత్తి చూడలేదు. కాని చివరకు తెలంగాణ వైద్య మండలి సభ్యుల ఆకస్మిక తనిఖీలో ఈ శంకర్ దాదా ఎంబిబిఎస్ భాగోతం రెండు రోజుల క్రితం బయటపడింది. వివరాల్లోకి వెళ్తే... ప్రజారోగ్య పరిరక్షణ, నకిలీ వైద్య వ్యవస్థ ద్వారా వైద్య పరంగా ఏలాంటి విద్య అర్హత లేకున్న ప్రజల అవసరాలను అవకాశంగా చేసుకోని నిలువు దోపిడికి పాల్పడుతున్నా వైద్యుల ఆగడాలను అరికట్టేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య మండలి సభ్యులను రంగంలో దింపింది. ఈ మండలి సభ్యులు గత కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేస్తూ వారి గుట్టును రట్టు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఈనెల 29న తెలంగాణ వైద్య మండలి సభ్యులు డాక్టర్ శేషు మాధవ్, డాక్టర్ నరేష్ కుమార్‌లు తమ సిబ్బందితో సూర్యాపేట జిల్లా కేంద్రంలో పలు ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట వారు పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలోని కుడకుడ రోడ్డులో గల వాసవ్య వైద్యశాలను తనిఖీ చేశారు. అక్కడ నిర్వహించిన తనిఖీల్లో వైద్యులు నివ్వెరబోయే విషయాలు బయటపడ్డాయి. వైద్యశాలను నడుపుతున్న ఆర్ఎంపి వైద్యులు ధర్మయ్య మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు వ్యతిరేకంగా వైద్య శాలను నడుపుతున్నట్లు గుర్తించారు. చదివింది పదవ తరగతి అయినా ఎంబిబిఎస్, ఎండి వైద్యులు చేసే వైద్య సేవలు రోగులకు అందించడం కళ్ళ ముందే కనిపించింది. అర్హులైన వైద్యులు సూచించే రోగులకు అందించే ఆంటిబయోటిక్, స్టెరాయిడ్ ఇంజక్షన్ వినియోగిస్తున్నట్లు తెలింది. వీటన్నింటిని వారు స్వాధీనం చేసుకున్నారు. అనాధికారికంగా వైద్యశాలలో రోగులకు బెడ్లను ఏర్పాటు చేశారు. ఇతగాడు పక్కనే తన కుమార్తెతో మెడికల్ దుకాణాన్ని కూడా తెరపించాడు. అక్కడ కూడా వారు వెళ్లి పరిశీలించారు. ఆమెకు ఉన్న అర్హతలు, అమ్ముతున్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వైద్యులు రెఫర్ చేసిన మందులను ఆర్ఎంపి వైద్యుడైన తన తండ్రికి ఏలా అందిస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం అన్ని వివరాలను రికార్డులో నమోదు చేసుకోని వెళ్లారు. అలాగే పట్టణంలోని చర్చికం పౌండ్, విద్యానగర్, తులశమ్మ హోటల్ ప్రాంతాల్లో ఉన్న పలు ఆర్ఎంపి, పిఎంపిల వైద్యశాలలను తనిఖీలు చేశారు. అక్కడ కూడా ధర్మయ్య చేసే అధర్మ వైద్యమే రోగులకు అందజేస్తున్నారు. మరి కొంత మంది వైద్యులు లేకుండానే బోర్డులు పెట్టుకోని వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్యశాలలో ఆపరేషన్లు, గర్భవిచ్చితి చేస్తున్నట్లుగా గుర్తించారు.

**ప్రజల ఆరోగ్యంతో చలగాటం ఆడితే చర్యలు తప్పవు: తెలంగాణ వైద్య మండలి సభ్యులు**

అర్హత లేకున్న ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రజల ఆరోగ్యంతో చలగాటం ఆడితే చర్యలు తప్పవని తెలంగాణ వైద్య మండలి సభ్యులు డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ నరేష్ కుమార్‌లు హెచ్చరించారు. తనిఖీల అనంతరం వారు అర్హత లేకుండా వైద్యం చేస్తున్న వైద్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు మెడికల్ క్లినిక్‌లుగా మార్చి అమాయక ప్రజలను దోచుకోవడం సరైంది కాదని చెప్పారు. మోతాదుకు మించిన ఆంటిబయాటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తున్నట్లు తమ తనిఖీల్లో వెల్లడైందని మీడియాకు వివరించారు. ఇది ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కిడ్నీకి సంబంధించిన వ్యాధులు వస్తాయని చెప్పారు. క్లినిక్‌లు నిర్వహించే వారిపై 34,54 ఎన్ఎంసీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు రూ. 1లక్ష నుండి 5లక్షల జరిమానా, సంవత్సరం పాటు జైలు శిక్ష విధించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలో, ఎంబిబిఎస్, ఎండి, ఎంఎస్ చదివిన వైద్యుల వద్ద మాత్రమే చికిత్స చేసుకోవాలన్నారు.

## 5లోగా పనులు పూర్తికి ఆదేశం



**ప్రజాపక్షం/కమలాపూర్:** అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ఆయా గ్రామాలలో నిర్మిస్తున్న అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు సకాలంలో పూర్తి చేయాలని మండల అభివృద్ధి అధికారి గుండె బాబు సూచించారు. గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు మండలంలోని గోపాల్‌పూర్ గ్రామపంచాయతీ పరిధీలో గల అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగానడుస్తున్న పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు నిర్వహిస్తున్న వివో లకు సూచనలు, సలహాలు అందజేశారు. త్వరితగతిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులన్ని పూర్తి చేయాలని, అదే విధంగా ప్రతి పాఠశాలలోను పంచాయతీ కార్యదర్శులు, వివోల సహకారంతో పాఠశాల భవనంపై పడుతున్న వర్షపు నీటిని ఇంకించే ప్రక్రియ లో భాగంగా ప్రతి పాఠశాలలో ఉపాధీ హామీ నిధుల కింద రెయిన్ వాటర్ హార్వేస్టింగ్ స్ట్రక్చర్‌ను నిర్మించాల్సిందిగా సూచించారు. ఈ పనులన్నింటిని జూన్ 5 లోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధునాతన హంగులతో సైబర్ ల్యాబ్



**ప్రజాపక్షం / సంగారెడ్డి ప్రతినిధిః** ఆధునాతన హంగులతో కార్పోరేట్ కార్యాలయాన్ని తలపించే విధంగా నూతన సైబర్ ల్యాబ్ (జిల్లా సైబర్ క్రైమ్) కో ఆర్డినేషన్ సెంటర్‌ను జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఐటి సైబర్ సెల్ లను కలుపుతూ అన్ని విభాగాలు ఒకే దగ్గర విధులు నిర్వహించే విధంగా పూర్వం ఉన్నటువంటి ఐ.టి సెల్ ఆధునికరించ అన్ని రకాల సదుపాయాలతో కార్పోరేట్ కార్యాలయాన్ని తలపించే విధంగా నూతన సైబర్ ల్యాబ్‌ను ప్రారంబించుకోవడవము జరిగిందని జిల్లా ఎస్పీ వివరించారు. సిబ్బంది అందరు సమన్వయంతో పని చేసే జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సైబర్ ల్యాబ్ నందు అనుభవజ్ఞులైన శిక్షణ పొందిన సిబ్బంది ఉంటారని వీరు జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ లలో తలెత్తిన సమస్యలను నివృతి చేయడంతో పాటు టెక్నికల్ సపోర్ట్ అందించడం జరుగుతుందన్నారు. అదనపు ఎస్పీ సంజీవరావు, అడ్మినిస్ట్రేషన్ అధికారి ఇ కళ్యాణ డిఎస్పీ లు సత్తయ్యగౌడ్, రవీందర్ రెడ్డి, రామ్ మోహన్ రెడ్డి వెంకట్ రెడ్డి , D4C డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ మల్లేశ్, విజయ్ క్రిష్ణ, ఐటిసెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాలకుర్తి విద్యార్థికి ఉపకారవేతనం

**ప్రజాపక్షం/పాలకుర్తి:** పాలకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని దేశబోయిన మానస నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ (ఎన్ఎంఎంఎస్) 2024కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శోభారాణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థికి 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్ల పాటు 12వేల చొప్పున ఉపకారవేతనం అందుతాయన్నారు. ఈ సందర్భంగా మానసను ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

## ఆర్థిక చేయూత

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండల కేంద్రా నికి చెందిన 2004/05 పదవ తరగతి బ్యాచ్ స్నేహితురాలు మారోజు శ్వేత తండ్రి ఆరు సంవత్సరాల క్రితం చని పోగా, ఒక నెల క్రితం శ్వేత భర్త గుండెపోటుతో మృతి చెందడంతో ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోవడంతో గురువారం తనతో చదువుకున్న తన తోటి స్నేహితులు కుటుంబాన్ని ఆదుకోవడానికి, ఆర్థిక చేయూతను అందించేందుకు రూ.40వేలు శ్వేత కూతురిపై పోస్ట్ ఆఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పాస్ పుస్తకాన్ని శ్వేతకు అందించారు. రాపాక అనిల్‌కుమార్, గాదెపాక కిరణ్‌కుమార్, ఆంజనేయులు, వడ్లకొండ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## శిశు మరణాలు జరగనీయొద్దు

**ప్రజాపక్షం/ములుగుప్రతినిధిః** ములుగు జిల్లాలో మాతా శిశు మరణాలు జరగకుండా చూడాలని ములుగు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లం అప్పయ్య అన్నారు. ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఆసుపత్రిలో ప్రతి మంగళ, గురువారాలలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమం వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు కొత్తగా జనవరి 2024 నుండి నూతనంగా నిర్వహిస్తున్న బాలింతల ఆరోగ్య సంరక్షణ, శిశు, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా మాతా శిశు మరణాలు రేటును తగ్గించాలనిఆదేశించినట్లు తెలిపారు.

## ఆధీకృత డీలర్ల వద్దే కొనాలి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః** వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన డీలర్ల దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలని, జిల్లాలో నకిలీ విత్తనాల నియంత్రణకు జిల్లా స్థాయి లో 2 టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయశాఖ గుర్తింపు పొందిన డీలర్ల దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలని, విడిగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయరాదని, సంబంధిత కంపెనీ లేబుల్ ఉన్న ప్యాకెట్లను కొనాలని తెలిపారు. కొనుగోలు చేసిన విత్తనాల ఖాళీ ప్యాకెట్లను, బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకుంటే ఒక వేళ నకిలీ విత్తనాల కారణంగా దిగుబడి రానప్పుడు సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

**వదంతులు నమ్మవద్దు**

కొంతమంది విత్తన కంపెనీలు, వ్యాపారం నిమిత్తం తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. ఏ రకమైన పత్తి విత్తనాలైన దిగుబడి ఒకే రంగా ఉంటుంది. సాగు పద్ధతులు భూమి లోపల ఉన్న బలం ఆధారంగా పంట దిగుబడి ఆధారపడి ఉంటుంది. రకాలను బట్టి కాదు, అన్ని రకాల పత్తి విత్తనాలు మంచివే. విత్తనాలు కొన్న వెంటనే ఇంటి లోపల భద్రపరుచుకోవాలి.

**ఎండవేడిమి పెట్టరాదు**

నకిలీ విత్తనాల నియంత్రణ కోసం సహాయ వ్యవసాయ సంచాలకులు ములుగు, ఏటూరునాగారం, విత్తన ధృవీకరణ అధికారి పోలీస్ అధికారులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని, వీరు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని, రైతులు ఎవరైనా బిజి 3, హెచ్‌టి పత్తి విత్తనాలు రాత్రి వేళల్లో గ్రామాల్లో తిరిగి అమ్మే విత్తనాలు గురించి సమాచారం తెలిస్తే టాస్క్‌ఫోర్స్ అధికారులు ములుగు సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీపాల్ 7288894761, ఏటూరునాగారం సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీధర్ 7288894766, ఫోన్ నంబర్‌లకు సమాచారం అందించాలని అధికారులకు సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడును. వ్యవసాయశాఖ, టాస్క్‌ఫోర్స్ యంత్రాంగం సహాయంతో వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నకిలీ విత్తనాలు అరికట్టడంలో ఎవరైనా తమకు తెలిపిన సమాచారం ఉంటే అందించి రైతు సంక్షేమానికి తోడ్పడగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పిల్లల చేరికకు కదలండి

**3 నుండి 19 వరకు బడిబాటను విజయవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ మనుచౌదరి**



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** జూన్ 3 నుండి 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించి బడి ఈడు పిల్లలకు ప్రభుత్వం పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో మినీ సమావేశమందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి బడిబాట కార్యక్రమంపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బడీ ఈడు పిల్లలందరు తప్పనిసరిగా బడిలో ఉండాల్సిందేనన్నారు. జూన్ 3 నుండి 19వ తేదీవరకు గ్రామాలు, మున్సిపాల్టీలు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు మాత్రమే కాకుండ అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు ఇంటింటికి వెళ్లి డ్రాప్‌అవుట్ విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి బడుల్లో చేర్పించాలన్నారు. అదే విధంగా ఏంతో కష్టపడి వేలాది రూపాయలు ఫీజులు చెల్లించి ప్రైవేటు,కార్పొరేట్ స్కూళ్లలో తమ పిల్లలను చదివించే తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు, ఉచిత విద్య, కాంపిటీషన్ పరీక్షల్లో ఉన్నతగా నిలిచి ఉద్యోగాలుపొందిన ఉపాధ్యాయులు చదువు చెపుతారన్నారు. అన్ని వసతులు ఉన్న పాఠశాలకు విద్యార్థులను పంపించాలని అవగాహన కల్పించాలన్నారు. మూతపడిన పాఠశాలలకు విద్యార్తులు మళ్లీ వచ్చేలా తల్లిదండ్రులను మోటివేషన్ చేయాలని సూచించారు. విద్యార్థులను బడులో చేర్పించటంలోపూర్వ విద్యార్థుల భాగస్వామ్యాన్ని కల్పించాలన్నారు. మహిళ స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీలు, టీచర్లు, ఆశాకార్యకర్తలు , గ్రామపెద్దలు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను భాగస్వామ్యం చేయాలన్నారు. అసలు పాఠశాలలకు వెళ్లని విద్యార్థులకు ప్రధానంగా ఫోకస్ పెట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, తదితర వసతి గృహాలు ఉచిత బోజన వసతి పొంది,చదువుకునే విధానంపై బడిబాటలో వివరించాలన్నారు.

**కలెక్టర్‌ను కలసిన మున్సిపల్ కౌన్సిలర్లు**

సిద్దిపేట పట్టణంలో కోకోకార్పస్ చెట్ల వల్ల ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలు, విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులనుమున్సిపల్‌కౌన్సిలర్లు రియాజ్, సాకి ఆనంద్, బుచ్చిరెడ్డిలు కలెక్టర్ మనుచౌదరికి కలసి విన్నవించారు. రోడ్లపై చెట్లనుపెంచటం వల్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ డ్యామెజి అవుతుందన్నారు. స్పందించిన కలెక్టర్ ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కవిత, బిసి అభివృద్ధి అధికారి సరోజ, డిఆర్‌డిఓ జయదేవ్, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, డిఎంహెచ్ఓ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టు వద్ద తనిఖీలు



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద గురువారం సాయంత్రం కాళేశ్వరం ఎస్ఐ భవానీ సేన్ ఆధ్వర్యంలో విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ మహారాష్ట్ర ప్రాంతాల నుండి రాకపోకలు కొనసాగిస్తున్న వాహనాలకు చెందిన ధృవపత్రాలు పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులను విచారించి వదిలివేశారు. వాహనాల పత్రాలను తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సివిల్,సీఆర్పీఎఫ్‌పోలీసులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా విత్తనాల దుకాణాల్లో తనిఖీలు

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



**ప్రజాపక్షం/పరకాల :** మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వెంటనే పూర్తి చేయాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు.గురువారం పరకాల మండలంలోని కామారెడ్డి పల్లి ప్రాథమిక ఉన్నత అమ్మ ఆదర్శ పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేసి పనులు జరుగుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పరకాల ఉర్దూ మీడియం పాఠశాలలో పనులు అసంపూర్తిగా ఉన్నవాటిని వెంటనే పూర్తి చేసి పంపిస్తే బిల్లులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పాఠశాలలు ప్రారంభం అయ్యేలోగా పూర్తి చేసి పంపాలని సూచించారు.పనులు పూర్తి అయిన పాఠశాలలకు ఫేయింటింగ్ చేసిన తరువాత ఫర్నీచర్ తదితర సామాగ్రి అందజేస్తామని తెలిపారు.అనంతరం పరకాలలోని ఎరువులు,విత్తనల దుకాణాలలో రిజిష్టర్‌లు పరిశీలించి తనిఖీల నిర్వహించారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారుమండల వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు షాపులలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట ఈ కార్యక్రమాలలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ వెంకటనారాయణ, రెవెన్యూ డివిజనల్ అధికారి డాక్టర్ కె.నారాయణ, ఎంపిడిఓ పెద్ది ఆంజనేయులు, తహశీల్దార్ ఏవి భాస్కర్, మునిసిపల్ కమిషనర్ నర్సింహా,మండల విద్యాశాఖాధికారి రమాదేవి,ఐకేపి ఏపిఎం క్రాంతి, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వివోలు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సకాలంలో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు

**కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్**



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ఆదేశించారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని జెకెఎస్ విత్తనాలు, ఎరువుల షాపును తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి క్రయ విక్రయాలు రిజిస్టర్ల వారిగా చూశారు. విక్రయ వివరాలు నమోదు చేస్తూ ఏ రైతుకు విక్రయిస్తున్నారో వారి పేరు చిరునామ సెల్ నెంబర్ల వివరాలు నమోదు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు అకస్మిక తనిఖీలు చేపట్టాలని, విత్తనాల, ఎరువుల విక్రయాల సందర్భంగా రైతులు మోసపోకుండా చూడాలన్నారు. పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులతో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. విత్తన లైసెన్స్ కలిగిన దుఖానాల్లో లభించే అన్ని రకాల విత్తనాలు ఒకేరకమైన దిగుబడి ఇస్తాయని, ఒకే రకమైన పత్తి విత్తనాలపై మొగ్గు చూపరాదన్నారు. ప్రభుత్వం రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు సకాలంలో అందింస్తుందని, రైతులు కూడా సహకరించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్‌తో పాటు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపులో పొరపాటు చేస్తే వేటే

**జయశంకర్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** జూన్ 4న జరగనున్న పార్లమెంటు ఓట్ల లెక్కింపులు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా నిక్కచ్చిగా చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవిష్ మిశ్రా తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వకు కౌంటింగ్ ప్రక్రియ పైనిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 317 పోలింగ్ కేంద్రాల వారిగా ఓట్లు లెక్కింపు చేసేందుకు 18 రౌండ్లు ఉంటాయని, ఇందుకొరకు 18 ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి టేపతి పర్యవేక్షణకు ఒక మైక్రో అబ్జర్వ్ ను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. విధులు కేటాయించిన సిబ్బంది 4వ తేదీన ఉదయం 6 గంటలకు వరంగల్ లోని కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. విధులు కేటాయించిన సిబ్బందికి ఎలాంటి మినహాయింపు లేదని తప్పనిసరిగా విధులకు హాజరుకావాలని, హాజరుకాని పక్షంలో ఎన్నికల సంఘం నియమ నిబంధనలు మేరకు విధుల నుండి తొలగించడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. కంట్రోల్ యూనిట్ 17 సి ప్రకారం నమోదు జరిగిందా లేదా అన్నది జాగ్రత్తగా నమోదు చేయాలని ఆయన సూచించారు. వరంగల్ నియోజకవర్గంలో 42 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని నోటా తో కలిపి మొత్తం 43కాలాలను జాగ్రత్తగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించాలని పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియ అనేది చాలా ప్రతిష్టాత్మకమైనదని ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని, ఏదేని వ్యత్యాసం వస్తే ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందన్నారు. 5 వివి ప్యాట్స్ లెక్కింపు చేయడం జరుగుతుందని ఆయన సూచించారు.

## కొనుగోలు కేంద్రం మార్చాల్సిందే

**ప్రజాపక్షం/నెక్కొండః** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం రెడ్లవాడలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయడంతో పిల్లలకు డస్ట్ ఎలర్జీ, శ్వాసకోస వ్యాధుల సక్రమించే ప్రమాదం పొంచి ఉన్నదని కొనుగోలు కేంద్రానిన వేరే చోటుకు మార్చాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. వరి, మొక్కజొన్న, రెండు పంటలకు నాలుగు పర్యాయాలు పాఠశాల ఆవరణలోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారని, ఈ సమస్యతో పిల్లలు పాఠశాలకు వెళ్ళ లేకుండా ఉన్నారు. విధి లేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు పదవ తరగతి వరకు చదివించిన పిల్లలు చదువు మానేస్తే ఎలా ఉంటుందో అని ఆందోళనతో అప్పులు చేసి ప్రయివేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. సమస్య పరిష్కారంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అందుకే జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నామని గ్రామానికి చెందిన కిషన్ అన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలే మేలు

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**ప్రజాపక్షం/కౌడిపల్లి :** సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు పాఠశాలలు మరమ్మతులు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం కౌడిపల్లీ మండలం తునికి జెడ్‌పిహెచ్ఎస్ హైస్కూల్‌ను కలెక్టర్ రాహుల్ రాజ్ మండల అధికారులతో కలసి సందర్శించారు. పాఠశాలల్లో జరుగుతున్నమరమ్మతు పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలవస్థలో ఉన్న ప్రభుత్వ బడులు ఆధునికతను సంతరించుకొని, విద్యార్థులకు ఆహ్లాదకరంగా తయారు చేయడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకే అనుకూలంగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. పనులు చేపట్టిన గ్రామ సమాఖ్యలతో మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనులను జూన్ 5వ తేదీ వరకు పూర్తిచేయాలని ఆదేశించారు. ముందస్తుగా 25 శాతం నిధులు మంజూరు చేశామని, చేపట్టిన పనులకు నిధులు సరిపోకుంటే ప్రతిపాదనలు పంపాలని, అదనపు నిధులు మంజూరు చేస్తామన్నారు. పాఠశాలలు పున: ప్రారంభానికి ముందు పూర్తిస్థాయిలో చేపట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని వివో లను ఆదేశించారు. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు పనుల్లో వేగం పెంచి నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చొరవ చూపాలన్నారు. పనుల్లో ఆలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. తాహసిల్దార్ ఆంజనేయులు ఎంఈఓ బుచ్చానాయక్, ఆర్ఐ శ్రీహరి గ్రామస్తులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో నష్ట నివారణపై అవగాహన

**భారీ వర్షాలకు ముందే ప్రజలను అప్రమత్తం చేయాలి**

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**



**ప్రజాపక్షం / సంగారెడ్డి ప్రతినిధిః** రానున్న వర్షాకాలనికి సంబందించి అన్ని ముందు జాగ్రత్త చర్యలు అధికార యంత్రాంగం చేపట్టాలని జిల్లా కలెక్టర్ వల్లూరు అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని రెవెన్యూ పంచాయతీ రాజ్ ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ నీటిపారుదల శాఖ ,అటవీ శాఖ ,వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ శాఖల అధికారులతో రానున్న వర్షాకాలం సీజన్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు పడితే తీసుకోవలసిన జాగ్రత్తలు ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు పడిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో మున్సిపల్ పరిధిలో పాత ఇండ్లు ,భవనాలు, పంచాయతీలో కార్యదర్శులు మున్సిపల్ కమీషనర్‌కు ఇతర అధికారులు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలంలో పాత ఇండ్లలో ప్రజలు ఉండకుండా ముందుగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మున్సిపాలిటీలో డిజాస్టర్ రిస్క్ టీం లను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్ అండ్ బి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల అధికారులు ఆయా శాఖల పరిధిలోని కల్వర్టులు ,బ్రిడ్జిలు రోడ్డులు రోడ్డు డ్రైవర్షన్ లను అధికారులు పరిశీలించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో మలేరియా ,డెంగ్యూ, ఇలాంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా పంచాయతీరాజ్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. హరితహారం రెవెన్యూ ప్లాంటేషన్ ఓపెన్ ప్లాంటేషన్ స్కూళ్లలో ఏర్పాటు చేయాలన్నారు. వివిధ శాఖలకు సంబందించిన హరితహారం టార్గెట్లను పూర్తి చేయాలన్నారు. అటవీ శాఖ టార్గెట్ వివరాలు శాఖల వారీగా తెలియజేయాలన్నారు. పంచాయతీ రాజ్ అధికారులు పంచాయతీ సెక్రెటరీలు,అటవీశాఖ అధికారులు ,నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాదురి,డిఆర్ఓ పద్మజారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

**బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే**

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో చేయాల్సిన ఏర్పాట్ల పై గురువారం కమీషనర్ క్షేత్ర స్థాయిలో కార్యాలయ అవరణలో పర్యటించి పరిశీలన చేసి సమర్థవంతంగా ఏర్పాట్లు చేయడానికి ఆధికారులకు తగు సూచనలు చేశారు.కమిషనర్ ప్రధాన ద్వారం వద్ద గల పోర్టికో వద్దజెండా ఆవిష్కరించు ప్రాంతంతో పాటు గాంధీ విగ్రహం ప్రాంతంలో కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడుతూ, వేడుకలను అట్టహాసంగా నిర్వహించడానికి కార్యాలయ ఆవరణలో అన్ని ఏర్పాట్లు చేయాలని, వేడుకలు నిర్వహించే ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కుర్చీల ఏర్పాటు తో పాటు నీడ ఉండేలా టెంట్ ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించి ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. నగర వ్యాప్తంగా ఉన్న కార్పోరేటర్లందరు ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనే విధం గా ప్రత్యేకంగా ఆహ్వానించాలని ఈ సందర్భం గా కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సిఎంహెచ్ ఓ డా॥ రాజేష్, హెచ్ఓ రమేష్, ఈఈ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరప్రదేశ్ దొంగ అరెస్ట్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** జనగామ మండలంలోని యశ్వంతాపూర్ గ్రామంలో 15లక్షల రూపాయల విలువైన డిజిట్రాక్ మెషిన్ దొంగతానాకి పాల్పడిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన సోనుయాదవ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎసిపి అంకిత్‌కుమార్ తెలిపారు. గురువారం ఎసిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో సిఐ రఘుపతిరెడ్డితో కలిసి మాట్లాడారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం హన్సూర్‌పూర్ గ్రామానికి చెందిన సోను యాదవ్ హెచడ్‌డిడి మెషన్ ఆపరేటర్‌గా గత కొంత కాలం నుండి భగవతి కన్స్ట్రక్షన్స్‌లో పనిచేస్తున్నాడన్నారు. యశ్వంతాపూర్‌లోని బిఎస్ఎన్ఎల్ కేబుల్ వైర్ క్వాలిటీ చెక్ చేసేవాడని, దానికోసం కంపెనీ 15లక్షల రూపాయల విలువైన డీజిట్రాక్ మిషన్ ఇచ్చిందన్నారు. సోను యాదవ్ వరసకు తమ్ముడైన వ్యక్తితో కలిసి మెషన్ దొంగిలించి అమ్ముకుని తద్వారా వచ్చిన డబ్బులు జల్సాలు చేశాడన్నారు. ఎవరో మిషన్ దొంగలించారని కంపెనీని నమ్మబలికి తన సొంత గ్రామానికి వెళ్లిపోయాడన్నారు. భగవతి కంపెనీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు ఉత్తరప్రదేశ్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా సోను యాదవ్ ఒప్పుకున్నాడన్నారు. కేసును చేధించడంతో ఎస్ఐ భరత్, ఇతర పోలీసు సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించారన్నారు. వారిని ఎసిపి అంకిత్‌కుమార్ అభినందించారు.

# నకిలీ విత్తనాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

**కలెక్టర్ మనుచౌదరి, పోలీస్ కమిషనర్ అనురాధ**

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండ పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ అనురాధతోకలసి నకిలీ విత్తనాల నియంత్రణపై వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నకలీ విత్తనాలతో ఏ ఒక్క రైతు మోసపోకుండ వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో దాడులు నిర్వహించి నకిలీ విత్తనాలను అరికట్టాలన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులు టాస్క్ ఫోర్స్ బృందాలుగా ఏర్పడి ప్రభుత్వ అనుమతి లేకుండ కంపెని లెబుల్ లేకుండ గ్రామాల్లో తిరుగుతూ ధర తక్కువ, అధిక దిగుబడులు వస్తాయని చెపుతూ రైతులను మోసగించే వ్యాపారులు, కంపెని అనుమతులు లేకుండ రైతుల బిల్లులను ఇవ్వకుండ నకిలీ విత్తనాలు అమ్మే షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ జిల్లాలో వరి,పత్తి ప్రధాన పంటలు కాబట్టి వాటిలో మకిలి విత్తనాలు అవకాశం ఉన్నందున పోలీసు,వ్యవసాయ అధికారులతో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా ర్యాండంగా విత్తన షాపులు, గౌడౌన్లలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు కలిగి ఉన్న, రైతులకు విక్రయించిన షాపు యజమానులపై పిడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, సిపిఓ చంద్రశేఖర్, రాజు, మండల వ్యవసాయ శాఖ ఎడీలు , వ్యవసాయ శాఖ అధికారులు,ఎఈఓలు తెలిపారు.

## ప్రైవేట్ ఆర్‌టిసి బస్‌డ్రైవర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఉపేందర్ డిమాండ్




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** టిజిఎస్ ఆర్‌టిసిలో పనిచేస్తున్న ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారికి కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్, బోనస్ తదితర సౌకర్యాలు కల్పించాలని ఎఐటియుసి కొమురం భీం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆసిఫాబాద్ డిఎం విశ్వనాద్‌కు, బస్సు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో జూన్ 14వ తేదీ తరువాత నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆసిఫాబాద్ డిపోలో సుమారుగా గత 15 సంవత్సరాల నుంచి ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్లుగా పనిచేస్తూ చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ఆసిఫాబాద్ డిపో అభివృద్ధిలోనూ, డిపోకు లాభాలు రావడంలోనూ కీలకపాత్ర పోషిస్తున్న కార్మికులను బస్సు యజమానులు, ఆర్‌టిసి సంస్థ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్మిక చట్టాలు అమలు చేయకపోవడంతో శ్రమ దోపిడీకి గురవుతున్నారని, కార్మికులందరికీ 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో సెక్రటరీ దివాకర్, ప్రైవేట్ బస్ డ్రైవర్స్ యూనియన్ (ఎఐటియుసి) డిపో అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి షఫిక్, కోశాధికారి సాయి కృష్ణ, కార్మికులు ఆత్మకూరి సంతోష్,ఎం. కుమార్, మొండయ్య పాల్గొన్నారు.

## టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి : సమ్మయ్య



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ , ఎస్సీ, బిసి రెసిడెన్షియల్ పాఠశాలలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అధికారుల నుంచి వేదింపులను అరికట్టాలని, వారిని యధావిధిగా పనుల్లో కొనసాగించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వానికి రాష్ట్రంలోని అన్ని రెసిడెన్షియల్‌లో పనిచేస్తున్న నాన్ టీచింగ్, టీచింగ్ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారికి నియామక పత్రాలు ఇవ్వాలని కనీస వేతనం ఇవ్వాలని, పిఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించినప్పటికీ పరిష్కరించలేదన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని, నూతన విద్యా సంవత్సరంలో అన్ని రెసిడెన్షియల్‌లో వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న రెసిడెన్షియల్‌లో వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న సిబ్బందిని యధావిధిగా విధులలోకి తీసుకోవాలని, అధికారుల వేదింపులు లేకుండా చూడాలని, ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ఆదేశాల ప్రకారం రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ నియామకాలను చేపట్టాలనే ఆలోచనను పునరాలోచన చేసి నేరుగా ప్రభుత్వమే నూతన ఉద్యోగుల నియామకాన్ని చేపట్టాలని సమ్మయ్య కోరారు.

## ఇంటర్ వాల్యుయేషన్ తప్పులపై విచారణ జరిపించాలి : ఎఐఎస్ఎఫ్



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** ఇంటర్ ప్రశ్నపత్రాల వాల్యుయేషన్ తప్పులపై విచారణ జరిపించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వస్తూపుల అభిలాష్, ఉప్పుల శాంతికుమార్ డిమాండ్ చేశారు. గురువారం భువనగిరిలోని ఎఐఎస్ఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇంటర్ బోర్డ్ అధికారుల నిర్లక్ష్యం, ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్ చేసిన వారి అలసత్వం వహించి తప్పులుగా ప్రశ్నాపత్రాలు దిద్దడం వల్ల వేలాది విద్యార్థులకు నష్టం వాటిల్లిందన్నారు. మెరిట్ విద్యార్థికి మొదటి సంవత్సరంలో వచ్చిన మార్కులు, రెండో సంవత్సరంలో వచ్చిన మార్కులు చూస్తే విచిత్రంగా ఉన్నాయన్నారు. విద్యార్థులు తమకు ఏ సబ్జెక్ట్‌లో ఎన్ని మార్కులు వస్తాయో పరీక్ష రాశాక ఊహించుకుంటారు కాని, ఫలితాలు అనంతరం మార్కులు చూసి షాక్‌కి గురయ్యారన్నారు. రివాల్యుయేషన్, రీకౌంటింగ్‌తో పేపర్లు చూస్తే వాల్యువేషన్ చేసిన వారి తప్పులు బయటపడ్డాయన్నారు. వాల్యుయేషన్‌లో ఇష్టానుసారంగా పేపర్లు దిద్దారని, వచ్చిన మార్కులు ఒకటైతే ఆన్లైన్లో ఇంకో రకంగా వేశారన్నారు. పేపర్ వాల్యుయేషన్‌ను ప్రైవేట్ కళాశాల, ప్రభుత్వ కళాశాల లెక్చరర్లు చేస్తారని, కానీ ప్రైవేట్ కళాశాలల్లో పనిచేస్తున్న వారిని వాల్యుయేషన్‌కి పంపడంతో వారు ఇష్టానుసారంగా మార్కులు వేశారన్నారు. ఇంటర్ మార్కులు ఉన్నత చదువుల్లో కీలకం అని, అలాంటి ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్‌లో తప్పులు దొర్లడంతో విద్యార్థుల భవిష్యత్‌కు నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే పేద విద్యార్థులు రీకౌంటింగ్, రివాల్యుయేషన్ ఫీజులు కట్టే పరిస్థితి లేదని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు అని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికయిన స్పందించి ప్రశ్నాపత్రాల వాల్యువేషన్ ఇష్టానుసారంగా చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో విద్యార్థి నాయకులు శ్రీనివాస్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## తాటి, ఈత వనం దగ్ధం



**ప్రజాపక్షం/సంగెం :** మండల కేంద్రంలో గీత కార్మికుల సొంత భూమి 1.35 ఎకరాల్లో తాటి, ఈత చెట్లను15 ఏళ్ల నుంచి పెంచుతున్నారు. గురువారం ఉదయం సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాటి వనానికి నిప్పంటించారా.. లేక అకస్మాత్తుగా మంటలు చెలరేగాయా.. తెలియదు కానీ తాటి, ఈత చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. వేసవి కాలం ఎండ వేడికి మంటలు ఎగిసిపడుతూ తాటి, ఈత చెట్లు అగ్నికి ఆహుతి కావడంతో వాటిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమకు తీవ్ర నష్టం జరిగిందని గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికంగా ఉపాధి కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు. ఫైర్ సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వారు వచ్చేసరికి తాటి, ఈత వనం పూర్తి దగ్ధమైందన్నారు.

# కమ్యూనిస్టులే దేశానికి ప్రత్యామ్నాయం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** కమ్యూనిస్టులే దేశానికి సరైన ప్రత్యామ్నాయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం జనగామ జిల్లా సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ శిక్షణ తరగతులకు సిపిఐ జిల్లా సమితి సభ్యులు, మండల కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన శిక్షణ తరగతుల ప్రారంభ సమావేశానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న అధ్యక్షత వహించగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో వామపక్షాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కులం, మతం పేరుతో రాజకీయ లబ్ది పొందాలని చూసే పార్టీలకు దేశంలో కాలం చెల్లిందన్నారు. కేంద్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు మేలు చేకూర్చేందుకే పని చేసిందని, పేదలు, మద్య తరగతి వర్గాల ప్రజల సమస్యలను పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో పదేండ్ల బిఆర్ఎస్ పాలన నియంతృత్వ విధానాలతో, కుటుంబపాలన జరిగిందన్నారు. బిజెపి, బిఆర్ఎస్‌ల పాలనలో ప్రజల సమస్యలు విస్మరించారన్నారు. విద్యా, ఉపాధి రంగాలను పట్టించుకోలేదన్నారు. రైతులను పట్టించుకోలేదన్నారు. అందుకే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా అదే తీర్పు పునరావృత్తం అవుతుం దని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో కమ్యూనిస్టులు, లౌకిక శక్తులతోనే ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణ సాధ్యమన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలపై పోరాటం చేసి, వాటి పరిష్కారానికి కృషిచేస్తేనే ప్రజల్లో పార్టీకి ఆదరణ పెరుగుతుందన్నారు. రానున్న రోజులలో పార్టీ బలోపేతానికి సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, డాక్టర్ మార్క శంకర్ నారాయణ, పాతూరి సుగుణమ్మ, ఆకుల శ్రీనివాస్, మంగళంపల్లి జనార్ధన్, మండల కార్యదర్శి జువారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయండి

కార్మిక సంఘాల డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయబోమని, వాటిని రద్దు చేయాలని శాసనసభలో తీర్మానం చేయాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల సంయుక్త సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అనేక ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న 29 కేంద్ర కార్మిక చట్టాలను రద్దు చేసి పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు లాభాలు పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 4 కోడ్‌లుగా తీసుకురావటాన్ని తీవ్రంగా ఖండించాయి. కార్మిక సంఘాల సమావేశం గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ అధ్యక్షత వహించగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఎఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్‌డి చంద్రశేఖర్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ, టిఎన్‌టియుసి అధ్యక్షులు యం.కె.బోస్, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రెబ్బా రామారావు, ఐఎఫ్‌టియు నాయకులు ఎం.శ్రీనివాస్, కాన్ ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్, వర్కర్స్ అధ్యక్షులు వి.నాగేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.చంద్రయ్య, ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

## నర్సాయిపల్లిల్లో నిజాంకాలంనాటి నాణేలు లభ్యం





**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** ఉపాధి హామీ పనులను చేస్తుండగా ఓ విచిత్రమైన పాత రాతి పాత్ర బయటపడింది. చూడడానికి రాతిపాత్ర అయి న అది తెరిస్తే ఎమౌతుందో అన్న భయం ఆ కూలిలలో నెలకొంది. అయిన ఏది అయితే అది అయింది అన్ని ధైర్యంతో ఆ పాత్రను తెరువగా అందులో పాతకాలంనాటి 25 వెండి నాణాలు, రెండు వెండి ఉంగారాలు బయటపడ్డాయి. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా ఉమ్మడి మద్దూరు మండలంలోని నర్సాయిపల్లి గ్రామంలో ఉపాధి హామి పనుల్లో భూమిని చదును చేస్తూండగా ఓ రాతి పాత్ర బయటపడింది. ఆ పాత్రను తెరువగా అందులో నుండి పాతకాలంనాటి 25 వెండి నాణాలు, రెండు వెండి ఉంగారాలు బయటపడ్డాయి. ఆది ఆనోట ఇనోట మద్దూరు పోలీస్‌లకు సమాచారం చేరడంతో, మద్దూరు తహసీల్ధార్ అనంతరెడ్డి, ఎంపిడిఒ రామ్మోహన్, చేర్యాల సీఐ శ్రీనులు గ్రామానికి చేరుకుని అక్కడి కూలీలను విచారించగా జరిగిన విషయాన్ని అధికారులకు తెలియజేశారు. దీంతో నాణాల విషయం జిల్లా వ్యాప్తంగా చర్చనీయశంగా మారింది. అధికారులు ప్రాథమికంగా నిజాం కాలంనాటి చారిత్రక నాణాలుగా గుర్తించారు. వాటిని మరింత అధ్యయనం చేయడానికి పురావస్తుశాఖకు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ‘రాష్ట్రీయ చిహ్నాం’పై విస్తృత చర్చ జరగాలి

కోదండరామ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర అధికార చిహ్నాంలో ప్రజల జీవన విధానం, సంస్కృతి ప్రతిబింబించేలా ఉండాలని టిజెఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ అభిప్రాయపడ్డారు. దీనికి తగినట్టుగా మార్పులు, చేర్పులు చేయాలని, ఈ ప్రయత్నాన్ని గత ప్రభుత్వానికి సూచించినా పట్టించుకోలేదన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారిక చిహ్నాం మార్పులు, చేర్పుల అంశంలో గత ప్రభుత్వం చేసిన పొరపాటు మరో సారి చేయకుండా విస్తృతమైన చర్చ జరగాలని, ఏకాభిప్రాయం జరగాలని సూచించారు. దీనిపైన అసెంబ్లీలో కూడా చర్చిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిన విషయాన్ని కోదండరామ్ తెలిపారు. తొందరపాటుగా ఒకరిద్దరు కూర్చొని చర్చించి నిర్ణయిస్తే మళ్లీ తప్పు చేసినట్టుగానే ఉంటుందని, ప్రజాస్వామిక పద్ధతిలో చర్చించాలన్నారు. నాలుగు కట్టడాలను ఒక దగ్గర వేసినట్టుగా కాకుండా ప్రజల జీవితం ప్రతిబింబించాలని, చారిత్రక కట్టడాలు కూడా ఉండొచ్చని, తుది రూపంలో చిహ్నాం ఎలా ఉంటుందని తెలుస్తుందని తెలిపారు. పోరాటాలతోనే తెలంగాణ ప్రపంచానికి పరిచయమైందని దాశరథి చెబితే, ‘ఇన్ఖ్విలాబ్ క పైగంబర్ వో హై తెలంగాణ’ అని మగ్ధూం మొహియుద్దీన్ చెప్పిన విషయాలను కోదండరామ్ గుర్తుచేశారు. చిహ్నాం అంశంలో గత ప్రభుత్వం చర్చ కూడా చేయలేదని, అనేక అభ్యంతరాలు వ్యక్తం చేసినా పట్టించుకోలేదన్నారు. దీనిపైన గతంలోనే చర్చ చేసివుంటే ప్రస్తుతం ఇటువంటి వివాదం ఉండేది కాదన్నారు. తెలంగాణ రాష్ట్ర వేడుకలకు అమరవీరుల కు టుంబాలను ఆహ్వానిస్తున్నారన్నారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కూడా ఉన్నదని, వారిని కూడా ఆహ్వానించాలని ప్రభుత్వానికి సూచించారు.

జయ జయయే తెలంగాణలో కొత్తగా మార్పులు తీసుకురాలేదని, ఈ పాటను ఇది వరేక ప్రజలు పాడుకున్నారని వివరించారు. పాట రాసిందే తెలంగాణ కవి అని, ఈ పాటను రాష్ట్రీయ గీత హోదా లభించడం హర్షం వ్యక్తం చేశారు. కవి,గాయకుడు ఈ పాటను మంచి సంగీతంతో రావాలని అత్యుత్తమ ప్రదర్శన ఎలా ఉండాలన్న విషయంపైన కళాకారులకు ఆ మాత్రం స్వేచ్ఛ ఇవ్వాలని కోదండరామ్ అభిప్రాయపడ్డారు.

## ప్రభుత్వాన్ని మార్చండి

(మొదటి పేజీ తరువాయి)

ఒక ప్రటనను విడుదల చేసింది. నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం రైతుల ఆర్థిక స్థితిగతులను మరింత దిగజార్చే విధానాలను అమలు చేస్తోందని, ఇప్పుడు రద్దు చేయబడిన వ్యవసాయ చట్టాలు కార్పొరేట్‌లకు ప్రయోజనం చేకూర్చేలా ఉన్నాయని ఎస్‌కెఎం ఆరోపించింది. ‘కేంద్రంలో కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక బిజెపి ప్రభుత్వాన్ని శిక్షించాలని ప్రజలకు పిలుపునిస్తున్నట్లు పేర్కొంది. మోదీ ప్రభుత్వం రైతుల భూములను లాక్కోవడానికి, వ్యవసాయం నుండి వారిని దూరం చేయడానికి, రైతుల ఆర్థిక పరిస్థితులను ఉద్దేశపూర్వకంగా దిగజార్చడానికి విధానాలను రూపొందించిందని దుయ్యబట్టింది. మూడు వ్యవసాయచట్టాలు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కార్పొరేట్లను ప్రోత్సహించేవిగా ఉన్నాయని తెలిపింది. రైతులను రుణభారం నుండి విముక్తి చేయడానికి, తగిన ప్రభుత్వ పెట్టుబడులు, వ్యవసాయాన్ని ఉద్ధరించడానికి, ఆహార భద్రతను సాధించడానికి, పేదరికాన్ని నిర్మూలించడానికి వడ్డీ రహిత రుణాన్ని అందించడానికి విధానాలలో మార్పుకోసం ప్రభుత్వం మారాలని ఎస్‌కెఎం ప్రజలకు విజ్ఞప్తి చేస్తుందన్నారు. మూడు వ్యవసాయ చట్టాల రద్దు కోసం ఆందోళనకు నాయకత్వం వహించిన ఎస్‌కెఎం 18వ లోక్‌సభకు జరిగే సాధారణ ఎన్నికలను ‘వ్యవసాయ కార్పొరేటీకరణ’కు వ్యతిరేకంగా పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, ప్రత్యామ్నా య విధానాన్ని సులభతరం చేయడానికి ఒకఅవకాశంగా భావిస్తున్నట్లు పేర్కొంది. రిజర్వేషన్లను కాపాడేందుకు బిజెపిని తిరస్కరించాలని దళితులు, గిరిజనులు, ఒబిసిలకు విజ్ఞప్తి చేసింది. రిక్రూట్‌మెంట్‌పై నిషేధం కారణంగా, రైల్వే సహా కేంద్రప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో లక్ష పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది.

# మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానీయా



**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎస్):** మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానీయా అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలో మహిళ స్వశక్తి కుట్టు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఏకరూప దుస్తులు అందించడమే లక్ష్యంగా రాష్ట్రంలో 70లక్షల జతల దుస్తులు కుట్టించే బాధ్యత మహిళ సంఘాలకు అప్పగించామని తెలిపారు. అన్ని జిల్లాలో 45 రోజుల్లో మహిళ స్వశక్తి కుట్టు కేంద్రాల ద్వారా ఎంతో బాధ్యతాయుతంగా దుస్తులు నాణ్యతతో సిద్ధం చేస్తున్నారని తెలిపారు. గతంలో దుస్తులు ప్రైవేట్ సంస్థలకు ఇచ్చేదని, ఇప్పుడు సంఘాల ఆధ్వర్యంలో కుట్టు కేంద్రాల ద్వారా ఒక్కొక్క మహిళా రోజుకు 7 జతలు అందిస్తున్నారని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వపరంగా మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మహిళ కమిటీలు చేపట్టామని, త్వరలో మహిళా పాలసీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో మండలంలో కుట్టు మిషన్లు అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళలు స్కూల్ యూనిఫాంలు కుడుతున్న తీరును పరిశీలించారు. జిల్లాలో 74శాతం పూర్తి చేసినందున మహిళలను, జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లాలో 23 మండలాల్లో 783 ప్రభుత్వ పాఠశాలల్లో 43,245 విద్యార్థుల దుస్తులకు 62 ప్రాంతాల్లో 721 మహిళా సంఘాల సభ్యులతో ఇప్పటి వరకు 31,940 మంది విద్యార్థులకు దుస్తులు సిద్ధం చేసినట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులో మిగతా దుస్తులు సిద్ధం చేస్తామన్నారు. విద్యార్థులు పాఠశాల ప్రారంభంలోనే నూతన దుస్తులు ధరించే విధంగా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచనలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సిహెచ్ ప్రియాంక, డిఆర్‌డిఓ మధుసూదన్ రాజు, జెడ్‌పి సిఇఒ అప్పారావు, డిఇఒ అశోక్, ఎపిడి సురేష్ కుమార్, ఎంపిఒ సంజీవ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన మోసాలు

(మొదటి పేజీ తరువాయి)

నివేదికలో వెల్లడించింది. ఈ విషయంలోనూ ప్రభుత్వరంగ బ్యాంకులే ముందువరుసలో ఉన్నట్లు పేర్కొంది. 2021–22లో 3,596 కార్డు, ఇంటర్నెట్ మోసాలు నమోదు కాగా... ఆ సంఖ్య 2023–24లో 29,082కు పెరిగినట్లు ఆర్‌బీఐ నివేదిక తెలిపింది. ఇందులో కొద్దిపాటి నగదు మొత్తాలు అధిక సంఖ్యలో ఉన్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఈ తరహా మోసాల వల్ల కోల్పోయిన మొత్తం గడిచిన రెండేళ్లలో రూ.155 కోట్ల నుంచి రూ.1,457 కోట్లకు పెరిగింది. 202223, 2324 ఆర్థిక సంవత్సరాల్లో నమోదైన మోసాలకు సంబంధించి మరో ఆసక్తికర అంశాన్ని ఆర్‌బీఐ బయటపెట్టింది. మోసం జరిగిన తేదీకి, గుర్తించడానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంటోందని ఆర్‌బీఐ గుర్తించింది.

**బ్యాలెన్స్ షీట్ రూ.70.47 లక్షల కోట్లు**

202324 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) గురువారం విడుదల చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్ 11.08 శాతం పెరిగిందని వెల్లడించింది. 2023 మార్చి నాటికి కేంద్ర బ్యాంకు వద్ద రూ.63.45 లక్షల కోట్ల బ్యాలెన్స్ ఉండగా... గత ఆర్థిక సంవత్సరంలో అది రూ.7.02 లక్షల కోట్లు పెరిగి రూ.70.47 లక్షల కోట్లకు చేరిందని తెలిపింది. ఇది పాకిస్థాన్ దేశ జీడీపీ కంటే రెండున్నర రెట్లు ఎక్కువ. 2024 మార్చి నాటికి ఆర్‌బీఐ నికర ఆదాయం రూ.2.11 లక్షల కోట్లుగా ఉంది. 202223 ఆర్థిక సంవత్సరంలో ఈ ఆదాయం రూ.87,420 కోట్లు మాత్రమే ఉన్నది. గత ఆర్థిక సంవత్సరంలో విదేశీ పెట్టుబడులు 13.90 శాతం, బంగారం (డిపాజిట్లు, తాకట్టు రూపంలో) 18.26 శాతం, రుణాలు, అడ్వాన్సులు 30.05 శాతం పెరిగాయి. దీనివల్ల బ్యాలెన్స్ షీట్‌లో ఆస్తుల విలువ భారీగా పెరిగినట్లు ఆర్‌బీఐ తమ నివేదికలో వెల్లడించింది. కరెన్సీ నోట్ల జారీ 3.88 శాతం, డిపాజిట్లు 27 శాతం, ఇతర అప్పులు 92.57 శాతం పెరిగాయని తెలిపింది. గతంలో ఎన్నడూ లేనంతగా 2023 24 ఆర్థిక సంవత్సరానికి రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను ప్రభుత్వానికి చెల్లిస్తామని ఇటీవల ఆర్‌బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. 202223 ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బీఐ రూ.87,416 కోట్లు డివిడెండ్ రూపంలో చెల్లించింది. దీంతో పోలిస్తే 202324 ఆర్థిక సంవత్సరంలో 140 శాతం అధికంగా డివిడెండ్ చెల్లిస్తుండటం గమనార్హం. బ్యాలెన్స్ షీట్ పెరిగిన కారణంగా డివిడెండ్ మొత్తాన్ని పెంచినట్లు రిజర్వ్ బ్యాంక్ తాజా నివేదికలో వెల్లడించింది. నోట్ల జారీ, మానిటరీ విధానాలు, రిజర్వ్ మేనేజ్‌మెంట్ లక్ష్యాలు తదితర కార్యకలాపాలను ఆర్‌బీఐ ఈ బ్యాలెన్స్ షీట్‌లో పేర్కొంటుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఎవరూ క్లెయిమ్ చేయని డిపాజిట్లు 26 శాతం పెరిగాయని ఆర్‌బీఐ వెల్లడించింది. 2023 మార్చి నాటికి ఈ డిపాజిట్లు రూ.62,225 కోట్లుగా ఉండగా... ఈ ఏడాది మార్చి నాటికి రూ.78,213 కోట్లకు చేరినట్లు తెలిపింది. 10 లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలుగా క్లెయిమ్ చేయని డిపాజిట్లను బ్యాంకులు... ఆర్‌బీఐకి చెందిన డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (డీఈఏ) నిధికి బదిలీ చేస్తాయి. క్లెయిమ్ చేయని డిపాజిట్ల పరిమాణాన్ని తగ్గించడానికి, అటువంటి డిపాజిట్లను నిజమైన క్లెయిమ్‌దారులకు తిరిగి ఇవ్వడానికి ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటోంది.

## ‘ప్రధాని’ ఎంపిక

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. ఇమాందారీ (నిజాయితీ), ఇన్సానియత్ (మానవత్వం). ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ప్రతీకార రాజకీయాలు ఉండవు. ప్రధాని మోదీ ప్రఖ్యాత వివేకానంద రాక్ మెమోరియల్‌కు వెళ్లి రెండు రోజులపాటు ధ్యానం చేస్తున్నారు. అదే వివేకానంద రాక్ మెమోరియల్ నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 2022 సెప్టెంబర్ 7న భారత్ జోడో యాత్రను ప్రారంభించారు. రాహుల్ ఎక్కడ నుంచి తన పాదయాత్రను ప్రారంభించారో, పదవీ విరమణ తర్వాత జీవితం ఎలా ఉండబోతుందనే దానిపై ప్రధాని మోదీ ధ్యానం అక్కడే చేయబోతున్నారని నేను అనుకుంటున్నాను’ అని జైరాం రమేశ్ అన్నారు.

**2004 ఫలితాలు రిపీట్!**

2004 సార్వత్రిక ఎన్నికల్లో కూడా బిజెపి 'ఇండియా షైనింగ్' పేరిట ప్రచారం చేసినప్పటికీ కాంగ్రెస్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైందని, అలాంటి ఫలితమే 2024లోనూ పునరావృతం అవుతుందని జైరాం రమేశ్ ధీమా వ్యక్తం చేశారు. రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందని జోస్యం చెప్పారు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, అసోంలో హస్తం పార్టీకి సీట్లు పెరుగుతాయని అంచనా వేశారు. 2019 లోక్ సభ ఎన్నికల్లో ఉత్తర్ ప్రదేశ్ లో బిజెపి 62, బంగాల్‌లో 18, బీహార్‌లో ఎన్‌డిఏ 39 సీట్లు గెలిచిందని, వాటిని ఈసారి కాపాడుకోలేదని చెప్పారు. ‘జూన్ 1న ఇండియా కూటమి సమావేశం జరగబోతోందని నాకు ఎటువంటి ప్రామాణిక సమాచారం లేదు. 2004 మే 13న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మే 16న యుపిఎ సమావేశమైంది. మే 17న ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ పేరును ఖరారు చేశాం. అప్పట్లో ప్రధాని పేరు బయటకు రావడానికి 3 రోజుల కంటే తక్కువ సమయం పట్టింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థిని ఎంపిక చేయడానికి 48 గంటలు కూడా పట్టదు. కూటమిలో అత్యధిక స్థానాలు సాధించిన పార్టీగా కాంగ్రెస్ అవతరించే అవకాశం ఉంది. అత్యధిక స్థానాలు ఉన్న పార్టీ ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తుంది. స్థిరమైన, పారదర్శకమైన, బాధ్యతాయుతమైన ప్రభుత్వాన్ని అందించడానికి మేం కట్టుబడి ఉన్నాం. దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే ప్రధాని వస్తారు. కూటమి అధికారంలోకి వచ్చాక మోదానీ, మోదాంజలి స్కామ్ లపై విచారణ జరిపేందుకు నెలలోగా జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేస్తాం’ అని జైరాం రమేశ్ తెలిపారు.

**ఇండియా కూటమికి మెజార్టీ పక్కా!**

మరోవైపు, లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి స్పష్టమైన మెజార్టీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే. దేశాన్ని కలుపుకుని పోయే జాతీయవాద ప్రభుత్వాన్ని ఇండియా కూటమి ఏర్పాటు చేస్తుందని తెలిపారు. బిజెపి మరో అధికారంలోకి వస్తే దేశంలోని ప్రజాస్వామ్యాన్ని అంతం చేస్తుందని విమర్శించారు. ఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్‌డిఎ సర్కార్ పై ఖర్గే విమర్శలు గుప్పించారు.‘కులం, మతంపై ఓట్లను అభ్యర్థించకూడదని ఇసి ఆదేశించినప్పటికీ, ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ ‘మందిర్‌మసీదు’ గురించి 421 సార్లు మాట్లాడారు. గత 15 రోజుల్లో మోదీ తన ప్రసంగాల్లో కాంగ్రెస్ పేరును 232 సార్లు, నా పేరును 758 సార్లు ఉపయోగించారు. దేశంలో నిరుద్యోగం గురించి మాత్రం ఒక్కసారి కూడా మాట్లాడలేదు. ఇండియా కూటమి స్పష్టమైన మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. దేశానికి సమ్మిళిత, జాతీయవాద ప్రభుత్వాన్ని అందిస్తుంది‘ అని ఖర్గే వ్యాఖ్యానించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## నేడు నార్సింగి మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక

**ప్రజాపక్షం/నార్సింగి:** రాజేందర్ నియోజకవర్గం పరిధిలోని నార్సింగి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ శుక్రవారం ఎన్నికలు నిర్వహించడానికి మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీచేశారు గతంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి పదవి నుంచి తప్పించిన విషయం తెలిసిందే. ఆ స్థానాలు ఖాళీగా ఏర్పడిన రెండు పదవులను తిరిగి కౌన్సిలర్ అంతా కలిసి కొత్తవారిని ఎన్నుకోవాల్సింది. ఈ ప్రక్రియలో భాగంగా ముందుగానే మెజార్టీ కౌన్సిలర్లు సమావేశం ఏర్పాటు చేసుకొని కొత్త చైర్ పర్సన్ గా మంచిరేవులకు చెందిన మైలారం నాగపూర్ణ శ్రీనివాసును, వైస్ చైర్మన్ గా కోక పేటకు చెందిన విజయబాబును ఎన్నుకున్నారు. నేడు జరిగే ఈ సమావేశంలో వారిని అధికారికంగా ఎన్నుకుని పదవి ప్రమాణ స్వీకారం చేయించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తా

### తెలంగాణ హకీ అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బరిలో పోటీకి దిగుతున్నానని తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ ఎన్నికలలో తనను గెలిపిస్తే తెలంగాణ రాష్ట్ర క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని తెలంగాణ హకీ అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్ తెలిపారు. గురువారం ఫతేమైదాన్ తెలంగాణ ఒలంపిక్ భవన్‌లో ఎన్నికల అధికారికి తన నామినేషన్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ 9వ తేదీన తెలంగాణ ఒలంపిక్ భవన్‌లో ఎన్నికలు జరగనున్నాయని, మాజీ ఎంపి జితేందర్ రెడ్డి అధ్యక్షుడిగా పని చేస్తున్న ప్యానల్ నుంచి తాను పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ క్రీడలను ఉన్నత స్థాయిలో తీసుకెళ్తూ క్రీడలను మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు.

## విత్తనాల కొరత లేదు : చిన్నారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో అన్నిరకాల పంటల విత్తనాల నిల్వలు సరిపడు ఉన్నాయని, విత్తనాల కొరత లేదని, రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు కుట్రలు చేస్తున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. రాష్ట్రంలో వానాకాలం వ్యవసాయ సీజన్ (ఖరీఫ్)లో పండించాల్సిన పంటలపై ప్రభుత్వ సన్నద్ధతపై బంజారాహిల్స్ మంత్రుల అధికారిక నివాసంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి గురువారం చర్చించారు.అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ అన్ని రకాల పంటల సాగు కోసం వేయాల్సిన విత్తనాలు నిల్వలు సరిపడ ఉన్నాయని, విత్తనాల కొరతపై ప్రతిపక్ష పార్టీల నాయకులు కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ప్రతిష్టను దిగ జార్చేందుకు పన్నాగాలు పన్నుతున్నారని ఆరోపించారు. జిల్లాల్లో రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించే బాధ్యత ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లాల వ్యవసాయ అధికారులదేనని, ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని చిన్నారెడ్డి సూచించారు. ఈ భేటీలో వ్యవసాయ అధికారుల సంఘం జెఏసి చైర్మన్ బొమిరెడ్డి కృపాకర్ రెడ్డి, రిటైర్డ్ వ్యవసాయ అధికారులు తమ అనుభవాలను పంచుకున్నారు.

## కేంద్రం హోంశాఖ అనుమతితోనే ‘అధికార చిహ్నం మార్పు’: వినోద్‌కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర అధికార చిహ్నం మార్పు అంశంలో కేంద్ర ప్రభుత్వ హోంమంత్రిత్వ శాఖ అనుమతి తప్పనిసరి అవసరమని బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేసి నిర్ణయం తీసుకుంటుందని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తాను ఢిల్లిలోఒక సంవత్సరం పాటు తిరిగితేనే తమకు అనుమతి ఇచ్చారని తెలిపారు. తాను కేసు వేస్తానని చెప్పిన తర్వాతనే చిహ్నం అంశంలో ప్రభుత్వం ఆలోచనలో పడిందన్నారు.

## అమెరికాలోని నాసాను సందర్శించిన శాంటా మారియా విద్యార్థులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ శాంటా మారియా ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు అమెరికాలో ఉన్న నాసాని సందర్శించారు. విజ్ఞాన సముపార్జనలో భాగంగా నిర్వహించిన ఈ ఎడ్యుకేషన్ టూరో 38 మంది విద్యార్థులు వెళ్లారు. నాసాతో పాటు ఆ దేశంలోని ఇతర ఐకానిక్ ప్రదేశాలను కూడా సందర్శించారు. నాసాలోని అంతరిక్ష శిబిరంలో మూడు రోజులు గడిపిన విద్యార్థులు వివిధ కార్యకలాపాలలో నిమగ్నమయ్యారు. స్పేస్ షటిల్ , సిమ్యులేటర్లు, మ్యూజియంను వీక్షించారు. ఈ పర్యటనలో విద్యార్థులు వ్యోమగామి లిండా ఫిషర్తో మాట్లాడటం, కలిసి భోజనం చేయడం మరపురాని జ్ఞాపకంగా మిగులిందన్నారు. విద్యార్థులు వెహికల్ అసెంబ్లీ బిల్డింగ్, ఎల్సీ39 లాంచ్ ప్యాడ్ ల, రాకెట్ గార్డెన్ తదితర ముఖ్యమైన ప్రదేశాను సైతం విద్యార్థులు అనంతరం తూర్పు తీరంలోని అనేక ప్రసిద్ధ ప్రదేశాలను విద్యార్థులు సందర్శించారు.ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థి త్వరిటా మాట్లాడుతూ ఈ ఎడ్యుకేషన్ టూర్ ఎంతో నాలెడ్జ్ ఇచ్చిందన్నారు. డిస్నీ మ్యాజిక్ కింగ్డమ్ పార్క్, యూనివర్సల్ స్టూడియోస్, సీ వరల్ మంత్రముగ్ధులను చేశాయన్నారు. అంతరిక్ష యాత్ర గురించి తెలుసుకున్నామని పేర్కొన్నారు. వాషింగ్టన్ డీసీలో అమెరికన్ చరిత్రను పరిశీలించామన్నారు. ఈ యాత్ర జీవిత కాలం గుర్తుండిపోయే జ్ఞాపకాలను అందించిందని తెలిపారు.

## అపెక్స్ బ్యాంక్ జిఎం వాణిబాల అరెస్టు

### ఆమె భర్త, కుమారుడు కూడా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అధిక వడ్డీకి ఆశపడిన ఖాతాదారులకు రూ.200 కోట్ల కుచ్చుటోపి పెట్టి బిచారణ ఎత్తివేసిన శ్రీప్రియాంక ఎంటర్ ప్రైజెస్ కేసును సిసిఎస్ పోలీసులు ఛేదించారు. పది రోజుల నుంచి పరారీలో ఉన్న నిందితులను ఎట్టకేలకు గురువారం సిసిఎస్ ఎసిపి కె.ఎం.కిరణ్‌కుమార్ అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ జనరల్ మేనేజర్ నమ్మగడ్డ వాణిబాల, ఆమె భర్త శ్రీప్రియాంక ఎంటర్ ప్రైజెస్ డైరెక్టర్ మేక నేతాజి, ఈ దంపతుల కుమారుడు మేక శ్రీహర్షలు ఉన్నారు. ఈ ముగ్గురు నిందితులను మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించారు. సిసిఎస్ డిసిపి యన్.శ్వేత కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సైదాబాద్‌కు చెందిన వాణిబాల ఆబిడ్స్‌లోని అపెక్స్ బ్యాంక్‌లో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె భర్త మేక నేతాజి, కుమారుడు శ్రీహర్ష 1985లో శ్రీప్రియాంక ఎంటర్ ప్రైజెస్ సంస్థను స్థాపించారు. 24 శాతం వడ్డీ ఇస్తామని పలువురు డిపాజిట్ల నుంచి డబ్బులు వసూలు చేశారు. తన బ్యాంక్‌కు వచ్చే డిపాజిట్ దారులను సైతం వాణిబాల తన భర్త ఏర్పాటు చేసిన సంస్థకు పంపించేది. తమ బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తే తక్కువ వడ్డీ వస్తుందని, తన భర్త ఏర్పాటు చేసిన ప్రియాక సంస్థలో పెట్టుబడులు పెడితే 24 శాతం వడ్డీ అధికంగా వస్తుందని నమ్మించారు. దీంతో ఆమె బ్యాంక్‌లోనే పనిచేస్తున్న ఉద్యోగులు, వారి బంధువులు, స్నేహితులు సుమారు ఇలా 532 మంది నుంచి సుమారు రూ.200 కోట్ల వరకు డిపాజిట్లను స్వీకరించారు. చెప్పిన ప్రకారం ఈ నేడాది ఫిబ్రవరి వరకు డిపాజిట్ దారులకు 24 శాతం వడ్డీ ఇస్తూ వచ్చారు. రెండు నెలల నుంచి వడ్డీ ఇవ్వడం మానివేయడంతో అనుమానం వచ్చిన డిపాజిట్ దారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రియాంక సంస్థ బిచారణ ఎత్తివేసిన విషయం వెలుగు చూసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా నిందితులు ముగ్గురు పరారీలో ఉన్నారు. ఈ ముగ్గురిని చాకచక్యంగా గురువారం అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. అధిక వడ్డీ ఇస్తామంటే నమ్మవద్దని డిపాజిట్ దారులకు పోలీసులు సూచిస్తున్నారు.

## స్పా సెంటర్‌పై పోలీసుల దాడి నలుగురి అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలోని పలు స్పా సెంటర్లపై పోలీసులు వారం రోజుల నుంచి వరుస దాడులు నిర్వహిస్తున్నారు. స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో బంజారాహిల్స్, పంజగుట్ట పోలీసు స్టేషన్‌ల పరిధిలో దాడులు నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా గురువారం సైఫాబాద్ పోలీసు స్టేషన్‌పరిధిలోని అమృత క్యాస్టల్‌లోని మెగావి వెల్‌నెస్ స్పా సెంటర్లో పోలీసులు దాడులు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించి మసాజ్ చేస్తున్న నలుగురు మహిళలను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఒకేరోజు 8 లక్షలు

### జిహెచ్ఎంసి చరిత్రలోనే తొలిసారి నోటీసులు జారీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆస్తిపన్ను వసూళ్ల కోసం మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) సరికొత్త వ్యూహాలకు శ్రీకారం చుట్టింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.2200 కోట్ల ఆస్తిపన్ను వసూలే లక్ష్యంగా అధికారులు నిర్దేశించుకున్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు వ్యూహాలకు పదును పెట్టారు. అందులో భాగంగా జిహెచ్ఎంసి చరిత్రలో మొట్టమొదటి సారిగా ఒకేరోజు 8 లక్షల మంది ఆస్తిపన్ను చెల్లింపుదారులకు డిమాండ్ నోటీసులు జారీ చేశారు. ఆన్‌లైన్ ద్వారా పన్ను చెల్లింపుదారుల ఫోన్ నెంబర్‌లకు ఒక క్లిక్‌తో 8 లక్షల నోటీసులను అధికారులు పంపించారు. ఆస్తిపన్ను చెల్లించేందుకు చెల్లించేందుకు ఆన్‌లైన్ ద్వారా సులభతర మార్గాలను జిహెచ్ఎంసి అందుబాటులోకి తీసుకొచ్చింది. 2023–24 వార్షిక ఆస్తిపన్ను రూ.1921 కోట్లు రికార్డు స్థాయిలో వసూలైన విషయం తెల్సిందే. అలాగే 2024–25 వార్షిక సంవత్సరానికి సంబంధించిన ముందస్తు ఆస్తిపన్ను వసూళ్లలో భాగంగా ఎర్లీబర్డ్ పథకంలో సుమారు 7 లక్షల 20 వేల మంది రూ.829 కోట్లు చెల్లించారు. 2024–25 వార్షిక సంవత్సరానికి సంబంధించిన ఎర్లీబర్డ్ పథకంలో ఆస్తిపన్ను చెల్లించని వారి నుంచి వసూలు చేయడమే లక్ష్యంగా ఈ కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. ఈ నెల 28వ తేదీన ఆస్తిపన్ను డిమాండ్ నోటీసులు పంపించగా, పన్ను చెల్లింపుదారుల నుండి మెరుగైన స్పందన లభించింది. 29, 30 తేదీలలో రోజుకు రూ.2 కోట్ల చొప్పున నగర ప్రజలు ఆస్తిపన్ను చెల్లించారు. సాధారణంగా ప్రతి రోజు ఆస్తిపన్ను రూపంలో జిహెచ్ఎంసికి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు మాత్రమే వసూలవుతోంది. ఆన్‌లైన్ నోటీసుల ద్వారా ఏకంగా రూ.2 కోట్లకు పెరగడంతో అధికారుల వ్యూహం ఫలించినట్లైంది. దీనితో ఇతర చెల్లింపులకు కూడా ఈ విధానాన్ని అమలు చేయాలనే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలిసింది.

### ఆన్‌లైన్‌లో డిమాండ్ నోటీసులు..

ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ఆన్‌లైన్‌లో ఫోన్ నెంబర్లకు పన్ను చెల్లించాలనే సందేశంతో పాటు లింకును జిహెచ్ఎంసి యంత్రాంగం పంపించింది. జిహెచ్ఎంసి పంపించిన లింకును ఫోన్‌లో క్లిక్ చేసిన వెంటనే నోటీసు డౌన్‌లోడ్ అవుతోంది. డిమాండ్ నోటీసులో చెల్లించాల్సిన మొత్తానికి సంబంధించిన సమాచారం మొత్తం ఉంటుంది. నోటీసు చివరిలో ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరిపేందుకు అవకాశం కల్పించారు. టి వ్యాలెట్, డెబిట్ కార్డు, ఎస్‌బిఐ ఈపే, యుపిఐల ద్వారా చెల్లింపులు జరిపేందుకు అవకాశం కల్పించారు. చెల్లింపులను సులభతరం చేయడంతో నగర వాసుల నుంచి మెరుగైన స్పందన వస్తుంది. ఆన్‌లైన్‌లో నోటీసులు అందించిన, అందకపోయిన వారికి కూడా పన్ను చెల్లింపుదారులందరికీ బిల్ కలెక్టర్‌ల ద్వారా నేరుగా కూడా నోటీసులు అందచేస్తున్నారు.

## స్పోర్ట్స్ అథారిటీ వేసవి శిబిరాలు సక్సెస్

### నేటితో ముగియనున్న వేసవి శిక్షణ శిబిరాలు

### ఎల్‌బి స్టేడియంలో ముగింపు ఉత్సవాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థులు, చిన్నారుల ఆనందోత్సహాల మధ్య వేసవి క్రిడా శిబిరాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఇందుకోసం గురువారం వివిధ స్టేడియాల్లో ముగింపు ఉత్సవాలను స్పోర్ట్స్ అథారిటీ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ క్రిడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గత 45 రోజుల నుండి నగరంలోని వివిధ స్టేడియాలు, నెల రోజుల నుండి జిల్లా కేంద్రాల క్రిడా ప్రాంగణాల్లో సందడి చేసిన వేసవిక్రీడా శిక్షణ శిబిరాలు నేటితో ముగియనున్నాయని అధికారులు తెలిపారు. అనునిత్యం పుస్తకాలు మార్కులు, ర్యాంకులతో సతమతమైన విద్యార్థినీవిద్యార్థులకు వేసవి క్రిడా శిబిరాలు ఆనందం, ఆహ్లాదంతో విజయవంతంగా జరిగాయని క్రిడా శాఖ అధికారులు తెలిపారు. హైదరాబాద్ ఎల్.బి.స్టేడియంలో ఉదయం 8 గంటలకు జరగనున్న ముగింపు వేడుకలకు స్పోర్ట్స్ అథారిటీ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె. లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.



**నార్సింగి :** శంషాబాద్ మండల పరిధిలోని గత నెల రోజులుగా నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగిసింది. నవోదయ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్వాల్‌గూడలో కబడ్డీ, కోకో, వాలీబాల్, రన్నింగ్ తదితరాలపై శిక్షణ అందజేశారు. గురువారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు రఘునందన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలియజేశారు . అనంతరం పిల్లలకు ట్రోపీలు, మెమోటోలు అందజేశారు. కార్యక్రమంలో గుంటి ప్రవీణ్ కుమార్, డేవిడ్, ఆనందం, శ్రీనివాస్ గౌడ్, లింగం యాదవ్, నర్సింగ్‌రావు, నీరటి నరసింహ, ప్రవీణ్ యాదవ్ , చెల్లా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### కాలనీ వాసులకు సమస్యలు రాకుండా

## భూగర్భ డ్రైనేజీ పనులు

**ప్రజాపక్షం/వనస్థలిపురం:** సాహెబ్ నగర్ వీకర్ సెక్షన్ కాలనీ వద్ద నుంచి బతుకమ్మ కుంట వరకు భూగర్భ డ్రైనేజీ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, జలమండలి మేనేజర్ భవ్యరెడ్డితో కలిసి కాలనీలో పర్యాటించి, పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు, కాలనీ వాసులకు ఏలాంటి సమస్యలు రాకుండా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. భూగర్భ డ్రైనేజీల్లో జాప్యం లేకుండా అధికారులు పరివేక్షణ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు సత్యనారాయణ, జగన్,ముఖేష్, వాటర్ వర్క్స్ సూపర్వైజర్ అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## అనుమానాస్పద స్థితిలో డిగ్రీ విద్యార్థిని మృతి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అనుమానాస్పద స్థితిలో డిగ్రీ చదువుకుంటున్న విద్యార్థినీ మృతి చెందిన సంఘటన షరూఖ్‌నగర్ మండలం కందివనం గ్రామంలో చోటు చేసుకుంది. షాద్‌నగర్ ఎస్ఐ శరత్ తెలిపిన వివరాల ప్రకారం కందివనం గ్రామానికి చెందిన మానస (20) అనే విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి తల్లి లక్ష్మమ్మ వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శరత్ తెలిపారు.

### మానసది ఆత్మహత్య కాదు..హత్య చేశారు..

### యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్



కందివనం గ్రామానికి చెందిన డిగ్రీ చదువుకుంటున్న మానస అనే విద్యార్థినిది ఆత్మహత్య కాదని, హత్య చేశారని ఆరోపించారు. ఈ సంఘటనలో కొంతమంది రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడంతోనే హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించారని మండిపడ్డారు. విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మరణించినప్పుడు గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తి అక్కడే ఎందుకు ఉన్నాడో చెప్పాలని డిమాండ్ చేశారు. మానస మృతికి కారణమైన వ్యక్తులకు కఠినంగా శిక్షించాలని షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు తమ వ్యక్తిగత విషయాలను తల్లిదండ్రులతో చర్చించాలని, అప్పుడే ఎలాంటి అనర్థాలు చోటు చేసుకోవని సూచించారు. మానస కుటుంబానికి అన్యాయం చేస్తే ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

### షాద్‌నగర్ ఎంఎల్ఎ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా దర్బార్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని షాద్‌నగర్ ఎంఎల్ఎ వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజల నుండి వివిధ సమస్యలపై వచ్చిన ధరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే తెలంగాణలో ప్రజా ప్రభుత్వం వచ్చిందని, ప్రజలు ఏ సమస్య వచ్చినా నేరుగా వచ్చి వివరించుకోవచ్చునని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంఎల్సి, పార్లమెంట్ ఎన్నికలు వరుసగా రావడంతో ప్రజా సమస్యలపై దృష్టి కేంద్రీకరించలేక పోయామని, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఎంత తెలిసిన వారైనా సరే లేదా పార్టీకి చెందిన వారైనా సరే పరిపాలనలో వేలు పెట్టకుండా అధికారులకు కూడా స్వేచ్ఛను కల్పించడం జరుగుతుందని వివరించారు. పరిపాలనలో ముక్కు సూటితత్వం ప్రదర్శిస్తున్న ఎంఎల్ఎ వీర్లపల్లి శంకర్ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధర్మబద్ధమైన పనులు వస్తేనే తన వద్దకు రెగమెండేషన్లకు రావాలని పిచ్చిపిచ్చి విషయాలను ముందుకు తీసుకురావద్దని ఖరాఖండిగా వివరించారు. ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు తాను సిద్దంగా ఉన్నట్లు తెలిపారు.

### బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి

బ్రాహ్మనుల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఎ వీర్లపల్లి శంకర్ సూచించారు. బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వ పరంగా పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని తెలిపారు. బ్రాహ్మణుల సంఘం స్థితిగతుల విషయంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు చిలుకూరి రామ సత్యనారాయణ శర్మ, అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షుడు రవిశర్మ, కార్యవర్గ సభ్యులు రాజగోపాల్ ఎంఎల్ఎకు తెలిపారు. ఆందుకు ఎంఎల్ఎ స్పందిస్తూ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

## పదవ తరగతి మైలురాయి వంటింది

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ప్రతి విద్యార్థిని, విద్యార్థుల జీవితంలో పదవ తరగతి మైలురాయి వంటిందని, విద్యార్థులు సాధించిన విజయంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిభా పురస్కారాలు 2024 కార్యక్రమంలో కలెక్టర్ శశాంక ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ జిల్లాలో 50 వేల 807 మంది విద్యార్థిని విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరు కాగా అందులో 46 వేల 245 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం జరిగిందని తెలిపారు. జిల్లా లో 36 ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని,10/10 గ్రేడ్ పాయింట్స్ ను 50 మంది విద్యార్థిని, విద్యార్థులు సాధించడం జరిగిందని కలెక్టర్ వివరించారు. గత సంవత్సరం కంటే 2023–24 విద్యా సంవత్సరం10/10 గ్రేడ్ పాయింట్స్ ను సాధించిన విద్యార్థుల సంఖ్య పెరిగిందని, వంద శాతం ఉత్తీర్ణత సాధించిన స్కూల్స్ సంఖ్య సైతం పెరగడం అభినందనీయమన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ శుభాభినందనలు తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, భూపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ మనం ఎంచుకున్న లక్ష్యాన్ని ఇష్టంతో కష్టపడితేనే విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమాన్ని ముందుగా జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

### పచ్చి రొట్ట, పత్తి విత్తనాలకు కొరత లేదు

పచ్చిరొట్ట, పత్తి విత్తనాలకు కొరత లేదని కలెక్టర్ కె శశాంక తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో సమావేశ మందిరంలో రంగారెడ్డి జిల్లాలో పచ్చిరొట్ట, ప్రత్తి విత్తనాల లభ్యతపై కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో మొత్తం 1778 క్వింటాళ్ల పచ్చి రొట్ట ఎరువులు అందుబాటులో ఉంచగా 1584 క్వింటాల విత్తనాలు సరఫరా చేసినట్టు తెలిపారు. ఇంకా 194 క్వింటాల్ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. పత్తి విత్తనాలు 4 లక్షల 91వేల 36 ప్యాకెట్లు అవసరం ఉండగా 1 లక్ష 78 వేల 554 ప్యాకెట్స్ సరఫరా కొరకు అందుబాటులో ఉన్నావని తెలిపారు. ఇంకా అవసరాన్ని బట్టి ప్రతిరోజు కావలసిన ప్యాకెట్స్ డీలర్ వద్ద అందుబాటులో ఉంచామని వివరించారు. జిల్లాలో పచ్చిరొట్ట, పత్తి విత్తనాలకు కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ సూచించారు. నకిలీ, నాసిరకం విత్తనాలతో రైతులు నష్టపోకుండా చూడాల్సిన గురుతర బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నకిలీ విత్తనాల బెడద లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇతర ప్రాంతాల నుండి నకిలీ సీడ్ మన జిల్లాలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు. గడువు ముగిసిన విత్తనాలను,లైసెన్స్ లేకుండా విక్రయించే వాటిని,ఒక ప్రాంతంలో లైసెన్స్ కలిగి ఉండి,వేరే చోట విక్రయాలు జరిపే వారిపైనా చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీత రెడ్డి,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్షతగాత్రులను ఆదుకోండి

### మున్సిపల్ కమిషనర్‌కు సిపిఐ వినతి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేసే సిబ్బందికి ఉచిత వైద్య సహాయం అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్.బాల్‌మల్లేష్ కార్పొరేషన్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డిని కోరారు. సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ్, రొయ్యల కృష్ణమూర్తి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె. సహదేవ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మల నర్సింహులు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.జంగయ్యలతో కల్సి ఆయన గురువారం కమిషనర్ తాజ్ మోహనరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జె.రవి, నరేష్‌లు మల్కారం చౌరాస్తాలో లారీ టిప్పర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిలో చికిత్స పొందుతున్నారన్నారు. పేద కుటుంబాలైన క్షతగాత్రులిద్దరికి ప్రభుత్వం తరపున చికిత్సలందించటంతో పాటు ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు.



# మంత్రి సీతక్కను కలిసిన నల్లమల చెంచులు



**ప్రజాపక్షం/అచ్చంపేట :** నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమలలోతట్టుప్రాంతం అమ్రాబాద్, లింగాల, పదర మండలాల పరిధిలోని ఆదివాసి చెంచులు తమ సమస్యలకొరకై మంత్రి సీతక్కను కలిశారు. ఈసందర్భంగా ఆదివాసి చెంచుగూడెల్లో నెలకొన్న తాగునీరు, వైద్యం, విద్య, వ్యవసాయం, భూమిహక్కు పత్రాలు , శాశ్వతనివాసాలు క్షేత్రస్థాయిలో అటవీఅధికారుల ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులు, రెవెన్యూ అటవీభూములకు ఆర్‌ఓ ఎఫ్‌ఆర్‌ఓ పట్టాలుకాకుండా రెవెన్యూ హక్కు పట్టాలు ఇవ్వాలని వారు కోరారు. అదేవిధంగా వ్యవసాయంచేసుకునేందుకు కాడెద్దులు , విత్తనాలు, ఎరువులు మంజూరుచేయాలని ఇతర విషయాలపై ఆదివాసి సంఘం నాయకులు నివేదించారు. ఈవిషయంపై స్పందించిన మంత్రి సీతక్క జిల్లా డివిజన్‌స్థాయి అధికారులతో ఫోన్లో మాట్లాడుతూ ఆదివాసి గూడెలలో నెలకొన్న సమస్యలపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. మంత్రి సీతక్క ఆదేశాలతో ఆదివాసి గూడెలలోనెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కదిలారు.

**అధికారుల రివ్యూ సమావేశం**

ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశంతో మంగళవారంమిషన్‌భగీరథ, ఉమ్మడి జిల్లా ఎస్‌ఈ వెంకటరమణ , జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్, డిఇ హేమలత, ఏఈ సందీప్, మధు ఆదివాసి పెద్దలు ప్రజాసంఘాల నాయకులతోకలిసి రివ్యూ సమావేశం చేశారు. అమ్రాబాద్ మండలం లింగాల మండలంలోని లోతట్టుప్రాంతంలో ఉన్న 15చెంచుగూడెలలో ఉన్న మంచినీటి సౌకర్యం కలుగుతున్న సమస్యలు వాటిపై చర్చించారు. తదుపరి అమ్రాబాద్ మండలం రాయిలేటిపెంట అధికారులు బుధవారం క్షేత్రస్థాయి పరిశీలనచేసి తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నట్లు గుర్తించారు. చెంచు ప్రాంతాల్లో స్పెషల్‌ఫోకస్ నిఘా పెట్టి అధికారులు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసి తాగునీటి ఇబ్బందులు కలగకుండా అన్నిచర్యలు తీసుకోవాలని సూచించారు. మల్లాపూర్, అప్పాపూర్, వటువర్లపల్లి, సార్లపల్లి, చెంచుపెంటలతోపాటు రాంపూర్‌పెంట, మేడిమొల్కల, తంగిడిగుండాల, కుడిచింతలబైలు పెంటలలో సోలార్‌బోరు మోటారు మరమ్మత్తు చేసి చేతిపంపులు ఏర్పాట్లుచేసేలా తీర్మానించారు. వీటికిగాను రూ.18లక్షలు మంజూరైనట్లు తెలిపారు.



## ఎన్నికల లెక్కింపు కేంద్రాల పరిశీలన

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** పాలమూరు యూనివర్సిటీలో జూన్ 4 వ తేదిన నిర్వహించనున్న మహబూబ్‌నగర్ లోక్‌సభ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.రవి నాయక్, ఎస్పీ హర్ష వర్ధన్‌తో కలిసి గురువారం పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల లెక్కింపు కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూంల ఏర్పాట్లు కళాశాలలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎన్నికల లెక్కింపు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసే గదులను పరిశీలించి, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలిస్తూ, పలు సూచనలు చేశారు. లెక్కింపు టేబుళ్ల కూర్పు, అధికారులు, అభ్యర్థులు ఏజెంట్ల ప్రవేశం, ఈవిఎంల కదలికలపై సూచనలు ఇచ్చారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అన్నారు. సీసీ కెమెరాలు, లైటింగ్, బ్యారికేడ్లు, పార్కింగ్ ఏర్పాట్లు పై సూచనలు చేశారు. అకాడమీ భవనంలో ఏర్పాటు చేయనున్న మీడియా సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కు చేపట్టిన చర్యలు పరిశీలించారు. జనరేటర్ సదుపాయం ఉండాలని, లెక్కింపు ప్రక్రియ భద్రతా చర్యల గురించి ఎస్పీతో కలిసి చర్చించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, అదనపు ఎస్పీ రాములు, డిఎస్పి రమణారావు, ఆర్‌డిఓ నవీన్, పిఆర్ ఈఈ నరేందర్ రెడ్డి, డిపిఆర్‌ఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## అధికారులు అందుబాటులో ఉండాలి

### తాహసీల్దార్ జుబేర్ మొహిద్దీన్



**ప్రజాపక్షం/మల్దకల్:** అధికారులు అందుబాటులో ఉండి ప్రతి పనిని సక్రమంగా సకాలంలో నిర్వహించాలని మండల తాహసిల్దార్ జుబేర్ మోహిద్దీన్ అధికారులకు సూచించారు. గురువారం జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో తాహసిల్దార్ కార్యాలయానికి వచ్చే విద్యార్థులకు సంబంధించిన ప్రతి ఒక్క పనిని త్వరితగతిన పూర్తి చేసి వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఎవరైనా అధికారులు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించి పనులు చేయకపోతే నేరుగా తనను కలిసి సమస్యను తెలపవచ్చని అన్నారు. ప్రతి రోజు అధికారులు కార్యాలయంలో అందుబాటులో ఉండాలని తాహసిల్దార్ జుబేర్ మొహిద్దీన్ సూచించారు.



## రైతులు సింగిల్‌విండో ఓటరు నమోదు చేయించుకోవాలి

**ప్రజాపక్షం/వెల్దండ :** ఉమ్మడి మండలపరిధిలోని ఆయా గ్రామాలలో రైతులు సింగిల్‌విండో ఓటరు నమోదుచేసుకోవాలని సింగిల్‌విండోడైరెక్టర్, కాంగ్రెస్‌సీనియర్ నాయకులు మట్టవెంకటయ్యగౌడ్ కోరారు. ఈసందర్భంగా కొంతమంది రైతులను తన సొంతఖర్చులతో సింగిల్‌విండోలో సభ్యత్వ నమోదును చేయించారు. చాలామంది రైతులకు సింగిల్‌విండోలో ఓటుహక్కు గురించి తెలియక ఓటుహక్కును వినియోగించుకోలేకపోతున్నారని అలాంటి రైతులకు అవగాహన కల్పించి సింగిల్‌విండోలో ఓటరుగా నమోదుచేయించి తన ఉదారత్వాన్ని చాటుకున్నారు.



## గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** జూన్‌9న జరగబోయే గ్రూప్1 పరీక్షకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సంబంధితశాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధశాఖల అధికారులతో మాట్లాడుతూ జూన్‌9న జరగబోయే గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 18గ్రూప్ 1 పరీక్షకేంద్రాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. 5221మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షకేంద్రంలో అభ్యర్థులకుకావాల్సిన కనీస సదుపాయాలను ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు అబ్జెక్టివ్ ప్రశ్నలతో ఓఎంఆర్‌పద్ధతిలో పరీక్ష జరగనుందని, అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి ఉదయం 9గంటలనుంచి అనుమతిస్తామని, అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తమవెంట తీసుకురావొద్దని, బూట్లను ధరించరాదని, పాదరక్షలుమాత్రమే ధరించాలని కోరారు. పరీక్షకేంద్రం చుట్టూ 144సెక్షన్ విధించనున్నట్లు తెలిపారు.



## ఘనంగా రుద్రహోమం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని విద్యానగర్‌కాలనీలో గురువారం భగీరథమహర్షి ఆలయం వద్ద మధ్యాహ్నం సగరమహారుద్రహోమం నిర్వహించారు. ఈ హోమంలో జడ్పివైస్‌చైర్మన్‌బాలాజిసింగ్, కల్వకుర్తి మాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.



## ముగిసిన సంగీతనృత్య శిక్షణశిబిరం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** స్వర్ణభారతి కళానిలయం కల్వకుర్తి 17వవార్షికోత్సవం సందర్భంగా వేసవి సంగీతనృత్యశిక్షణ శిబిరం ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పద్మశ్రీ పురస్కారగ్రహీత హోలియదాసరినారాకొండప్పను ఘనంగా సన్మానించారు. వివిధ కళారంగాలకు చెందిన 14మంది నిష్ణాతులకు రాష్ట్రస్థాయి సేవారత్న పురస్కారాలు అందజేశారు. చిన్నారులు 35రోజులపాటు శిబిరంలో నేర్చుకున్న కూచిపూడి నృత్యం, జానపదనృత్యం, పాశ్చాత్యనృత్యాలను ప్రదర్శించి లలిత, జానపద సంగీతానికి సంబంధించిన పాటలనుపాడారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఎల్‌ఎ కసిరెడ్డి నారాయణరెడ్డి, బాలాజిసింగ్‌ఠాగూర్, ఎడ్మమాధవరెడ్డి, మున్సిపల్‌చైర్మన్ ఎడ్మసత్యం,వైస్‌చైర్మన్ షాహిద్, డాక్టర్‌జగన్, సంగీత దర్శకులు పాడుతాతీయగాఫేంటీమ్ రాజబాబు, మాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మాజీ జడ్పిటిసి బాలస్వామి, మాజీమార్కెట్‌కమిటిచైర్మన్ విజయ్‌గౌడ్, పాపిశెట్టిరాము, బుచ్చయ్య,సంస్థ వ్యవస్థాపకులు నారోజుమోహన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఎ కసిరెడ్డినారాయణరెడ్డి మాట్లాడుతూ 17సంవత్సరాల కళాప్రస్థానంలో కొన్నివేలమందికి కళల్లో శిక్షణనిచ్చి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయవేదికలపై ప్రదర్శనలివ్వటం గొప్ప విషయమని, భవిష్యత్తులో సంస్థకు అన్నిరకాలుగా సహాయ సహకారాలందిస్తామని హామీ ఇచ్చారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.



## పాఠశాల పనులను పర్యవేక్షించిన కలెక్టర్

**ప్రజాపక్షం / పెబ్బేరు :** అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా ప్రభుత్వ బడుల్లో చేపట్టిన మరమ్మత్తు పనులు పాఠశాలల పునః ప్రారంభం లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం పెబ్బేరు మండల పరిధిలో గుమ్మడం, యాపర్ల, గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్ని వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పనుల నిర్వహణలో ఎక్కడా అలసత్వానికి తావివ్వకూడదని తెలిపారు. తాగునీటి వసతి, వంట గది, మరుగుదొడ్లు సహ అన్ని పక్కాగా ఉండేలా మరమ్మత్తులకు చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా యాపర్ల గ్రామంలో రైతులతో మాట్లాడిన కలెక్టర్ ఎరువులు, విత్తనాల విషయంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. యాపర్ల అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ రికార్డులను పరిశీలించారు. గుడ్లు, పాలు తదితర సామాగ్రి నిల్వలను పరిశీలించారు. పంచాయతీ రాజ్ కార్య నిర్వాహక ఇంజనీర్ మల్లయ్య, పెబ్బేరు తహసీల్దార్ లక్ష్మి , ఇంజనీరింగ్ అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** వనపర్తి జిల్లాలో జూన్ 2న జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పకడ్బందిగా ఉండాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం. నగేష్ అధికారులను సూచించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం అదనపు కలెక్టర్ ఎం. నగేష్ చాంబర్‌లో సంబంధిత అధికారులతో ఆవిర్భావ దినోత్సవ వేడుకల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. అధికారులకు అప్పగించిన బాధ్యతలు నిబద్ధతతో పూర్తి చేయాలని ఏర్పాట్లలో ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలని సూచించారు.

## ఎన్నికల ఓట్ల లెక్కింపులో విధులు కేటాయించిన ఉద్యోగులు బాధ్యతలు జాగ్రత్తగా నిర్వహించాలి

**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** జూన్ 4న నాగర్‌కర్నూల్ మార్కెట్ యార్డులో జరిగే పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో విధులు కేటాయించిన ఉద్యోగులు తమ బాధ్యతలను జాగ్రత్తగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం. నగేష్ తహసీల్దార్ , ఉప తహసీల్దార్లను ఆదేశించారు. గురువారం ఉదయం ఐడిఓసి సమావేశ మందిరంలో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ, సలహాలు, సూచనలు ఇచ్చారు. అప్పగించిన బాధ్యతలు నిబద్ధతతో పూర్తి చేయాలని ఆలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్డీఓ పద్మావతి, తహసీల్దార్లు రమేష్‌రెడ్డి, ఆర్. పాండు నాయక్ , శ్రీనివాస్ , మదన్ మోహన్ , ఉప తహసీల్దార్లు , ఇతర సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నాసిరకంగా పనులు చేస్తే చర్యలు తప్పవు

**ప్రజాపక్షం / చిన్నంబావి :** మండల పరిధిలోని చిన్నమారూర్ కొప్పునూరుర్ వెల్టూరు గ్రామాలలో అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికైన పాఠశాలలో జరుగుతున్న పనులను గురువారం వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్ని వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ బడులను అభివృద్ధి పర్చేందుకు నిధులు కేటాయించిందని , కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమణరావు, తహసీల్దార్ ఇక్బాల్ , డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ , వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** జూన్ 9న జరిగే గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షను వనపర్తి జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. గురువారం ఉదయం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రూప్ 1 పరీక్షల నిర్వహణ సన్నద్ధతపై అధికారులతో వెబ్ ఎక్స్ మీటింగ్ నిర్వహించారు. వనపర్తి జిల్లాలో 4843 మంది అభ్యర్థులు గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష రాయనున్నారు. 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సిసి టివి కెమెరాలు పెట్టాలని సూచించారు 144 సెక్షన్ అమలు, జిరాక్స్ కేంద్రాల మూసివేత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు 10 గంటల లోపు పరీక్ష కేంద్రాన్ని చేరుకోవాలని ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన అనుమతించడం జరగదన్నారు. ఉదయం 9.30 నుండి బయో మెట్రిక్ హాజరు తీసుకోవడం జరుగుతుందని అభ్యర్థులు ప్రతి ఒక్కరు బయోమెట్రిక్ హాజరు నమోదు చేసుకోవాలని తెలిపారు. జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్య పోరాటాల రథసారథి సిఐటియు




**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట కార్మికుల ఐక్య పోరాటాల రథసారథి సిఐటియూ 54వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని గురువారం కొత్తకోట మండల కేంద్రంలో హమాలి కార్మిక సంఘం అధ్యక్షులు కురుమన్న జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ 1970 మే 30న పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కలకత్తా నగరంలో ఐక్య పోరాటం అనే నినాదంతో సిఐటియూ ఏర్పడిందని ఆయన చెప్పారు. బీజేపీ ప్రభుత్వంలో కార్మిక హక్కులపై దాడి పెరిగిందని , 44 కేంద్రా కార్మిక చట్టాలలో 29 చట్టాలను రద్దు చేసిందని నాలుగు లేబర్ కోడులను తీసుకొచ్చిందని ఆయన ఆరోపించారు. అసంఘటిత రంగంలో పని చేసే భవన నిర్మాణ కార్మికులు ప్రైవేట్ , ట్రాన్స్పోర్ట్ హమాలిలతో పాటు బీడీ చేనేత పవర్ లూమ్ కార్మికుల సంక్షేమం కోసం ఉన్న అనేక స్కీంలు బీమా పథకాలు రద్దు చేసిందని వివరించారు. అంగన్‌వాడీ మధ్యాహ్నం భోజనం ఉపాధి హామీ నేషనల్ హెల్త్ మిషన్ సర్వ శిక్ష అభియాన్ రంగాలకు కేంద్ర బడ్జెట్‌లో కోతలు విధించింది. ఫలితంగా రాష్ట్రంలోని అంగన్‌వాడీ ఆశలు ఏఎన్‌ఎంలు మధ్యాహ్న భోజన కార్మికులు ఎన్‌హెచ్‌ఎం ఫీల్డ్ అసిస్టెంట్లు ఐకేపివిఓఏ తదితరులను కార్మికులుగా గుర్తించడం లేదు. వేతనాలు పెంచలేదని, ఆర్టీసీ మనుగడకే ప్రమాదకరమైన మోటార్ వాహన చట్టానికి సవరణ చట్టం చేసింది ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ నెల్లూరి కురుమన్న కె. వెంకటయ్య, మల్లేష్ , రమేష్ , రాములు, మహేశ్, తిరుపతన్న, విజయ్ , ఆంజనేయులు, వెంకటన్న, తిమ్మన్న, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర దశాబ్ది వేడుకలకు ఏర్పాట్లు

### అదనపు కలెక్టర్ సీతారామారావు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** జూన్‌2వతేదిన తెలంగాణరాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయాల సముదాయంలోని విసి సమావేశమందిరంలో తెలంగాణరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సన్నద్ధతపై అన్నిశాఖల జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. వేడుకల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్‌వారికి సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ ఆదేశాలప్రకారం తెలంగాణ అవతరణ దినోత్సవ దశాబ్ది వేడుకలని నాగర్‌కర్నూల్ పోలీస్‌పరేడ్‌గ్రౌండ్‌లో జూన్ 2వతేదిన ఉదయం 9గంటలకు జాతీయ పతాక ఆవిష్కరణ జరుగుతుందని, ఇట్టి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమాలను ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జాతీయ పతాకావిష్కరణ జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్ చేయనున్నట్లు చెప్పారు. అమరవీరులస్థూపానికి నివాళులర్పించి పతాకావిష్కరణ అనంతరం కలెక్టర్ సందేశం అనంతరం కార్యక్రమం ముగుస్తుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం ఉదయం 9గంటలలోపే జాతీయ పతాకాన్ని ఆవిష్కరణ చేయాలని చెప్పారు. మండల కార్యాలయాల్లో , గ్రామ పంచాయతీల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, సిసెక్షన్ సూపరింటెండెంట్ ఆలీ, అన్నిశాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## బియ్యం గోదాం తనిఖీ



**ప్రజాపక్షం/అచ్చంపేట :** పట్టణంలోని బియ్యంస్టాక్‌పాయింట్‌ను గురువారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీచేశారు. రేషన్‌షాపుకు సరఫరాచేసే బియ్యం గోదాంలో నిల్వ ఉన్న బియ్యాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. 200లకుపైగా బస్తాలకుపైగా తేడాలున్నట్లు అధికారులు గుర్తించారు. అనంతరం పంచనామాచేసి గోదాం సీజ్‌చేశారు.

## ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ నెల్లికొండ వ్యవసాయ మార్కెట్‌యార్డులో జూన్‌4వతేదిన జరగనున్న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అలంపూర్, గద్వాల, వనపర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్లలెక్కింపు కేంద్రాలను రిటర్నింగ్ అధికారి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పిఉదయ్‌కుమార్, వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవర్‌లు పరిశీలించారు. గురువారం సాయంత్రం స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ ఏర్పాట్లను ఆయన చూశారు. ఈసందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతపై పోలీస్ అధికారులతో చర్చించారు. స్ట్రాంగ్‌రూమ్‌లవద్ద నిరంతర నిఘా కొనసాగించాలన్నారు. ఇతరులు లోపలికి రాకుండా తనిఖీలుచేయాలని సూచించారు. నియోజకవర్గాలవారిగా కౌంటింగ్ నిర్వహించేందుకు నియోజకవర్గాలవారిగా నియోజకవర్గానికి 14టేబుల్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్‌వెంట వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల అదనపు కలెక్టర్లు పలువురు అధికారులు ఉన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

**ప్రజాపక్షం/వంగూర్ :** నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయఅధికారిణి తనుజరాజ్ అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభంకావడంతో అన్నదాతలు వ్యవసాయశాఖసిబ్బంది సూచనలమేరకు నాణ్యమైన విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. ఫర్టిలైజర్‌షాపులలో విక్రయించిన ప్రతి వస్తువులపై రశీదు తీసుకోవాలని రైతులను కోరారు. ఎవరైన నకిలీమందులు, నకిలీ విత్తనాలు విక్రయించినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె దుకాణదారులను హెచ్చరించారు.



## ఆర్థికసాయం అందజేత

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** పెద్దకొత్తపల్లి మండలం మహాసముద్రంగ్రామానికి చెందిన నల్లపోతులచిన్నరాముడు గతకొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న బిజెపి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు, బిజెపి కొల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఎల్లేనిసుధాకర్‌రావు కేర్ ఆస్పత్రికి వెళ్లి రాముడు మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ఆర్థికసాయాన్ని అందజేశారు. బిజెపిపార్టీ అన్నివేళలలా అండగా ఉంటుందని సుధాకర్‌రావు రాముని కుటుంబసభ్యులకు భరోసానిచ్చారు.



## ఆర్‌ఎస్‌పిని కలిసిన వెల్దండనేతలు

**ప్రజాపక్షం/వెల్దండ :** బిఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపి అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను వెల్దండ మండలానికిచెందిన ఆపార్టీ నేతలు గురువారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపుపై వారు ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల ప్రచారంలో కష్టపడి పనిచేసిన విషయాన్ని ఆయనతోప్రస్తావించారు. జూన్ 4న వెలువడే ఫలితాల్లో విజయ ఢంకా మోగిస్తామని, మరోసారి గులాబీజెండా ఎగరవేస్తామని అన్నారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. ఇప్పటినుంచే సర్పంచ్ ఎన్నికలకు సిద్ధంకావాలని డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తనను కలిసిన నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఆర్‌ఎస్‌పిని కలిసినవారిలో వెల్దండ మాజీ ఎంపిపి పుట్టరాంరెడ్డి, మాజీవైస్ ఎంపిపి ఐజాక్, జంగిలినిరంజన్, బొల్లంపల్లి సర్పంచ్ తిరుమల్‌రావు, నాయకులు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్, చొక్కన్నపల్లి డీలర్‌జంగయ్య, ఉపసర్పంచ్ నిరంజన్, నర్సింహ్మముదిరాజ్, జంగయ్య, పోలే అశోక్, జోగురవి, జంగిలిప్రసాద్ పాల్గొన్నారు.

## గర్భిణులకు ఉచిత అల్ట్రా సౌండ్ స్కానింగ్ సేవలు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** గర్భిణులకు ఉచిత అల్ట్రా సైండ్ సేవలం దించేందుకు ఉప్పల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అల్ట్రా సౌండ్ ఏర్పాటు చేసామని మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి తెలిపారు. ప్రతి బుధ, శుక్ర, శనివారాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని, అవసరమైన వారు విని యోగించుకోవాలని ఆయన కోరారు. గురువారం ఆయన జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.పద్మావతి, ప్రోగ్రామ్ ఆఫీసర్ మినీ హబ్స్ డాక్టర్ పుష్పాంజలి, రేడియాలజిస్టు డాక్టర్ సౌందర్య లతలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్‌ను ప్రారంభించారు.



## నేడు కొంపల్లిలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ప్రజాపక్షం/పేట్ బషీరాబాద్:** ఈ క్రింది ఫీడర్ల నిర్వహణ కోసం మరియు చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం రోజున అంటే 31/05/2024 నాడు క్రింది ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం. 11 కెవి జి.బి.ఆర్ ఫీడర్ 11.00 నుండి 12.30 గంటల వరకు 33/11 కెవి పెట్ బషీర్ బాగ్ ఎస్ఎస్ సరఫరా ప్రభావిత ప్రాంతం నుండి వెలువడుతుంది. పిఎస్ఆర్ సమావేశ రహదారి, రిలెన్స్ పెట్రోల్ బంక్, సయ్యద్ నగర్, ప్రదైజ్ రోడ్, టొబాకో కంపెనీ రోడ్, జిబిఆర్ కల్చరల్ క్లబ్ వరకు విద్యుత్ నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ కు సహకరించాలని ఏ ఈ వినాయక్ రాథోడ్ తెలిపారు.

## చెవెళ్ళ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురేస్తాం

### కోట్‌పల్లి మండల పార్టీ అధ్యక్షులు నర్సింగ్ నాయక్



**కోట్‌పల్లి /ప్రజాపక్ష్యం :** త్వరలోనే జరిగే పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా చెవెళ్ళ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేయడం జరిగిందని కోట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింగ్ నాయక్ అన్నారు. మంగళవారం కోట్‌పల్లి మండలంలోని కంకణాలపల్లి, మల్ శేట్‌పల్లి తండాలలో గడపగడపకు కాంగ్రెస్ ప్రచారాన్ని నిర్వహించే కార్యక్రమానికి చెవెళ్ళ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి తనయుడు సిద్ధార్థ్‌రెడ్డి హాజరై ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత ఆసెంబ్లీ ఎన్నికల్లో మా గ్రామం నుండి ప్రతి కార్యకర్త కష్టపడి భారీ మోజార్టీని ఇవ్వడం జరిగిందని, త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో చెవెళ్ళ ఎంపీ బరిలో నిలచిన అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మోజార్టీ ఇస్తామని అన్నారు. గతంలో మా గ్రామం నుండి ఇచ్చిన మోజార్టీతో మా గ్రామానికి నిధులను అందించడం వల్లె నేడు మా గ్రామంలో గల్లీ గల్లీలో సీసీ రోడ్లను వేసుకున్నామని అన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో మా వంతు మోజార్టీని ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాము నాయక్, రమేష్ నాయక్, రాజెందర్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి , అంజయ్య తదితరులున్నారు.

## బోడుప్పల్ మేయర్, డిప్యూటీ మేయర్‌లపై

# అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు స్టే

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మేడ్చల్ జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటి మేయర్‌లపై జూన్ 6న జరుగనున్న అవిశ్వాస తీర్మానంపై రాష్ట్ర హైకోర్టు స్టే మంజూరు చేసింది. దీంతో అవిశ్వాస తీర్మానంపై తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో 21 మంది కార్పొరేటర్లు కల్సి ఈ నెల 17న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన నోటీసులు అందించారు. దీంతో జూన్ ఆరున అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌కు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మేయర్, డిప్యూటి మేయర్‌లు అవిశ్వాస తీర్మానంపై హైకోర్టుకు ఆశ్రయించారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన మేయర్ శ్యామల బుచ్చిరెడ్డి, డిప్యూటి మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్‌లపై మాజీ శాసనసభ్యుడు మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు తదితర పార్టీ నేతలు 21 మంది కార్పొరేటర్లతో కల్సిఅవిశ్వాస తీర్మాన నోటీసునుఅందించిన విషయం విదితమే.



## రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

### జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి/పరిగి :** వికారాబాద్ జిల్లా పరిధిలోని పరిగి నియోజకవర్గంలోని కల్కుచర్ల మండల పరిధిలోని ముజామిత్‌పూర్ కుసుమ సముద్రం గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడూతూ రైతులు పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధరను చెల్లిస్తూ వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు త్వరితగతిన చేరవేయాలని సూచించారు. రైతులు సహకరించినట్లుయితే కొనుగోలు కేంద్రాలకు వచ్చి ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు తొందరలో చేరవేయవచ్చుని అయాన అన్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని పిపిసి ఇన్చార్జిలకు ఆయన సూచించారు. జిల్లాలో 38వేల మెట్రిక్ ఆన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని అయాన అన్నారు. ఇప్పటికి 90శాతం ఆన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారాసేకరించడం జరిగిందని ధాన్యం కొనుగోలు తుది దశకు చేరుకుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్ ,మండల తహసిల్దార్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మురుగు కాలువను పరిశుభ్రం చేయాలి



**ప్రజాపక్షం/నవాబుపేట్:** మండల కేంద్రంలోని మీసేవ దగ్గర మురుగు కాలువ సరైన విధానం లేక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని మండల కేంద్రంలోని గ్రామస్తులు తెలిపారు. స్థానిక గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని వికారాబాద్ నుంచి శంకర్పల్లి వెళ్లే మెయిన్ రోడ్ ప్రక్కనే ఉన్నటువంటి ఈ మురుగు కాలువను పరిశుభ్రము చేయాలన్న కష్టమైన పనిని తెలిపారు. ఎందుకంటే ఈ కాలువ వెడల్పు ఎక్కువగా ఉండి లోతు ఎక్కువగా ఉన్నందున పనిచేసే వారికి కూడా చాలా ఇబ్బందికరంగా ఉంటుందని తెలిపారు. ఈ కాలువలో ప్రవహించే మురుగునీరు స్థిరంగా ఉండటం వల్ల చెత్తాచెదారం ఉండటం వల్ల దోమలు ఎక్కువై రాత్రి సమయంలో ఇళ్లల్లోకి వస్తున్నాయని తెలిపారు. అలాగే ఆ రోడ్డు వెంబడి నడుస్తున్న వారికి మురుగు కాలువ చోటికి వచ్చిన సమయంలో దుర్వాసన వస్తుందని తెలిపారు. కాబట్టి సంబంధిత అధికారులు మురుగు కాలువ పైన ప్రత్యేక శ్రద్ధ వహించి ఒక మురుగు కాలువను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న చెత్త చెదారమును కూడా తొలగించి పరిశుభ్రపరచాలని తెలిపారు. మండల కేంద్రంలోని ఈ విధమైన పరిస్థితి ఉంటే మరి మిగతా గ్రామాల పరిస్థితి ఏ విధంగా ఉందో వాటిని కూడా సంబంధిత అధికారులు పరిశీలించవలసిన అవసరం ఉందని తెలిపారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :**మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడలో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని అలియాబాద్ విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గంగూడలోని నిక్‌మార్ కళాశాల, అల్ఫామెడ్ కంపెని,హెరిటేజ్, కీర్తి ఫ్యాక్టరీ, సొంజెంటా కంపెని, వ్యవసాయ కనెక్షన్‌లకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతారాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు ఇట్టి విషయాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ శాఖకు సహకరించగలరని ఆ ప్రకటనలో కోరారు.

## నేటి నుంచి శ్రీవిష్ణు శివాలయ దేవస్థానం బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలోని అక్కన్న మాదన్నలచే నిర్మాణం కాబడిన అతి పురాతణమైన శ్రీ విష్ణు శ్రీ శివాలయ దేవస్థానం 38వ కల్యాణ మహోత్సవ బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు దేవస్థాన ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపా రు. 31న సుప్రభాత సేవతో గోపూజ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవనం, ధ్వజారోహణం, మంతపారాధాన, నాదస్వర గోష్టి, స్వామి వార్లకు అ భిషేకం, అలంకరణం, హారతి, తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. 1న శ్రీ వీరాంజనేయ స్వామి వారికి సింధూర అభిషేకం, అక్కడ నుంచి ఎదుర్కొలుగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి, శ్రీ భవాని రామలింగేశ్వర స్వామిని ఆలయం వరకు ఊరేగించిన అనంతరం దివ్య కల్యాణోత్సవములు, అన్న ప్రసాద వితరణ, దివ్య రథోత్సవం (ఊరేగింపు) కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 2న మూలమంత్ర హవనం, సుదర్శన హోమం, రుద్రహవనం, బలి హరణం, మహాపూర్ణాహుతి, మహాదాశీర్వచనం, రుత్విక్ సన్మానం, తీర్థప్రసాద వితరణ, అన్నదానం ఉంటుందని తెలిపారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాలను జయప్రదం చేయుటకు గ్రామప్రజలు,చుట్టు పక్కల పరిసరాల భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి



**ప్రజాపక్షం/పేట్ బషీరాబాద్:** భవనం పై నుండి కింద పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దూలపల్లి క్రిష్ణానగర్ కా లనీకి చెందిన రేగడి రాము (26) గత దూలపల్లి పా రిశ్రామికవాడలో రాయల్ అగ్రిలైఫ్ సెన్సెస్ కంపెని లో పని చేస్తున్నాడు. ఇంటి నుండి కంపెనికి రోజు నడుచుకుంటూ వచ్చిపోవాలంటే ఇబ్బంది అవుతుందని గత మూడు నెలల కిందట నుండి వర్కర్ల కోసం కంపెని నిర్వాహకులు అదే ప్రాంతంలో కిరాయికి తీసుకున్న ఓ భవనం మొదటి అంతస్తులో బీహర్కు చెందిన కార్మికులతో కలిసి ఉంటున్నాడు. 26న ఆదివారం రాత్రి రాము రూంలో ఉన్న ఇద్దరితో పాటు అదే ప్రాంతంలో ఉన్న మరో నలుగురు కార్మికులు మొత్తం ఏడుగురు కలిసి మద్యం సేవించారు. పైగా బిల్డింగ్పై పడుకున్న తర్వాత ఫోన్ మాట్లాడుకుంటూ పక్కన ఉన్న రేకుల షెడ్డుపై పడడంతో తీవ్రగాయాలై మల్లారెడ్డి చికిత్స నిమిత్తం మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 29న రాత్రి 11:05 నిమిషాలకు మృతి చెందిన్నట్లు అక్కడి వైద్యులు తెలిపారు. మృతు డి బంధువులు ఇచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఐక్యత పోరాటంతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట:** కార్మికుల సమస్యలు ఐక్యత పోరాటముతోనే పరిష్కారం అవుతాయని సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. గురువారం సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జీడిమెట్ల పారిశ్రామిక వాడ ప్రాంతంలో షాపూర్ నగర్ రైతు బజార్ ముందు సిఐటియు జండాను మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1970 మే 30వ తారీఖున భా రతదేశంలో ఐక్యత పోరాటం అనే నినాదంతో సిఐటియు ఆవిర్భవించిందని నాటి నుండి నేటి వరకు దేశంలో ఉన్నటువంటి అన్ని రకాల అన్ని రంగాల కార్మికుల ఉద్యోగు ల సమస్యల పరిష్కారం కోసం హక్కుల కోసం పోరాటం చేస్తూ పాలక ప్రభుత్వాలు చేస్తున్నటువంటి కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ దేశంలో ఉన్న వివిధ కా ర్మిక సంఘాలతో కలిసి ఐక్య ఉద్యమాలు చేస్తూ పని గం టల అమలు కోసం కనీస వేతనాలు ఇవ్వాలని ఇఎస్ఐ పిఎఫ్ బోనస్ సౌకర్యం కల్పించాలని యాజమాన్యాలపై ఒత్తిడి తెస్తూ దేశంలో ఉన్న 40 కోట్ల మంది అసంఘటిత రంగా కార్మికులకు సామాజిక భద్రత కల్పించి సమగ్ర చట్టం చేయాలని 60 సంవత్సరాలు పైబడిన అసంఘటితరంగా కార్మికులకు కనీసం 5 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని పోరాటాలు నిర్వహిస్తూ, రాష్ట్రవ్యాప్త రంగాల్లో పనిచేస్తున్న ఆశ అంగన్వాడి మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేసి పర్మినెంట్ చేయాలని ఎ న్నో ఉద్యమాలు పోరాటాలు చేసిన పాలిస్తున్న ప్రభుత్వా లు ఏళ్లు గడిచినా కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదని పాలక ప్రభుత్వాలలో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చిన కండువా జెండా మారుతుంది. తప్ప పరిపా లనలో వాళ్లే భాగస్వామ్యం అవుతున్నారని కార్మికుల, పేదల, ఓట్లతో గెలిచి యజమానులకు పెద్ద పెద్ద కార్పోరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నారే తప్ప పేదలకు కార్మికులకు ఏళ్లు గడిచిన ఏమి వరగడం లేదని హక్కులను కాలరాశి కార్మికులను కట్టు బానిసల్లాగా మార్చే ప్రక్రియ ప్రారంభమైందని కార్మికులందరూ ఐక్యంగా ఉండి పోరాడి సాధించుకున్న హక్కులను, చట్టాలను కాపాడుకోవాలని అన్నారు. సిఐటియు మండల కమిటీ సభ్యులు ఈ దేవదానం పసుల అంజయ్య బి.సత్యం, కరుణాకర్, కె.శీను, మల్లారెడ్డి, బీరయ్య, తిమ్మప్ప, నర్సింలు, కనకయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలలను బలోపేతం చేయాలి

### మండల ప్రత్యేక అధికారి డి.గోపాల్



**ప్రజాపక్షం/నవాబుపేట్:** మండల కేంద్రంలో గురువారం రైతు వేదికలో నిర్వహించిన అమ్మ ఆద ర్శ పాఠశాలల పనుల కోసం అదేవిధంగా గ్రామాలలోని ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభు త్వ పాఠశాలలోకి వచ్చేందుకు ప్రతి గ్రామంలో అవగాహన కల్పించిన కోసం కార్యక్రమాన్ని ఏ ర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నవాబుపేట్ మండల ప్రత్యేక అధికారి డి.గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల లో గ్రామాలలోని తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు గ్రామపంచాయతీ కార్యదర్శులు టీచర్లు వి వోలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొని అవగాహన కల్పించవలసిన బాధ్యత మనందరిపైన ఉన్నదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలకు తేడా కూడా వర్ణించవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలు ఇంతకుముందులా కాకుండా ఇప్పుడు ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్చడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచినీరు, మరుగుదొడ్లు, కరెంటు సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ పనులన్నీ ఒకటవ తారీకు లోపు పూర్తి కావాలని తెలిపారు. ప్రభుత్వ పనులని తూతూ మంత్రంగా కాకుండా ఇచ్చిన ఇన్సక్షన్ ప్రకారం తెలిపిన మెటీరియల్ మాత్రమే వాడాలన్నారు. గ్రామాలలో ఉండే విఏఎలు సరైన విధంగా నిర్మిస్తున్నారా లేదా అని కూడా పరిశీలించండి అని తెలిపారు. ఏ స్కూల్లో అయితే సమస్యలు ఉంటాయో అక్కడ ప్రత్యేకమైన మీటింగ్లో పెట్టి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మీటింగ్లకు గ్రామపంచాయతీ కార్యదర్శులు అంగన్‌వాడిలో ఉన్న టీచర్లు కూడా సహకరించాలన్నారు. జూన్12 లోపు అమ్మ ఆదర్శ పాఠశాలలు కొత్త పాఠశాలలుగా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపిడిఒ అజయ్ కుమార్, ఎఒ ప్రసన్నలక్ష్మి, ఎపిఎం మం జులవాణి, ఎంఇఒ గోపాల్, నోడల్ ఆఫీసర్ అబ్దుల్ రహీం, హెచ్ ఎం శివకుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వివోఏలు టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/యాచారం:** యాచారం మండల కేంద్రంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సిఐటియు జెండాను ఆవిష్కరించారు.ఈసంధర్భంగా సిఐటియు జిల్లా సహయ కార్యదర్శి పెండ్యాల బ్రహ్మయ్య మాట్లాడుతూ యాచారం, మాల్ కేంద్రంలో సిఐటియు జెండాను అవిష్కరించామని తెలిపారు. సిఐటియు సంఘం ఎర్పడి 54 వ సంవత్సరంలోకి అడుగు పెడుతుందని అన్నారు. కార్మికుల హక్కుల సాధనలో సిఐటియు ముందుండి పోరాటం నిర్వహిస్తుందని అన్నారు. కార్మిక, కర్షక హక్కులను కాపాడుతుందని తెలిపారు.కార్మిక చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని పెర్కొన్నారు. కార్మిక చట్టాలు తెలియక కార్మికులు ఎంతగానో నష్టపోతున్నారని అవేధన వ్యక్తం చేశారు.. సిఐటియు మండల కన్వినర్ చందునాయక్,కార్మికులు సోమయ్య, సత్యనారాయణ, రాములు లింగమ్మ, నర్సమ్మ, సుగుణ,మంజుల, యా దమ్మ, వెంకటేశ్, యాదయ్య, చంద్రయ్య, రాముునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాకు గురవుతున్న స్నానాల గది

### పశువుల పాకగా మారిన వైనం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మండల కేంద్రంలో శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన స్నానాల గది పశువుల పాకగా మార్చారని శామీర్‌పేట మండల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శామీర్‌పేటలోని కెవిఎల్‌ఆర్ కళాశాలకు సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో యా దవులు, వడ్డెర, ముదిరాజ్, పద్మశాలీ, లంబాడి కులస్థులకు కలిపి శ్మశాన వాటికను ఏర్పాటు చేశారు. అంత్యక్రియల అనంతరం స్నానాలు చేయడానికి పురుషులకు, స్త్రీలకు స్నానాల గదిని గత ప్రభుత్వ హాయాంలో ఏర్పాటు చేశారు. ఇటీవల ఓ కులానికి చెందిన వారి అంత్యక్రియల అనంతరం స్నానాలు చేయడానికి గదికి వెళితే ఆ గదిలో పశువులు తినడానికి గడ్డి కట్‌చేసే మిషన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో స్నానాలు చేయడానికి మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన స్నానాల గదిని కబ్జా చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్నానాల గదిని కబ్జాకు గురికాకుండా కాపాడాలని లేకుంటే పెద్ద ఎత్తున దర్నాలు చేపడుతామని గ్రామస్థులు హెచ్చరించారు. స్పందించిన శామీర్‌పేట గ్రామ కార్యదర్శి మౌనిక స్నానాల గదిని పరిశీలించారు. గడ్డితో నిండి ఉన్న గదిని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ గదిని ఖాళీ చేయించాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గది బయట నోటీసును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మౌనిక, బిల్ కలెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఓ వరం

### మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** సిఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక భారంతో సతమతమవుతూ వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఓ వరం అని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. గౌతం నగర్ డివిజన్ పరిధిలోని సంజయ్‌నగర్ ప్రాంతానికి చెందిన వేణుమాధవ్ గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ వైద్యులకు చూపించుకోగా శస్త్ర చికిత్సలకు భారీ మొత్తంలో ఖర్చు అవుతుందని తెలిపారు. చిన్నా చితకా పనులతో కుటుంబాన్ని పోషించుకొనే అతడి వైద్యం కోసం ఇబ్బందులు తలెత్తడటంతో ఆర్థిక సాయం కోసం మాజీ ఎమ్మెల్యేను సంప్రదించి సిఎం రిలీఫ్ ఫండ్ కోసం ధరఖాస్తు చేసుకొన్నాడు. ఈ మేరకు అతడి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రెండున్నర రూపాయల చెక్కును జిఎన్‌వి సతీష్ కుమార్, శ్రీరామ్, నవీన్ తదితరుల సమక్షంలో అతడికి ఎమ్మెల్యే అందించారు. మల్కాజిగిరి ప్రాంతంలో నివసించే ప్రజలు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం కోసం తనను సంప్రదించాలని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరారు.

## ఉపాధి పనులను వేగవంతం చేయాలి

### గడ్డమల్లాయగూడ గ్రామంలో ఉపాధి పనుల పరిశీలన



**ప్రజాపక్షం/యాచారం :** వర్షాకాలం రానున్నందున తక్షణమే ఉపాధి పనులను వేగవంతం చేయాలని జిల్లా డి ఆర్ డిఒ ప్రాజెక్ట్ అధికారి శ్రీలత అన్నారు. గురువారం యాచారం మండల పరిధిలోని గడ్డమల్లాయగూడ గ్రామంలో ఉపాధి పథకంలో చేస్తున్న పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహత్మాగాంధీ జాతీయ గ్రామిణా ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న పనులు నాణ్యంగా ఉండాలని తెలిపారు. కొలతల్లో ఎలాంటి తెడా రాకుండా చూడాలన్నారు. కూలీలు చేసిన పనులకు తక్షణమే కూలీ డబ్బులు చెల్లించాలని కోరారు. పని అడిగిన ప్రతి కూలీకి పని చూయించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఇంకుడు గుంతలు ఫాం పాండ్స్ గుంతలను తియించుకోవాలని అన్నారు. వన నర్సరీ కింద నాటిన మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తిసుకోవాలని అన్నారు. వచ్చే వర్షాకాలం సిజన్‌లో మొక్కలు నాటేందుకు తగిన చర్యలు తిసుకోవాలని అన్నారు. అందుకోసం అన్ని ఎర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఉపాధి సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని అన్నారు.అందరు కలిసి కట్టుగా పనిచేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఎపిడి సక్రియా, ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి,ఎపిఒ లింగయ్య, ఉపాధి సిబ్బంది పాల్గోన్నారు.

## పాఠశాలల్లో అభివృద్ధి పనుల పరిశీలన



**ప్రజాపక్షం/యాచారం :** అమ్మ ఆదర్శ పాఠశాలల్లో విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు అన్నారు. గురువారం యాచారం మండల పరిధిలోని గడ్డమల్లాయగూడ గ్రామంలోని ఎంపియు పిఎస్, ఎంపి పిఎస్ మాల్ మార్కెటు పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల చదువు కోసం ప్ర భుత్వం పెద్దపిట వేస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు విశేషంగా కృషి చేస్తుందని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను త్వరగా వేగవంతం చేయాలని కోరారు. పనుల విషయంలో ఎక్కడా అలసత్వం ప్రదర్శించకుండా నాణ్యత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. పాఠశాలలను యుద్ధ ప్రాతి పా దికన అభివృద్ధి చేయడానికి తమ వంతుగా కృషి చేస్తున్నామని అన్నారు. గడ్డమల్లాయగూడ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ జగన్నాథం, మాల్ మాలర్కేటు ప్రధానోపాధ్యాయులు శ్రీలత పాల్గొన్నారు.

## జూన్ 3 నుంచి 19 వరకు బడిబాట

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా జూన్ 3 నుండి 19 వరకు బడిబాట నిర్వహిస్తున్నామని మేడ్చల్ జిల్లా విద్యా శాఖ అధికారి విజయకుమారి తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రణాళిక ప్రకారం బడిబాట చేపట్టాలని ఆమె కోరారు. జూన్ మూడున గ్రామ స్థాయి సమావేశాలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించటం, నాలుగున గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శించి ఆయా ఇళ్లల్లో చదువుకొనే పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం కల్పించి గ్రామ స్థాయి రిజిస్టర్లలో పేర్లను నమోదు చేయించటం, 5 నుండి 10 వరకు గడప గడపకు వెళ్లటం, అంగన్వాడీ సెంటర్లలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించటం,బడిబాటపై కరపత్రాలు, బ్యానర్లు పంచటం చేయటం, 11న గ్రామ సభలు నిర్వహిస్తూ బడిబాట కార్యక్రమాన్ని సమీక్షించటం, 12న పాఠశాలల సుందరీకరణ చేస్తూ పండుగ వాతావరణం కల్పించటం, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించటం, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ చేయటం, 13న పుస్తక పఠనం, 14న సామూహిక అక్షరాభ్యాసం, బాల సభలు ఏర్పాటు చేయటం, 15న అంగ వైకల్యం కల్గిన విద్యార్థులకు భవిత సెంటర్లల్లో చేర్పించటం, 18న డిజిటలైజేషన్‌పై అవగాహన కల్పించటం, మొక్కలు నాటించటం, 19న క్రీడా దినాన్ని నిర్వహించటం చేయాలని విద్యా శాఖ అధికారి తెలిపారు.

## క్రీడ

# 5 వికెట్ టేకర్స్ వీరే!

## వరల్డ్ కప్ హిస్టరీలో టాప్



**న్యూఢిల్లీ :** కీలక క్రికెట్ టోర్నీ మొదలయ్యే ముందు అందరి దృష్టి గత రికార్డుల మీదకు వెళ్తుంది. ఈ సారి బద్ధలయ్యే రికార్డులు, టాప్ పర్ఫార్మెర్లపై అంచనాలు వినిపిస్తుంటారు. అయితే జూన్ 2 నుంచి యుఎస్‌ఎ, కెనడా మ్యాచ్‌తో 2024 టి20 వరల్ కప్‌కి తెర లేవనుంది. బ్యాటర్లదే ఆధిపత్యంగా మారిన టీ20 ఫార్మాట్‌లో కొందరు బౌలర్లు కూడా అద్భుతంగా రాణించారు. ఇప్పటి వరకు టీ20 ప్రపంచ కప్‌లో అత్యధిక వికెట్లు తీసిన టాప్ ఫైవ్ బౌలర్ల గురించి ఇప్పుడు చూద్దాం. కానీ ఈ లిస్టులో ఒక్క టీమ్ ఇండియా బౌలర్ కూడా లేకపోవడం గమనార్హం.

**అజంతా మెండిస్:** శ్రీలంకకు మిస్టరీ స్పిన్నర్ అజంతా మెండిస్ టీ20 ప్రపంచకప్‌లో అద్భుతంగా రాణించాడు. అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ఐదో స్థానంలో ఉన్నాడు. మెండిస్ 21 మ్యాచుల్లో 35 వికెట్లు పడగొట్టాడు. అతని ఎకానమీ 6.7 మాత్రమే కావడం గమనార్హం.

**సయీద్ అజ్మల్:** పాకిస్థాన్ మాజీ ఆఫ్ స్పిన్నర్ అజ్మల్ లిస్టులో నాలుగో స్థానంలో నిలిచాడు. అతను టీ20 వరల్ కప్‌లో మొత్తం 23 మ్యాచుల్లో 36 వికెట్లు పడగొట్టాడు. ఈ స్థాయిలో రాణించిన అజ్మల్, తన బౌలింగ్ యాక్షన్‌పై వచ్చిన కాంట్రవర్సీలతో కెరీర్ కోల్పోయాడు.

**లసిత్ మలింగ:** శ్రీ లంక మాజీ బౌలర్ లసిత్ మలింగ మూడో స్థానంలో ఉన్నాడు. అతను మినీ ప్రపంచ కప్‌లో మొత్తం 31 మ్యాచుల్లో 38 వికెట్లు పడగొట్టాడు. టోర్నమెంట్‌లో ఐదు వికెట్లు ప్రదర్శించిన అతికొద్ది మంది బౌలర్లలో మలింక ఒకడు.

**షాహిద్ అఫ్రిది:** పాకిస్థాన్‌కు చెందిన మాజీ ఆల్ రౌండర్ అఫ్రిది లిస్టులో రెండో స్థానంలో ఉన్నాడు. టీ20 వరల్ కప్‌లో మొత్తం 34 మ్యాచుల్లో 6.71 ఎకానమీతో 39 వికెట్లు పడగొట్టాడు. ఈ లెగ్‌స్పిన్నర్ తన బౌలింగ్‌తో పాకిస్థాన్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు.

**షకీబ్ అల్ హసన్:** బంగ్లాదేశ్ ఆల్ రౌండర్ షకీబ్, 47 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఇప్పటి వరకు 36 మ్యాచుల్లో 6.78 ఎకానమీతో 47 వికెట్లు తీశాడు. అతను వెస్టిండీస్ పిచ్‌లపై ఏడు మ్యాచుల్లో ఏడు వికెట్లు తీయగా, యూఎస్‌ఏలో ఐదు మ్యాచుల్లో నాలుగు వికెట్లు తీశాడు. ఈ స్టార్ ఆల్‌రౌండర్‌కి ఇది చివరి టీ20 వరల్ కప్ కావచ్చు. ప్రస్తుతం రవిచంద్రన్ అశ్విన్ 24 మ్యాచుల్లో 32 వికెట్లతో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ఏడో స్థానంలో ఉన్నాడు. అయితే టీ20 వరల్ కప్ 2024కి రవిచంద్రన్ అశ్విన్ ఎంపిక కాలేదు.

## 'గంటలు తరబడి మీటింగ్ రూమ్స్‌లో!

### రోహిత్ కెప్టెన్సీ మంత్ర ఏంటంటే?

**న్యూఢిల్లీ :** టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ పగ్గాలు అందుకున్నప్పటి నుంచి జట్టును అద్భుతంగా నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో అనేక మంది మాజీల ప్రశంసలను కూడా అందుకుంటున్నాడు. గతేడాది భారత్‌లో జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లోనూ జట్టును వరుసగా 10 మ్యాచ్‌ల్లోనూ జట్టును విజయ తీరాలకు చేర్చాడు. అయితే గ్రౌండ్‌లో తన వ్యూహాలు ఎలా ఉంటాయి? ప్లేయర్లను ఎలా మేనేజ్ చేస్తాడు? అనే పలు ఆసక్తికర అంశాలపై హిట్ మ్యాన్ తాజాగా ఓ స్పోర్ట్స్ ఛానెల్ వేదికగా జరిగిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. 'ఓ కెప్టెన్‌గా నేను చాలా వరకు డేటాపై ఆధారపడి పని చేస్తాను. దాన్ని విశ్లేషించి ఆ తర్వాత జట్టుకు తగ్గట్లుగా ప్లాన్స్ రెడీ చేసుకుంటాను. కొత్త ట్రెండ్లను గుర్తించడానికి కూడా నాకు ఎంతో ఉపయోగపడుతుంది. దాని కోసం గంటల కొద్దీ మీటింగ్ రూముల్లోనే గడుపుతుంటాను. ముఖ్యంగా మ్యాచ్‌లో ఊహించని పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలనేదానిపై కూడా సిద్ధమవుతుంటాను. పరిస్థితులపై అవగాహన ఉండటం చాలా కీలకం. ఇక మైదానంలోకి దిగే సమయానికి అన్ని రకాల ఇబ్బందులను ఎదుర్కోవడానికి కూడా నేను రెడీగా ఉంటాను. నా ప్లానింగ్ ఇలానే ఉంటుంది. కానీ, ఇటువంటి విషయాలను చెప్పి జట్టు సభ్యుల మెదళ్లను నింపేయను. ఎవరికి ఏది అవసరమో, ఎంతవరకు ముఖ్యమో అవే చెప్తాను. ఇక ప్రత్యర్థులు మమ్మల్ని ఎదుర్కోవడానికి ఎలా సిద్ధమవుతున్నారో కూడా తెలుసుకోవాలని అనుకుంటాను' అంటూ రోహిత్ పేర్కొన్నాడు. కెప్టెన్‌గా ఆటగాళ్లను సమన్వయం చేసుకోవడం అతిపెద్ద సవాలని రోహిత్ అన్నాడు. 'ప్రతి ప్లేయర్ ఆలోచించే విధానం విభిన్నంగా ఉంటుంది. అలాగే వారి అవసరాలు కూడా వేర్వేరుగానే ఉంటాయి. అటువంటి విషయాలను నేను ఓ కెప్టెన్‌గా తెలుసుకోవాలి. అవసరాన్ని బట్టి వాటిపై స్పందించాలి. ఇక ప్రతి ఆటగాడికి మిగిలిన వారితో సమప్రాధాన్యం కూడా ఇవ్వాలి. అప్పుడే అతడు టీమ్‌లో ఓ భాగంగా ఫీల్ అవుతాడు. ఎవరైనా మన దృష్టికి ఓ సమస్యను తీసుకొస్తే, దాన్ని ఎంతో జాగ్రత్తగా విని దాన్ని సాల్వ్ చేయాలి. వీటన్నింటితో పాటు నేను ఓ కెప్టెన్‌గానే కాకుండా, ప్లేయర్‌గానూ సిద్ధమవ్వాలి.'అని రోహిత్ చెప్పుకొచ్చాడు.'నువ్వు బ్యాటింగ్ చేయడం నేనైతే చూడలేదు'

## కుల్దీప్‌పై రోహిత్ సెటైర్



**న్యూఢిల్లీ :** టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మధ్య తాజా సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఐసీసీ లేటెస్ట్‌గా 'టీమ్ ఆఫ్ ది వన్డే 2023' జట్టును ప్రకటించింది. అయితే ఆ జట్టుకు రోహిత్ శర్మ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. రోహిత్ సహా మరో 5గురు (విరాట్ కోహ్లి, కుల్దీప్ యాదవ్, శుభ్‌మన్ గిల్, మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమీ) ఆ జట్టులో స్థానం దక్కించుకున్నారు. ఈ క్రమంలో కుల్దీప్‌కు 'ఐసీసీ వన్డే టీమ్ ఆఫ్ ది ఇయర్' క్యాప్‌ను రోహిత్ అందించాడు. క్యాప్ అందుకున్న కుల్దీప్‌ను రోహిత్ మాట్లాడవల్సిందిగా కోరాడు. దీంతో 'చెప్పడానికి పెద్దగా ఏమీ లేదు. గతేడాది నేను బౌలింగ్‌తోపాటు బ్యాటింగ్‌లోనూ బాగా రాణించాను' అని కుల్దీప్ అన్నాడు. దీనికి వెంటనే రోహిత్ షాకింగ్ రియాక్షన్ ఇచ్చాడు. 'బ్యాటింగా? నువ్వు ఎప్పుడు బ్యాటింగ్ చేశావు?' అని అడిగాడు. అప్పుడు కుల్దీప్ టెస్టు సిరీస్‌లో అని బదులివ్వగా, 'ఇది వన్డే టీమ్' అని రోహిత్ అన్నాడు. అయినప్పటికీ 'నేను బ్యాట్‌తో కూడా మంచి ప్రదర్శన చేశాను'అని కుల్దీప్ చెప్పగానే, 'నేను ఈ జట్టుకు కెప్టెన్. అతడు ఎప్పుడు బ్యాటింగ్ చేయడం నేను చూడలేదు. అతడు ఏం మాట్లాడుతున్నాడో నాకైతే తెలీదు' అని రోహిత్ ఫన్నీగా కౌంటర్ ఇచ్చాడు. దీంతో డ్రెస్సింగ్ రూమ్ కాసేపు సరదాగా మారిపోయింది. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. రోహిత్ రియాక్షన్స్ ఫన్నీగా ఉన్నాయంటూ నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.



## 'మనమే' 'టప్పా టప్పా' పాట విడుదల

రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో శర్వానంద్ 'మనమే' మేకర్స్ ప్రమోషన్స్ డోస్ పెంచారు. మ్యూజికల్ ప్రమోషన్స్ కూడా శరవేగంగా జరుగుతున్నాయి. మొదటి రెండు పాటలు ఇప్పటికే చార్ట్ బస్టర్స్ అయ్యాయి. ఈ రోజు మేకర్స్ మూడవ సింగిల్ టప్పా టప్పా పాటని విడుదల చేశారు. ఈ పాటను ఈ సంవత్సరం పెళ్లి పాటగా ప్రమోట్ చేస్తున్నారు, ఈ అందమైన పాటను విని, కలర్ విజువల్స్ చూసిన తర్వాత అందరూ దీనిని అంగీకరిస్తున్నారు. హేషామ్ అబ్దుల్ వహాబ్ అందరూ ఎంజాయ్ చేసే పర్ఫెక్ట్ వెడ్డింగ్ సాంగ్‌ని అందించారు. ప్రోగ్రామింగ్, ఆర్కెస్ట్రేషన్ అద్భుతంగా ఉన్నాయి. రామ్ మిరియాల, హేశం తమ వోకల్స్‌తో మెస్మరైజ్ చేయగా, కాసర్ల శ్యామ్ సాహిత్యం గుర్తుండిపోతుంది. శర్వానంద్ ఈ పాటలో లైవ్లీగా కనిపించారు. అతని స్టైలింగ్, డ్యాన్స్ అలరించాయి. పాటలో గ్రేస్ ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ చేస్తూ కనిపించారు. ఇందులో కృతి శెట్టి, కిడ్ విక్రమ్ ఆదిత్య కూడా కనిపిస్తారు. విష్ణు శర్మ, జ్ఞాన శేఖర్ వీఎస్ సినిమాటోగ్రాఫర్లు. వివేక్ కూచిభొట్ల సహనిర్మాతగా వ్యవహరిస్తుండగా, కృతి ప్రసాద్, ఫణి వర్మ ఎగ్జిక్యూటివ్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ టెక్నీషియన్ ప్రవీణ్ పూడి ఎడిటర్, జానీ షేక్ ఆర్ట్ డైరెక్టర్. ఈ చిత్రానికి డైలాగ్స్ని అర్జున్ కార్తిక్, రాగూర్, వెంకీ అందించారు. 'మనమే' జూన్ 7న థియేటర్లలో విడుదల కానుంది.

## 'హరోం హర' విడుదల వాయిదా, కామెంట్స్!



టాలీవుడ్ నటుడు సుధీర్ బాబు నటించిన హరోం హర థియేట్రికల్ ట్రైలర్ ఈరోజు విడుదలై ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. కుప్పం బ్యాక్‌డ్రాప్లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సుధీర్ బాబు గన్స్మిత్గా నటిస్తున్నాడు. జ్ఞానసాగర్ ద్వారక దర్శకుడు. ఈ సినిమా జూన్ 14న విడుదలవుతోంది, అయితే ముందుగా మే 31న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో సుధీర్ బాబు విడుదల వాయిదాకు గల కారణాలను వెల్లడించారు.వాస్తవానికి అనేక కారణాలున్నాయి. క్వాలిటీని పెంచడం ద్వారా ప్రేక్షకులకు మంచి అనుభూతిని అందించాలనుకున్నాం. ప్రస్తుతం కేరళలో వర్క్ జరుగుతోంది. కింగ్ ఆఫ్ కొత్త కోసం చేసిన టెక్నీషియన్లు హరోం హర కోసం పనిచేస్తున్నారు. థగ్ లైఫ్లో పనిచేస్తున్న వ్యక్తులు హరోం హర సౌండ్ ఎఫెక్ట్లను పర్యవేక్షిస్తున్నారు. జూన్ 1న ఎగ్జిట్ పోల్స్ వెలువడనున్నాయి, జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెల్లడి అవుతాయి. ఈ అంశాలను పరిశీలించిన తర్వాతే విడుదల వాయిదా వేసినట్లు సుధీర్ బాబు తెలిపారు. ఈ చిత్రంలో మాళవిక శర్మ కథానాయికగా నటిస్తుండగా, చైతన్ భరద్వాజ్ సంగీత దర్శకుడు.

## రీల్

## 'భజే వాయు వేగం' ఈవెంట్‌కు శర్వా

యంగ్ హీరో కార్తికేయ నటిస్తున్న తాజాచిత్రం భజే వాయు వేగం మే 31న రిలీజ్‌కు రెడీ అయ్యింది. ప్రశాంత్ రెడ్డి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా టీజర్, ట్రైలర్లకు ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ దక్కింది. దీంతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించేందుకు చిత్ర యూనిట్ సిద్ధమైంది. కాగా, ఈ వేడుకకు చీఫ్‌గెస్ట్‌గా యంగ్ హీరో శర్వానంద్ హాజరుకానున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. దస్పల్లా హోటల్స్‌లో బుధవారం జరగనున్న ఈ ప్రీరిలీజ్ ఈవెంట్‌కు శర్వా గెస్టుగా వస్తున్నట్లు చిత్ర యూనిట్ కాసేపటి క్రితం ట్వీట్ చేసింది. ఈ సినిమాలో అందాల భామ ఐశ్వర్య మీనన్ హీరోయిన్‌గా నటిస్తోండగా, రవి శంకర్, రాహుల్ హరిదాస్, తని






## 'పుష్ప 2': 'సూసేకు' స్టెప్స్ వేయాల్సిందే!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా నటిస్తోన్న 'పుష్ప ది రూల్' మూవీ కోసం ప్రేక్షకులు ఏ రేంజ్ లో ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, ఫస్ట్ సాంగ్ లకు అదిరిపోయే రెస్పాన్స్ దక్కింది. తాజాగా ఈ సినిమా నుండి సూసేకి లిరికల్ సాంగ్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. చంద్రబోస్ అందించిన చక్కటి లిరిక్స్ కు రాకింగ్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ క్యాచీ ట్యూన్ అందించారు. ప్రముఖ సింగర్ శ్రేయా ఘోషల్ ఈ పాటను పాడిన తీరు మ్యూజిక్ లవర్స్ ను అమితంగా ఆకట్టుకుంటోంది. ఇక ఈ పాట ఖచ్చితంగా చార్ట్ బస్టర్ గా నిలుస్తుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 'పుష్ప ది రూల్' మూవీని ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 15న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తుందా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## భారత జాతీయ భద్రత విషయంలో బిజెపిని విశ్వసించలేము

**న్యూఢిల్లీ :** భారత జాతీయ భద్రత విషయంలో బిజెపిని విశ్వసించలేమని గడిచిన పదేళ్ళలో స్పష్టమైందని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. నరేంద్ర మోదీ హయాంలో అగ్నివీర్ వైఫల్యం, సైనిక బలగం కొరత, చైనాకు క్లీన్ చిట్ వంటి వైఫల్యాలను ఆయన ఊటంకించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం జూన్ 4న బాధ్యతలు స్వీకరించిన వెంటనే న్యాయ్ పత్ర (కాంగ్రెస్ మ్యానిఫెస్టో)లో పేర్కొన్న జాఆతీయ భద్రతకు సంబంధించిన వాగ్దానాలను అమలు చేస్తామన్నారు. సైనిక బలగాల సంఖ్యను పునరుద్ధరిస్తామని, అగ్నివీర్ వంటి నిరాశ పూరిత పథకాన్ని నిలిపివేస్తామని, చైనా సంక్షోభాన్ని ఎదుర్కొంటామని తెలిపారు. ఈమేరకు జై రామ్ రమేశ్ తన 'ఎక్స్' ఖాతాలో గురువారం పోస్ట్ చేశారు.

## పత్యామ్నాయ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు

**న్యూఢిల్లీ :** దేశ ప్రజలు జూన్ 4న ప్రత్యామ్నాయ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పును ఇస్తారని, ఇండియా కూటమి సమ్మిళిత, జాతీయభావ ప్రభుత్వం స్పష్టమైన మెజారిటీ సాధిస్తుందని ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ విభజనవాద ప్రచారాన్ని సాగించారని, మందిర్ – మసీదు పేరును, విభజనవాద అంశాలను 421 సార్లు వినియోగించారని, అలాగే ముస్లిం, పాకిస్తాన్, మైనారిటీ పదాలను 224 సార్లు వాడారని తెలిపారు. అయినప్పటికీ ఎన్నికల సంఘం ఎలాంటి చర్య తీసుకోలేదన్నారు. ఆయన ప్రధాన మంత్రి గౌరవాన్ని దిగజార్చారని విమర్శించారు. గడిచిన 15 రోజుల మోదీ ప్రసంగంలో కాంగ్రెస్ పేరును 232 సార్లు, ఇండియా కూటమి, ప్రతిపక్షాల పేర్లను 573 సార్లు ప్రస్తావించగా, తన సొంత పేరును 758 సార్లు ప్రస్తావించారని ఖర్గే అన్నారు. ఒక్కసారి కూడా నిరుద్యోగం, ధరల పెరుగుదల గురించి మాట్లాడలేదన్నారు. గాంధీ సినిమా వచ్చిన తరువాతే మహాత్మాగాంధీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్న ప్రధాని వ్యాఖ్యలకు స్పందిస్తూ ఆయన గాంధీ గురించి చదవనట్లుందని, మహాత్మాగాంధీ ఎప్పటి నుంచో ప్రపంచవ్యాప్తంగా తెలుసునని అన్నారు. ఇది ఆయన అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వానికి మరొకసారి అవకాశమిస్తే ప్రజాస్వామ్యానికి అంతం తప్పదనే అభిప్రాయంతో ప్రజలు స్పష్టంగా ఉన్నారని చెప్పారు. ఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ ఇండియా కూటమి విజయం తరువాత ప్రధాన మంత్రి ఎవరనే అంశంపై కూటమిలో భాగస్వాములతో చర్చల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. తామంతా సమిష్టిగా దేశానికి సమ్మిళిత, జాతీయభావ, యుపిఎ 1, యుపిఎ 2 తరహాలో అభివృద్ధి ఆధారిత ప్రభుత్వాన్ని అందిస్తామని,ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు సాగుతామని చెప్పారు. తాము కూటమిలో ఉన్నామని, భాగస్వాములందరినీ పిలుస్తామని, ప్రతి ఒక్కరి అభిప్రాయాన్ని తీసుకుంటామని, కూటమి సభ్యులు చెప్పిన దాని ఆధారంగా ప్రధాని ఎవరో నిర్ణయం తీసుకుంటామన్నారు. యుపిఎ 1 ఏర్పాటైనప్పుడు సోనియాగాంధీ ప్రధాన మంత్రి కావాలని ప్రతి ఒక్కరూ భావించారని, కాని ఆమె కాలేదని, మన్మోహన్‌సింగ్‌ను ప్రధానిని చేశారని గుర్తు చేశారు.

### దళితుడిగా ప్రధాని పదవి అడగను

దేశం దళిత ప్రధాన మంత్రిని చూడబోతుందా? అని అడిగిన ప్రశ్నకు మల్లిఖార్జున ఖర్గే సమాధానమిస్తూ తనకు గతంలో అనేక అవకాశాలు లభించాయని, ఎన్నడతూ తాను దళితుడిని అని, ఆ పదవి కావాలి, ఈ పదవి కావాలని అడగలేదని అన్నారు. తనకు ప్రతి ఒక్క పదవిని పార్టీనే ఇచ్చిందని, సోనియాగాంధీ ఇచ్చారని తెలిపారు. ఆమె తనను ప్రతిపక్ష నాయకుడిని చేశారని, అలాగే ఎఐసిసి అధ్యక్షుడిని కూడా చేశారని తెలిపారు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా, దానికి అనుగుణంగా నడుచుకుంటామని చెప్పారు. కేవలం తాను దళితుడినైనందునే ఏదైనా కావాలని అడగబోనని స్పష్టం చేశారు.

# జవాన్లను మజ్దూర్‌గా మార్చిన మోదీ

### జగన్నాథుడు మోదీకి భక్తుడంటూ ఒడిశా ప్రజలను అవమానిస్తున్నారు : రాహుల్‌గాంధీ

**బాలాసోర్ :** అగ్నివీర్ పథకం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ జవాన్లను మజ్దూర్‌గా మార్చారని కాంగ్రెస్ జాతీయనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. జగన్నాథుడు మోదీకి భక్తుడని ఇటీవల ఓ బిజెపి నేత వ్యాఖ్యానించడం ఒడిశా ప్రజలను అవమానించడమేనన్నారు. భద్రక్ లోక్ సభ సీటులోని సిములియాలో గురువారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేస్తూ, ఇండియా కూటమి ప్రభుత్వం ఆహారధాన్యాలపై ఎంఎస్‌పిని చట్టబద్ధం చేస్తుందని, వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తుందని, అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తుందని ప్రకటించారు. 'మేము అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయబోతున్నాం. ప్రధానమంత్రి జవాన్లను 'మజ్దూర్లు'గా మార్చారు. మేము జవాన్లను మళ్లీ సైనికులుగా మారుస్తాము' అని రాహుల్ ఉద్ఘాటించారు. జవాన్లందరికీ పెన్షన్, క్యాంటీన్ సౌకర్యాలు, వారు మరణిస్తే షహీద్ గౌరవం లభిస్తుందని ఆయన తెలిపారు. బిజెడి బి జెపి భాగస్వామ్యంతో పనిచేస్తుందని రా హుల్ ఆరోపించారు. కేంద్రం తనపై 24 పరువు నష్టం, క్రిమినల్ కేసులు పెట్టినా కాషాయ పార్టీకి వ్యతిరేకంగా పోరాడుతున్నానన్నారు. ఇడి తనను 50 గ ంటలపాటు ప్రశ్నించిందని, తన




లోక్‌సభ సభ్యత్వాన్ని బిజెపి లాక్కుందని, తన అధికారిక నివాసాన్ని కూడా తీసేకుందని వి మర్శించారు. ఒడిశా సిఎం నవీన్ బాబు నిజంగా బిజెపికి వ్యతిరేకంగా పోరిడితే ఇలాంటి కేసులు ఆయనపై బిజెపి ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. బిజెపి, బిజెడి రెండు కూడా కోటీశ్వర్ల కోసం పనిచేస్తున్నాయని, పేద ప్రజల కోసం కాదని ఆయన ఆరోపించారు. ఇక్కడ ప్రభుత్వా న్ని పట్నాయక్ సన్నిహితుడు వీకే పాండియ న్ నడుపుతున్నారు తప్ప ముఖ్యమ ంత్రి కాదన్నారు. ఒడిశా సంపదను బిజెడి, బిజెపి రెండూ దోచుకుంటున్నాయని ధ్వజమెత్తారు. తెలంగాణలో బిఆర్‌ఎస్, బిజెపి మధ్య పొత్తు ఉందని, అయితే కాంగ్రెస్ ఆ రెండు పార్టీలపై పోరాడి వారి వెన్నెముకను విరిచిందన్నారు. ఈ రోజు ద క్షిణాది రాష్ట్రంలో ప్ర జా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. పే ద ప్రజలకు కోట్లాది రూపాయలు అందజేస్తున్నామని, మహిళ లు ఉచితంగా బస్సు ల్లో ప్రయాణిస్తున్నార ని, ఒడిశాలో దానిని పున రావృతం చేయబో తున్నామని, బి జెడి, బిజెపి భాగస్వా మ్య ప్రభుత్వాన్ని గ ద్దె దించాలన్నారు. బి జెపి ప్రభుత్వం రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందని, రైతుల రుణాలను కాంగ్రెస్ మాఫీ చేస్తుందన్నారు. ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత, రైతులు, ని రుద్యోగ యువకులు, ఇతరుల కోసం మహాలక్ష్మి యోజన, ఇతర పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. రైతులకు ఆహారధాన్యాలపై ఎంఎస్‌పి చట్టబద్ధతకు కట్టుబడి ఉన్నామన్నారు.

ప్రజ్వల్ అరెస్టుకు రంగం సిద్ధం

## బెంగళూరు విమానాశ్రయంలో సిట్ కాపు

న్యూఢిల్లీ: కర్నాటకలోని హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అరెస్టుకు రంగం సిద్ధమైంది. భారత్‌లో అడుగు పెట్టిన వెంటనే ఆయనను అరెస్టు చేస్తారు. ఇందుకోసం సిట్ అధికారులు బెంగళూరు విమానాశ్రయంలో ప్రజ్వల్ కోసం కాపు కాశారు. ప్రజ్వల్ గురువారం సాయంత్రం 6 గంటలకు మునిచ్ నుంచి బయల్దేరగా, ఆయన విమానం అర్ధరాత్రి 2 గంటలకు కెంపగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుతుంది. లుకౌట్ నోటీసు జారీ అయినందున ఇమిగ్రేషన్ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకుంటారు. ఆపై సిట్‌కు అప్పగిస్తారు. ఒక వేళ ప్రజ్వల్ రాకపోతే ఆయన పాస్‌పోర్టు రద్దు వంటి చర్యలు తీసుకుంటామని కర్నాటక ప్రభుత్వం ఇంతకుముందే స్పష్టంచేసింది. విమానాశ్రయంలో దిగిన వెంటనే ప్రజ్వల్‌ను అదుపులోకి తీసుకుంటామని కర్నాటక హోంమంత్రి జి.పరమేశ్వర వెల్లడించారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజ్వల్ తప్పించుకునేందుకు అవకాశం లేదని చెప్పారు. అయితే ముందస్తు బెయిల్ కోసం ప్రజ్వల్ పెట్టుకున్న పిటిషన్‌ను ప్రజా ప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం తిరస్కరించింది. సిట్ దరఖాస్తు మేరకు ప్రజ్వల్ అరెస్టునకు వారెంట్‌ను కోర్టు ఈనెల 18వ తేదీన జారీ చేసింది. మహిళలను అపహరించినట్లు ఆరోపణలు రావడంతో ప్రజ్వల్ తండ్రి, జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణను సిట్ అదుపులోకి తీసుకుంది. ప్రజ్వల్ తల్లి భవానీ రేవణ్ణకు ముందస్తు బెయిల్‌పై శుక్రవారం విచారణ జరగనుంది. కాగా, జేడీ(ఎస్) అధినేత, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మనుమడు, ఎన్డీయే హసన్ లోక్‌సభ అభ్యర్థి ప్రజ్వల్ (33)పై అత్యాచారం, లైంగిక వేధింపుల కేసున్నది. ఏప్రిల్ 27న ప్రజ్వల్ జర్మనీకి పారిపోయారు. ఆయన ఆచూకీ కోసం బ్లూ కార్నర్ నోటీసును ఇంటర్‌పోల్ జారీచేసింది. అయితే తాను భారత్‌కు తిరిగివస్తానంటూ ప్రజ్వల్ ఓ విడియో పంపారు. ప్రజ్వల్ రేవణ్ణ డిప్లొమాటిక్ పాస్‌పోర్టు రద్దు చేసే ప్రక్రియను విదేశీ వ్యవహారాల శాఖ ఇప్పటికే మొదలు పెట్టింది. ఆయనకు ఈనెల 23న షోకాజ్ నోటీసు ఇచ్చింది. దీనిపై స్పందించేందుకు పది రోజుల గడువు ఇచ్చింది. సమాధానం కోసం చూస్తున్నాం... దానిని బట్టి భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని ఎంఈఏ అధికార ప్రతినిధి రంధీర్ జైశ్వాల్ వెల్లడించారు.

## 'అగ్నిబాణ్' ప్రయోగం విజయవంతం

**విశాలాంధ్ర /సూళ్లూరుపేట:** ప్రపంచ అంతరిక్ష మార్కెట్లను తమ వైపు ఆకర్షించేందుకు భారత్ మరో కీలక ముందడుగు వేసింది. ప్రత్యేకశ్రేణి ఉపగ్రహాలను వీలైనంత వేగంగా... కారు చౌకగా కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు వీలుగా ప్రయోగం చేపట్టింది. చెన్నై ఐఐటీ కేంద్రంగా పనిచేసే అగ్నికుల్ సంస్థ 'అగ్నిబాణ్' పేరిట తొలిసారి సబ్ ఆర్బిటాల్ టెక్నాలజీ డెమానిస్ట్రేటర్ ప్రయోగాన్ని నిర్వహించింది. గురువారం ఉదయం 7.15 గంటల సమయంలో దీనిని ప్రయోగించినట్లు ఇస్రో ప్రకటించింది. ఇందులో తొలిసారి సెమీ క్రయోజనిక్ ఇంజిన్ లిక్విడ్ ఇంజిన్ కంట్రోల్డ్ ఫ్లైట్ నిర్వహించినట్లైంది. ఇస్రో ఛైర్మన్ సోమ్‌నాథ్ కూడా అగ్నికుల్ కాస్మోస్ సంస్థను అభినందించారు. వాస్తవానికి ఈ ప్రయోగం నెలన్నర క్రితమే జరగాల్సింది. నాలుగుసార్లు వాయిదా పడింది. ఐదోసారి విజయవంతంగా పూర్తి చేసుకొంది. ఈ ప్రయోగం దాదాపు రెండు నిమిషాలపాటు ఒకే దశలో జరిగింది. దీనిలో ప్రపంచంలోనే తొలిసారి తయారుచేసిన సింగిల్‌పీస్ త్రీడీ ప్రింటెడ్ సెమీ క్రయోజనిక్ ఇంజిన్‌ను అమర్చారు. దీనిపై అగ్నికుల్ కాస్మోస్‌కు పేటెంట్ ఉంది. ఇది సబ్‌కూల్డ్ ద్రవ ఆక్సిజన్ ఆధారంగా ఒక స్టేజిలోనే పని చేసింది. ఈ వ్యవస్థను పూర్తిగా దేశీయంగానే అభివృద్ధి చేశారు. దీర్ఘ వత్తాకార ముక్కుతో ఉన్న ఈ రాకెట్ పొడవు 6.2 మీటర్లు. దీని లోపలే ఉపగ్రహాన్ని అమర్చారు. ఈ రాకెట్‌లో తొలిసారి ఈథర్‌నెట్ ఆధారంగా పనిచేసే ఏవియానిక్స్ వ్యవస్థను వాడారు. పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేసిన ఆటోపైలెట్ కంట్రోల్ సిస్టమ్‌ను ఇందులో వినియోగించారు. ఒకవేళ ప్రయోగం అదుపుతప్పితే తక్షణమే దానిని నాశనం చేసేలా ఇస్రో అభివద్ధి చేసిన ఫ్లైట్ టర్మినేషన్ వ్యవస్థను దీనిలో అమర్చారు. అనేకరకాల లాంచర్ల నుంచి ప్రయోగించేలా దీనిని నిర్మించారు. 300 కిలోలలోపు బరువున్న ఉపగ్రహ ప్రయోగాలకు వెంటనే అవకాశాలు దొరకవు. ఇలాంటి వాటి కోసం అగ్నికుల్ నిర్మించిన రాకెట్ సరిపోతుందని భావిస్తున్నారు. ఈ మొత్తం ప్రయోగం దాదాపు రెండు నిమిషాలు మాత్రమే జరిగింది. ప్రయోగం ముగిశాక రాకెట్ సముద్రంలో కూలిపోయింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్‌సెంటర్‌లో ఏర్పాటుచేసిన తొలి ప్రైవేటు లాంచ్ ప్యాడ్ ఏఎల్‌పీ01 ఈ ప రీక్షకు వేదికైంది. ఈ రాకెట్ ప్రయోగించిన త ర్వాత నాలుగు సెకన్ల సమయంలో నిర్ణీత ది శకు మళ్లింది. 1.29 నిమిషాల సమయానికి ఇది నిర్దేశిత ప్రదేశానికి చేరి... అక్కడినుంచి తిరిగి సముద్రంలో పడింది. అగ్నికుల్ ఇంజిన్, ఆకారం వాటిని విశ్లేషించి మరింత మెరుగుపర్చడానికి ఈ రెండు నిమిషాల పరీక్ష ఉపయోగపడనుంది. ప్రయోగం విజయవంతం కావడంపై కేంద్ర మంత్రి రాజీవ్‌చంద్రశేఖర్ అగ్నికుల్ సంస్థను అభినందించారు.

## కేజ్రీవాల్ బెయిల్‌పై రేపు విచారణ

### ఈడీ స్పందన కోరిన ఢిల్లీ కోర్టు

**న్యూఢిల్లీ:** మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జూన్ 1న రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరగనుంది. మనీలాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వాలా వద్దా అన్న అంశమై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్పందనను న్యాయస్థానం కోరింది. ఇందుకు శనివారం వరకు సమయం



ఉన్నట్లు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా ధర్మాసనం తెలిపింది. ఆరోగ్య కారణాలతో మధ్యంతర బెయిల్‌ను మరోవారం పొడిగించాలని కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పైనా ఈడీ వైఖరిని తెలియజేయాలని కోర్టు పేర్కొంది. కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్ శుక్రవారంతో ముగియనుంది. ఇది లావుంటే జూన్ 9వ తేదీ వరకు మధ్యంతర బెయిల్ పొడిగించాలని కేజ్రీవాల్ పిటిషన్ పెట్టుకోగా దీనిపై అత్యవసర విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు కూడా నిరాకరించింది. దీంతో జూన్ 2న తీహార్ జైలులో కేజ్రీవాల్ లొంగిపోవల్సి ఉన్నది.

### వైద్యులు సూచన మేరకే: అతిశీ

కేజ్రీవాల్ ఈడీ కస్టడీ, జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నప్పుడు ఏడు కిలోల బరువు తగ్గారని, దీనిపై వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారని విలేకరుల సమావేశంలో ఢిల్లీ మంత్రి అతిశీ తెలిపారు. కస్టడీ నుంచి బయటకు వచ్చి వైద్యుల పర్యవేక్షణలో ఉన్నప్పటికీ కేజ్రీవాల్ బరువు పెరగలేదని చెప్పారు. ఇంతకుముందు జరిపిన పరీక్షల్లో ఆయన శరీరంలో కీటోన్ స్థాయి గరిష్ఠంగా ఉన్నట్లు తేలిందన్నారు. బరువు తగ్గిపోవడం, కీటోన్ స్థాయి ఎక్కువగా ఉండటమంటే మూత్రపిండాలు దెబ్బతినడం లేక కేన్సర్ వంటి వ్యాధికి సంకేతం కావచ్చని అతిశీ తెలిపారు. ఆయన పెట్ స్కాన్‌లు, ఇతర పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించినందునే మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలని కోరుతూ కేజ్రీవాల్ కోర్టును ఆశ్రయించినట్లు ఆమె తెలిపారు.